తెలంగాణ జాతీయ దినపత్రిక
ప్రజా మంటలు
సంపుటి : 4
సంచిక : 92
పేజీలు - 8
వెల- రూ 5:00
www.prajamantalu.com
ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు
బుధవారం 20, సెప్టెంబర్-2023

## కాంగ్రెస్, బిజెపి రెండూ దొందు పార్టీలే


3లో..

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri Bhuvanagiri



# హుస్నాబాద్ "రాజకీయ"రంగేళి

# రసవత్తరం

- హుస్నాబాద్ బిఆర్ఎస్ బాద్షా సతీష్ కుమార్ బిందాస్....
- కాంగ్రెసులో ప్రవీణ్ వర్సెస్ ప్రభాకర్ పోటీ...
- చతుర్ముఖ చదరంగంలో బిజెపి పోటీ....
- జెఎస్ఆర్, శ్రీరామ్, రాంగోపాల్, మంజులక్క
- సిపిఐలో అంతర్మధనం... చాడా ఏక పక్షామా..? పొత్తులా..? తేల్చుకోలేని వైనం

2లో..

(ప్రజామంటలు ప్రతినిధి కాశిరెడ్డి ఆదిరెడ్డి ప్రత్యేక కథనం)

హుస్నాబాద్ నియోజకవర్గం :



ప్రస్తుతం హుస్నాబాద్ నియోజకవర్గంలో ప్రధాన పార్టీలు పూర్తిగా ఫోకస్ చేస్తున్నాయి. ఏ చిన్న అవకాశాన్ని ప్రధాన రాజకీయ పార్టీలు వదులుకోవ ట్లేదు. అయితే తాజా విషయం ఏంటంటే.. కాంగ్రెస్ బరిలో ఇద్దరు ప్రవీణ్ రెడ్డి వర్సెస్ ప్రభాకర్ టికెట్ నాదంటే నాదేనని కార్యకర్తల్లో కన్ఫ్యూషన్ కు తెర లేపారు. బిజెపిలో తాజాగా సామాజిక సేవకురాలు కర్ణ కంటి మంజులారెడ్డి చేరడంతో టికెట్ ఆశావాహులలో చతుర్ముఖ పోటీ నెలకొంది. ఒకే పార్టీలో ఉన్న వాళ్లు బరిలో నేనంటే నేనే ఉన్నానని కార్యకర్తలకు అర్థంకాని పరిస్థితి ఉంది. హుస్నాబాద్ నియోజకవర్గంలో ప్రస్తుతం అదే ట్రెండ్ కనిపిస్తోంది. అయితే అందరూ అధిష్టానం అనుమతితోనే బరిలో ఉంటున్నామని చెప్పడం గమనార్హం.



## మహిళా బిల్లుపై సోనియాగాంధీ స్పందన

న్యూఢిల్లీ,సెప్టెంబర్19 : మహిళా రిజర్వేషన్ బిల్లుకు కేంద్ర క్యాబినెట్ ఆమోదముద్ర వేసిందనే వార్తలపై కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ మంగళవారం స్పందించారు.మహిళా రిజర్వేషన్ బిల్లుకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపిందని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ సింగ్ పటేల్ ట్విట్టర్ వేదికగా ప్రకటించి ఆపై పోస్ట్‌ను డిలీట్ చేసిన మరుసటి రోజు సోనియా రియాక్టయ్యారు. మహిళా బిల్లుపై స్పందించాలని కోరగా కాంగ్రెస్ నేత సోనియా గాంధీ మనదే అని వ్యాఖ్యానించారు. ఇక అన్ని రాజకీయ పార్టీలు బిల్లుకు మద్దతిస్తుండగా మహిళా బిల్లును ప్రవేశపెట్టడానికి మోదీజీ పదేండ్లు ఎందుకు వేచిచూశారు అని కాంగ్రెస్ నేత కపిల్ సిబల్ ట్విట్టర్‌లో ప్రశ్నించారు. మహిళా బిల్లుకు మోదీ సర్కార్ మోక్షం కల్పించడం నిజమైతే 2024 సార్వత్రిక ఎన్నికల కోసమే ఈ బిల్లును ప్రవేశపెడుతున్నారని ఆయన దుయ్యబట్టారు. ఓబీసీ మహిళలకు ప్రభుత్వం కోటా కల్పించని పక్షంలో రానున్న సాధారణ ఎన్నికల్లో యూపీలో బీజేపీకి భంగపాటు తప్పదని కపిల్ సిబల్ హెచ్చరించారు. భారత్ నిజంగా సుసంపన్నం కావాలంటే 50 శాతం జనాభాను నిర్ణాయక ప్రక్రియలో భాగస్వామ్యం కల్పించాలని కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి, రాజ్యసభ ఎంపీ కేసీ వేణుగోపాల్ వ్యాఖ్యానించారు. ఈ బిల్లు ప్రాధాన్యతను సోనియాగాంధీ, మన్మోహన్ సింగ్‌లు గుర్తెరగడంతో మహిళా బిల్లును 2010లో రాజ్యసభలో ఆమోదం పొందేందుకు కృషి చేశారని ఆయన గుర్తుచేశారు. కాషాయ పార్టీకి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా లోక్‌సభలో బిల్లును తక్షణమే ఆమోదించాలని డిమాండ్ చేశారు. మరోవైపు మహిళా మిగతా 2లో..

## పోరాటం వృథా కాలేదు :

స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్



హైదరాబాద్,సెప్టెంబర్19 : జనాభాలో సగమైన తమకు చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల సైతం అమలు చేయాలని పోరాడిన ఎమ్మెల్సీ కవిత ఉద్యమం వృథాకాలేదని, కవిత పోరాటానికి కేంద్ర ప్రభుత్వం తలొగ్గిందని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు కేంద్ర కేబినెట్ ఆమోదించడంపై మంత్రి సత్యవతి స్పందించారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వెనుక ఎమ్మెల్సీ కవిత, బిఆర్ఎస్ కృషి ఉందన్నారు. ఈ పోరాట ఫలితంగా లోక్ సభ, అసెంబ్లీల్లో మహిళలకు 33% రిజర్వేషన్లు దక్కనున్నాయి. మహిళా బిల్లుపై కేంద్రం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. ఆకాశంలో సగం, భూమిలో సగం, అధికారంలో సగం నినాదం అమలు కానుందని చెప్పారు. మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించాలని కేంద్రానికి లేఖ రాసి సీఎం కేసీఆర్ పెద్ద పాత్ర పోషించారని చెప్పారు. మహిళా బిల్లుపై ఎమ్మెల్సీ కవిత నిర్విరామ పోరాటంతో గెలుపు సాధించాం. 33 శాతం రిజర్వేషన్ అమలుతో దేశ వ్యాప్తంగా మహిళలకు గొప్ప అవకాశం దక్కనుందని పేర్కొన్నారు. గతంలోనూ లోక్‌సభలో ఎంపీగా ఎమ్మెల్సీ కవిత అనేక సందర్భాల్లో మహిళా రిజర్వేషన్ బిల్లుతో పాటు మహిళా సాధికారతపై గళం విప్పిన విషయాన్ని గుర్తు చేశారు. మార్చిలో ఎమ్మెల్సీ కవితతో కలిసి మేం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేయడం, రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించినట్లు మంత్రి తెలిపారు. కవిత ఒక్క పిలుపుతో దాదాపు మిగతా 2లో..





# కొత్త పార్లమెంట్‌లోకి అడుగులు



- ప్రధాని మోడీ వెంట నడిచిన మంత్రులు
- సెంట్రల్ హాలు విశేషాలను వివరించిన మోడీ
- ఎన్నో చారిత్రక ఘట్టాలకుని నిలయమని వెల్లడి
- ఇకపై సంవిధాన్ సదన్‌గా పాత పార్లమెంట్
- గ్రూపు ఫోటో దిగిన పార్లమెంట్ సభ్యులు

న్యూఢిల్లీ,సెప్టెంబర్19 : పార్లమెంట్ నూతన భవనంలో భారత్ ప్రయాణం ప్రారంభమైంది. కొత్త చరిత్రలోకి అడుగుపెట్టింది. మంగళవారం పార్లమెంట్ పాత భవనంలోని సెంట్రల్ హాల్‌లో జరిగిన ఉద్విగ్న ప్రసంగం తర్వాత ఉభయ సభ సభ్యులు కొత్త పార్లమెంట్‌కు పాదయాత్రగా వెళ్లారు. ప్రధాని మోదీ ముందు నడవగా.. మంత్రులు, ఎంపీలు 'భారత్ మాతాకీ జై' అంటూ ఆయన్ను అనుసరించారు. అలాగే సెంట్రల్ హాల్‌లోని రాజ్యాంగ పుస్తకాన్ని నూతన భవనంలోకి తరలించారు. లోపలికి వెళ్లిన ప్రధాని కొత్త భవనాన్ని తరచి చూశారు. సభలోకి వెళ్లిన వెంటనే జాతీయ గీతం ఆలపించారు. ఆ తర్వాత సభ్యులు వారి సీట్లలో కూర్చున్నారు. అనంతరం పార్లమెంట్ కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. స్పీకర్ మాట్లాడిన తర్వాత.. ప్రధాని మోదీ తొలి ప్రసంగం చేశారు. 'కొత్త పార్లమెంట్ భవనం ప్రారంభించుకుంటున్న సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. వినాయక చవితి రోజు కొత్త భవనం ప్రారంభించుకోవడం శుభసూచకం. ఆజాదీ అమృత కాలంలో ఇది ఉషోదయ కాలం. కొత్త భవనంలోకి కొత్త సంకల్పం తీసుకొని వెళ్లాలి. చంద్రయాన్ 3 విజయం దేశవాసులను గర్వపడేలా చేసింది. జీ20 సమావేశాల సమర్థ నిర్వహణ భారత ప్రతిష్ఠను పెంచింది. ప్రాచీన ప్రజాస్వామ్య స్ఫూర్తి, ఆధునిక భారతీయతత్వాలకు కలబోత ఈ కొత్త భవనం' అని ఈ సందర్భంగా మోదీ వెల్లడించారు.కొత్త పార్లమెంట్‌కు తరలివెళ్లే ముందు ఉభయ సభల సభ్యులు పాత భవనంలోని సెంట్రల్ హాల్‌లో సమావేశమయ్యారు. పార్లమెంటరీ వారసత్వంపై అందులో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రధాని మోదీమాట్లాడారు. ఈ సెంట్రల్ హాల్ ఎన్నో చారిత్రక ఘట్టాలకు సాక్ష్యంగా నిలిచిందని పేర్కొన్నారు. పాత పార్లమెంట్ భవనం ఇకపై సంవిధాన్ సదన్‌గా ఉండనుందని తెలిపారు. 'పార్లమెంట్‌లో ఈ సమావేశం ఎంతో భావోద్వేగంతో కూడుకుంది. ఈ సెంట్రల్ హాల్ ఎన్నో చారిత్రక ఘట్టాలకు సాక్షి. మన రాజ్యాంగం ఈ సెంట్రల్ హాల్‌లోనే రూపుదిద్దుకుంది. ఆంగ్లేయుల నుంచి రాజ్యాధికారం అందుకున్నది కూడా ఈ సెంట్రల్ హాల్‌లోనే. 1952 నుంచి 41 మంది వివిధ దేశాధ్యక్షులు ఇక్కడే ప్రసంగించారు. రాష్ట్రపతులు 86 సార్లు ఇక్కడ తమ ప్రసంగాలను వినిపించారు. ఇక్కడి నుంచే 4 వేలకుపైగా చట్టాలను ఆమోదించుకున్నాం. అనేక కీలక చట్టాలను ఉమ్మడి సమావేశాల ద్వారా ఆమోదించుకున్నాం. తీవ్రవాద వ్యతిరేక చట్టాలు, ట్రిపుల్ తలాక్ చట్టాలు ఇక్కడే ఆమోదం పొందాయి. ఆర్టికల్ 370 నుంచి విముక్తి కూడా పార్లమెంట్ ద్వారానే జరిగింది. దాంతో ప్రస్తుతం జమ్మూకశ్మీర్ శాంతిపథంలో పయనిస్తోంది' అని ప్రధాని వెల్లడించారు. అలాగే తమ ప్రభుత్వం ఒక్కొక్కటిగా కీలక నిర్ణయాలు తీసుకుంటోందని ప్రధాని చెప్పారు. 'మా ప్రభుత్వం తీసుకుంటోన్న నిర్ణయాలతో భారత్‌లో కొత్త చైతన్యం వస్తోంది. మనం ఎంత వేగంగా నిర్ణయాలు తీసుకుంటామో అంత వేగంగా ఫలితాలు వస్తాయి. సాంకేతికతను అందించడంలో మన దేశ యువత ముందువరుసలో ఉంది. ప్రజల ఆకాంక్షలు ఉజ్వలంగా ఎగసిపడుతున్నాయి. వాటిని అందుకునే ప్రయత్నం నిరంతరం సాగాలి. అందుకే కాలం చెల్లిన చట్టాలకు చరమగీతం పాడి కొత్త చట్టాలను స్వాగతించాలి. పెద్ద నిర్ణయాలు తీసుకోకుండా పెద్ద మార్పులు తీసుకురాలేం. అయిదో ఆర్థిక మిగతా 2లో..

## దేశం కోసం మంచి నిర్ణయాలను తీసుకుందాం

కొత్త భవనంలోకి అడుగుపెట్టగానే.. పాత భవనం హుందాతనం తగ్గిపోదు : మోడీ



న్యూఢిల్లీ,సెప్టెంబర్19 : పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల నేపథ్యంలో సెంట్రల్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రధాని మోదీ మాట్లాడారు. కొత్త పార్లమెంట్ బిల్డింగ్‌లోకి ప్రవేశిస్తున్న నేపథ్యంలో.. పాత పార్లమెంట్ బిల్డింగ్‌ను సంవిధాన్ సదన్‌గా పిలుచుకుందామని ప్రధాని మోదీ అన్నారు. కొత్త బిల్డింగ్‌లోకి వెళ్లినంత మాత్రాన.. పాత పార్లమెంట్ బిల్డింగ్ హుందాతనం ఏమాత్రం తగ్గిపోవద్దు అని అన్నారు. దేశాన్ని ఆత్మ నిర్భరంగా మార్చడమే బాధ్యతగా ఉండాలన్నారు. భవిష్యత్తు కోసం సరైన సమయంలో సరైన నిర్ణయాలు తీసుకోవాలన్నారు. కేవలం రాజకీయ లాభాల గురించి ఆలోచించవద్దు అని, జ్ఞానం-ఆవిష్కరణలపై ఫోకస్ చేయాలన్నారు. చంద్రయాన్-3 సక్సెస్ తర్వాత యువత సైన్స్ మిగతా 2లో..

## ప్రజానాడి




## తెలంగాణపై విషం చిమ్ముతున్న మోడీ

2లో..



## త్వరలో కల సాకారం కాబుతోంది కవిత

2లో..



## కాంగ్రెస్‌ను నమ్మితే నట్టేట ముంచుతారు

### మంత్రి హరీశ్‌రావు

కాంగ్రెస్‌ను గెలిపిస్తే మళ్లీ నీళ్ల కష్టాలు, కరెంట్ కోతలు చూడక తప్పదు


3లో..

prajamantalau daily pages (20-09)(4 pages)_vijayatha pages (11-01) dummy pages 1,2 pages.qxd 9/20/2023 6:55 AM Page 2



# అంగరంగ వైభవంగా బ్రహ్మోత్సవాలు



తిరుమల,సెప్టెంబర్19 : తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు అంగరంగవైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామి వారు చినశేష వాహనంపై తిరుమాడ వీధుల్లో ఊరేగారు. వాహన సేవను తిలకించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. చిన్న శేష వాహనం పైనుంచి స్వామి వారు భక్తులకు అభయ ప్రదానం చేశారు. ఐదు తలల చినశేష వాహనంపై ఊరేగుతున్న మలయప్ప స్వామివారిని చూసి భక్తులు తరించిపోయారు. ఉత్సవాల్లో భాగంగా నేటి రాత్రి శ్రీమలయప్ప స్వామివారు వీణాపాణియై హంస వాహనంపై సరస్వతీమూర్తి అవతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. బ్రహ్మ వాహనమైన హంస పరమహంసకు ప్రతీకగా చెబుతారు. హంస పాలను, నీళ్లను వేరుచేయగల ప్రత్యేకత ఉన్నది. అంటే మంచిని, చెడును గ్రహించగలిగిన అపురూపమైన శక్తిగలది అంటారు.

# యర్రగొండపాలెం సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం




అమరావతి,సెప్టెంబర్19 : ఏపీలోని ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఆర్టీసీ బస్సు అదుపుతప్పి పడిపోవడంతో ఎనిమిదిమంది ప్రయాణికులు గాయపడ్డారు. వివరాల్లోకి వెళ్తే..ఆర్టీసీ ఇంద్ర బస్సు హైదరాబాద్ నుంచి మార్కాపురం వస్తుండగా యర్రగొండపాలెం సమీపంలోని ఎలక చెట్టు వద్దకు రాగానే ప్రమాదవాశాత్తు బస్సు అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎనిమిది మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను హుటాహుటిన108లో యర్రగొండపాలెం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కాగా, ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో తొమ్మిది మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# ఎంఎల్‌సి కవిత చిత్రపటానికి క్షీరాభిషేకం

నిజామాబాద్,సెప్టెంబర్19 : చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల కోసం పోరాడిన ఎమ్మెల్సీ కవిత ఉద్యమం పట్ల సర్వత్రా హర్షం వ్యక్త మవుతున్నది. ఎమ్మెల్సీ కవిత పోరాటానికి తలొగ్గిన కేంద్రం 33 శాతం రిజర్వేషన్ల బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. ఈ నేపథ్యంలో నిజామాబాద్‌లోని భారత్ జాగృతి అధ్వర్యంలో ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయం వద్ద ఎమ్మెల్సీ కవిత చిత్రపటానికి విద్యార్థినులు, మహిళా నేతలు, జాగృతి నాయకులు పా లాభిషేకం చేశారు. మొదట కేసీఆర్ కమాన్ నుంచి క్యాంపు కార్యాలయం వరకు భారీ ర్యాలీగా తరలివచ్చి పాలభిషేకం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎమ్మెల్సీ కవిత పోరాట ఫలితంగానే పార్లమెంట్లో మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందిందని వారు హర్షం వ్యక్తం చేశారు. మహిళల హక్కుల కోసం గళం వినిపించడంలో ఎమ్మెల్సీ కవిత ఎప్పుడూ ముందు ఉంటారని చెప్పారు.

# జగన్‌రెడ్డి వ్యవహారశైలి విడ్డూరం : అశోక్‌బాబు

అమరావతి,సెప్టెంబర్19 : ముఖ్యమంత్రి స్థానంలో ఉండి అనాదిగా వస్తున్న ఆచారాలు, సంప్రదాయాలను హేళన చేసేలా వ్యవహరించడం జగన్ రెడ్డికే చెల్లిందని టీడీపీ ఎమ్మెల్సీ పరుచూరి అశోక్‌బాబు వ్యాఖ్యలు చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. తిరుమలేశుడి సన్నిధిలో జగన్‌రెడ్డి విపరీత చేష్టలు, టీటీడ వ్యవహారశైలిపై సదరు విభాగం ఛైర్మన్, దేవాదాయ శాఖ మంత్రి ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. సతీసమేతంగా స్వామివారికి పట్టువస్త్రాలు ఎందుకు సమర్పించడం లేదో జగన్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. మహాద్వార దర్శనం నిబంధనను అధికారపార్టీ ఎమ్మెల్యే కొడాలినాని ఎందుకు పాటించలేదో టీటీడీ సమాధానం చెప్పాలన్నారు. ప్రపంచప్రఖ్యాతి పొందిన పరమపవిత్ర క్షేత్రంలో జరిగిన తప్పిదం ఏదైనా.. అది ఎంతమాత్రం సమర్థనీయం కాదన్నారు. అధికారంలో ఉన్నామన్న అహంకారంతో హిందూ మతాన్ని, హైందవధర్మాన్ని కించపరిచేలా వ్యవహరిస్తామంటే హిందూ సమాజం క్షమించదని అన్నారు. టీటీడీ వ్యవస్థ హిందువుల మనోభావాలు మంటగలుపి, నిబంధనలు, ఆచారాలు, సంప్రదాయాలు గాలికొదిలి ముఖ్యమంత్రి సేవలో తరించిందని పరుచూరి అశోక్‌బాబు విమర్శలు గుప్పించారు.

# జనసేనకు గ్లాస్ గుర్తు కేటాయింపు

ఢిల్లీ,సెప్టెంబర్19 : కేంద్ర ఎన్నికల సంఘం గ్లాస్ గుర్తును జనసేన పార్టీకే కేటాయించింది. జనసేన పార్టీకి ఎన్నికల గుర్తుగా మరోసారి గ్లాస్ ను కేటాయించినందుకు ఎన్నికల సంఘానికి హృదయపూర్వకంగా కృతజ్ఞతలు అని పేర్కొంటూ ఆ పార్టీ ప్రకటన విడుదల చేసింది. ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు జరిగిన గత సార్వత్రిక ఎన్నికలలో జనసేన అభ్యర్థులు గ్లాస్ గుర్తుపైనే పోటీ చేసిన విషయం తెలిసిందే. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో 137 స్థానాలు, తెలంగాణ నుంచి 7 లోక్‌సభ స్థానాలలో జనసేన అభ్యర్థులు పోటీ చేశారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో జనసేన మళ్లీ పోటీకి సిద్ధమైంది. రిజిస్టర్డ్ పార్టీ అయిన జనసేనకు గ్లాస్ గుర్తును కేటాయిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయంపై హర్షం వ్యక్తం చేసింది. జనసేన పార్టీ తరఫున పార్టీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. జనసేన గాజు గ్లాస్ గుర్తును కేంద్ర ఎన్నికల సంఘం కొంతకాలంకింద రద్దు చేసింది. ఇక పార్టీకి గుర్తు ఉండబోదంటూ ప్రచారం కూడా జరిగింది. కానీ కేంద్ర ఎన్నికల సంఘం పార్టీకి అదే గుర్తును కేటాయించి ఈ ప్రచారానికి చెక్ పెట్టింది.

# మైక్రోసాఫ్ట్‌ను వీడనున్న చీఫ్ ప్రొడక్ట్ అధికారి పనోస్‌పనయ్

## రెండు దశాబ్దాల సేవలకు తెర

న్యూయార్క్,సెప్టెంబర్19 : మైక్రోసాఫ్ట్ చీఫ్ ప్రొడక్ట్ ఆఫీసర్ పనోస్ పనయ్ రెండు దశాబ్దాల సేవల అనంతరం కంపెనీని వీడుతున్నారు. విండోస్ డెవలప్‌మెంట్ చీఫ్‌గా పనిచేస్తున్న పనయ్ మైక్రోసాఫ్ట్ నుంచి వైదొలగుతున్నట్టు అధికారికంగా వెల్లడించారు. మైక్రోసాఫ్ట్‌లో 19 ఏండ్ల అద్భుత ప్రయాణం అనంతరం మరో పేజీకి మరలుతున్నానని, మరో అధ్యాయం లిఖించాలని నిర్ణయించుకున్నానని పనయ్ ట్వీట్ చేశారు. పనయ్ త్వరలో అలెక్సా, ఎకో స్మార్ట్ డివైజ్‌ల బాధ్యతలను చేపట్టేందుకు ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్‌లో అడుగుపెడతారని భావిస్తున్నట్టు బ్లూమ్‌బర్గ్ రిపోర్ట్ వెల్లడించింది. ఇటీవల రిటైర్మెంట్ ప్రకటించిన అమెజాన్ మాజీ ఎగ్జిక్యూటివ్ డేవ్ లింప్ స్థానంలో పనయ్ ఆ బాధ్యతలు చేపడతారని చెబుతున్నారు. ఈ దిశగా అమెజాన్ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెల్లడికాలేదు. ఇక 2004లో పనయ్ మైక్రోసాఫ్ట్‌లో గ్రూప్ ప్రోగ్రామ్ మేనేజర్‌గా అడుగుపెట్టారు. ఆపై 2018లో ఆయన కంపెనీ చీఫ్ ప్రొడక్ట్ ఆఫీసర్ స్థాయికి ఎదిగి విండోస్ 11 క్రియేట్ చేయడంలో కీలక పాత్ర పోషించారు. 2021లో పనయ్ కంపెనీ వైస్ ప్రెసిడెంట్‌గా ప్రమోట్ కావడంతో పాటు మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్లకు సలహాలు ఇచ్చే అత్యున్నత బృందంలో ఒకరిగా ఎదిగారు.

(ప్రజామంటలు ప్రతినిధి కాశిరెడ్డి ఆదిరెడ్డి ప్రత్యేక కథనం)
హుస్నాబాద్ నియోజకవర్గం :
హుస్నాబాద్ నియోజకవర్గంలో "ఎన్నికల రణరంగం" పెంచుతున్న ప్రధాన పార్టీలుఎన్నికల వాడి, వేడి పెరుగుతోంది. అధికార బిఆర్ఎస్ ప్రత్యర్థుల బలాబలాలను అంచనా వేస్తుంది. ప్రత్యర్థి పార్టీలో అభ్యర్థి ఎవరు..? ప్రజల్లో ఆ వ్యక్తికి ఏ స్థాయిలో మద్దతు ఉందన్న కోణంలో రహస్య సర్వేలు చేస్తున్నాయి. కాంగ్రెస్, బిజెపిలు వీలైనంత త్వరగా ఫైనల్ లిస్టు సిద్ధం చేసి అభ్యర్థులను ప్రకటిస్తే... ప్రచార పర్వంలో జోరు పెంచాలని తహతహలాడుతున్నాయి.ప్రస్తుత ఎమ్మెల్యే సతీష్ కుమార్ ఒక వైపు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు మరో వైపు పార్టీ కార్యక్రమాలతో కొన్ని రోజులుగా ప్రజా క్షేత్రంలో ఉంటున్నారు. ఇక 'ట్రబుల్ షూటర్' ఆరోగ్యమంత్రి హరీష్ రావు పాటు కీలక నేతలు కెప్టెన్ లక్ష్మి కాంతారావు, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ లతో పర్యటనలకు శ్రీకారం చుట్టారు.అధిష్టానం దృష్టిలో పడేందుకు కాంగ్రెస్, బిజెపి పోటాపోటీ కార్యక్రమాలుఇప్పటికే కాంగ్రెస్, బిజెపిలు నియోజకవర్గంలో పోటాపోటీ కార్యక్రమాలు చేస్తూ అధిష్ఠానం దృష్టిలో పడేందుకు పలువురు నేతలు ప్రయత్నిస్తున్నారు. నేతల మధ్య సఖ్యత లేకపోవడంపై సైతం ఆయా పార్టీలు ఫోకస్ పెట్టాయి. పోటాపోటీ కార్యక్రమాల వల్ల ప్రజల్లో వ్యతిరేక సంకేతాలు వెళతాయని ఆ పార్టీల అధినాయకత్వం భావిస్తుంది.

### కాంగ్రెస్‌లో ప్రవీణ్ వర్సెస్ ప్రభాకర్

ఇటీవలే బిఆర్ఎస్ నుండి సొంత పార్టీకి చేరిన అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో విస్తృతంగా, గడపగడపకి కాంగ్రెస్, ఇంటింటికి ప్రవీణ్ అన్న పేరుతో ప్రచార పర్వంలో అధికార పార్టీకి ధీటుగా పర్యటించారు. అయితే పొన్నం ఎంట్రీతో కాంగ్రెస్ కార్యకర్తల్లో కన్ఫ్యూషన్ స్టార్ట్ అయింది. యువజన కాంగ్రెస్ నాయకుడి నుండి ఎంపీగా తెలంగాణ రాష్ట్ర సాధనలో "పెద్దన్న" పాత్ర పోషించిన మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ రానున్న ఎన్నికల్లో టికెట్ తనకే వస్తుందని ఆశాభావంతో ముందుకు వెళ్తున్నారు. కాకుండా గత పార్లమెంట్ ఎన్నికల్లో ఒక హుస్నాబాద్ నియోజకవర్గం నుండి తనకు అత్యధిక ఓట్లు పడ్డాయని గుర్తు చేస్తున్నారు

### సతీష్ కుమార్ కు సంక్షేమ పథకాలే శ్రీరామరక్ష ఆశ..

బిఆర్ఎస్ బిందాస్ గా గెలుపు తనదేనంటు సతీష్ కుమార్ ముందుకు సాగుతున్నారు. సంక్షేమ పథకాల్ని విస్తృతంగా అమలు చేస్తున్నారు. ఏదో ఒక పథకం రూపంలో ప్రజల అకౌంట్లలో డబ్బులు పడేలా చూస్తున్నారు. ఈ పథకాలు అందుకున్న లబ్ధిదారులు వాటి కోసమైనా తనకు ఓటు వేస్తారని సతీష్ ధీమాగా ఉన్నారు. ఓవైపు బిజెపి, కాంగ్రెస్, సీపీఐ అధికార బిఆర్ఎస్ ను ఓడించాలని భావిస్తుంటే.. . మూడు పార్టీలు కలిసినా తాను తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని సతీష్ కుమార్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలో ప్రతిపక్షాలు బలపడ్డప్పటికీ, తాను గెలవడం మాత్రం ఖాయం అని సతీష్ కుమార్ విశ్వసిస్తున్నారు.

### సంక్షేమ పథకాలు గట్టెక్కించేనా..?

ప్రస్తుతం అనేక కుటుంబాలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయి. కళ్యాణ లక్ష్మి, రైతుబంధు, రుణమాఫీ, వృద్ధాప్య పింఛన్లు వంటి అనేక పథకాల ద్వారా లబ్ధిదారులకు ప్రతి ఏటా వేల రూపాయల్ని అకౌంట్లలో జమ చేస్తున్నారు. ఈ పథకాలు అందుకున్న లబ్ధిదారులు వాటి కోసమైనా ఓటు వేస్తారని అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు ధీమాగా ఉన్నారు. ఐతే గత పది సంవత్సరాలుగా అధికార పార్టీపై ప్రజా వ్యతిరేకత ఏ స్థాయిలో ఉంటుందో వేచి చూడాలి.

### హుస్నాబాద్‌లో బీజేపీ గెలవడం ఖాయం

ఈసారి హుస్నాబాద్ నియోజకవర్గంలో, రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలవడం ఖాయమని బిజెపి రాష్ట్ర నాయకులు జన్నపురెడ్డి సురేందర్ రెడ్డి, హౌజ్‌ఫెడ్ మాజీ రాష్ట్ర చైర్మన్, బీజేపీ నాయకుడు బొమ్మ శ్రీరాం చక్రవర్తి, కర్ణకంటి మంజులారెడ్డి, కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి ధీమా వ్యక్తం చేస్తున్నారు. వీరి ఆధ్వర్యంలో వివిధ పార్టీలకు చెందిన పలువురు బీజేపీలో చేరగా, వారికి కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,



నియోజకవర్గంలో ఎమ్మెల్యే సతీషకుమార్ ఒక్క డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కూడా నిర్మించలేదని, కేవలం సంక్షేమ పథకాల తైలంతో నెట్టుకొస్తున్నారని విమర్శించారు. పనిచేయని ఎమ్మెల్యేను రానున్న ఎన్నికల్లో ప్రజలు ఓట్లతో తగిన బుద్ధి చెప్పాలన్నారు.

### పొత్తులపై ఆశతోనే హుస్నాబాద్ బరిలో సీపీఐ

రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఎవరితో కలిసి పోటీ చేసేదీ కాంగ్రెస్ పార్టీ ప్రకటించక పోయినా వామపక్షాలతో ఆ పార్టీ పొత్తు ఉంటుందని ప్రచారం జరుగుతోంది. ఈ తరుణంలో సిపిఐ మాజీ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి పొత్తులు ఉన్నా, లేకపోయినా సీపీఐ పోటీ చేస్తుందని ఆ పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. కొద్ది నెలలుగా నియోజక వర్గంలో ఆయన పర్యటిస్తూ పార్టీ కేడర్‌తో పలు సమావేశాలు నిర్వహించారు. కొసమెరుపు : ఓటర్ నాడిలో మార్పురానంత వరకు ప్రజల డబ్బులతోనే కొనుక్కునే "సంక్షేమ రాజకీయం" యదేచ్ఛగా కొనసాగుతూనే ఉంటుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# కొత్త పార్లమెంట్‌లోకి అడుగులు

(మొదటిపేజీ తరువాయి)

వ్యవస్థగా ఉన్న భారత్.. త్వరలో మూడో ఆర్థిక వ్యవస్థగా మారుతుందని తెలిపారు. అలాగే ప్రపంచంలో నైపుణ్యం ఉన్న మానవ వనరుల కొరత ఉందని, దానిని భారత్ పూరించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. స్వతంత్ర భారత్‌లో చోటుచేసుకున్న ఎన్నో కీలక ఘట్టాలకు పాత పార్లమెంట్ సాక్షిగా మిగలనుంది. ఈ సమయంలో పాత భవనం జ్ఞాపకాలను పదిలపరుచుకునే ఉద్దేశంతో ఉభయ సభల సభ్యులంతా కలిసి గ్రూప్ ఫొటో దిగారు. వారంతా దీనికోసం మంగళవారం ఉదయం పాత పార్లమెంట్ ప్రాంగణానికి వచ్చారు. మొదట ఉభయ సభల సభ్యులంతా కలిసి గ్రూప్ ఫొటోకు పోజు ఇచ్చారు. తర్వాత రాజ్యసభ సభ్యులు, లోక్‌సభ సభ్యులు విడివిడిగా ఫొటో దిగారు. ఉపరాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్, ప్రధాని నరేంద్రమోదీ(ఓనీటతి), లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ తదితరులు ముందు వరుసలో కూర్చున్నారు. ఉపరాష్ట్రపతి, రక్షణ శాఖ మంత్రి రాజనాథ్ సింగ్ మధ్యలో మోదీ కూర్చొని కనిపించారు.

# మంచి నిర్ణయాలను తీసుకుందాం

(మొదటిపేజీ తరువాయి)

అండ్ టెక్నాలజీ రంగంపై దృష్టి పెట్టిందన్నారు. ఈ అవకాశాన్ని వదులుకోవద్దు అన్నారు. ఉత్పత్తిరంగంలో ప్రపంచంలోనే నెంబర్ వన్ కావాలని, జీరో డిఫెక్ట్.. జీరో ఎఫెక్ట్‌తో ఉత్పత్తిని తయారు చేయాలన్నారు. మన ఉత్పత్తుల్లో ఎటువంటి లోపం ఉండవద్దు అని, ఆ ఉత్పత్తి వల్ల పర్యావరణంపై ఎటువంటి ప్రభావం ఉండవద్దు అన్నారు.పాత పార్లమెంట్ బిల్డింగ్ నుంచి ఎంపీలు అందరూ కొత్త పార్లమెంట్ బిల్డింగ్ వైపు ర్యాలీ తీస్తూ వెళ్లారు.

# మహిళా బిల్లుపై సోనియాగాంధీ స్పందన

(మొదటిపేజీ తరువాయి)

రిజర్వేషన్ బిల్లుకు క్యాబినెట్ ఆమోదం తెలపడాన్ని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత స్వాగతించారు. బిల్లులో పొందుపరిచిన అంశాలను వెల్లడించకపోవడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు.మహిళా బిల్లు గురించి కేంద్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి అధికారిక సమాచారం లేదని, మీడియా ద్వారానే ఈ విషయం వెలుగుచూసిందని ఆమె పేర్కొన్నారు.

# పోరాటం వృథా కాలేదు

(మొదటిపేజీ తరువాయి)

47రాజకీయపార్టీలను ఏకతాటిపైకి తీసుకువచ్చారు అని మంత్రి సత్యవతి రాథోడ్ తెలిపారు. పోరాటలకు తలొగ్గే కేంద్ర ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ బిల్లుకు ఆమెదం తెలిపిందన్నారు.

# మహిళా బిల్లుకు ఎప్పుడో మద్దతు తెలిపాం

## 2018లోనే రాహుల్ లేఖ రాశాడన్న జైరామ్ రమేశ్

న్యూఢిల్లీ,సెప్టెంబర్19 : చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలపడంపై కాంగ్రెస్ పార్టీ హర్షం వ్యక్తం చేసింది. కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ ఈ బిల్లు చరిత్రను ట్విటర్ వేదికగా పంచుకున్నారు. అంతేకాకుండా గతంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఈ అంశంపై ప్రధాని నరేంద్ర మోదీకి రాసిన లేఖను కూడా ఆయన షేర్ చేశారు. 2018లో రాసిన ఈ లేఖ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇంతకీ ఆ లేఖలో ఏముందంటే..మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్ ఆమోదించాల్సిన సమయం వచ్చింది. ఈ విషయంలో ప్రధానికి కాంగ్రెస్ మద్దతు ఇస్తుంది. ఆనాడు భాజపా మద్దతుతో ఎగువసభలో బిల్లుకు ఆమోదం లభించింది. అప్పుడు ప్రతిపక్ష నేతగా ఉన్న అరుణ్ జైట్లీ దీనిని ఒక చరిత్రాత్మక ఘట్టంగా అభివర్ణించారు. మహిళలకు సాధికారత కల్పించే ఈ అంశంపై మనం కలిసి నిలబడదాం. రాజకీయాలకు అతీతంగా ముందుకు సాగుదాం. ఈ ముఖ్యమైన సందేశాన్ని యావత్‌దేశానికి చాటి చెబుదాం అని రాహుల్ లేఖలో పేర్కొన్నారు.భారత్-కెనడా మధ్య ముదిరిన ఖలిస్థానీ చిచ్చు.. మన రాయబారిపై ట్రూడో బహిష్కరణ వేటు 'మహిళలకు రిజర్వేషన్లను అమలు చేయాలనేది కాంగ్రెస్ చిరకాల డిమాండ్. కేంద్ర కేబినెట్ నిర్ణయాన్ని పార్టీ స్వాగతిస్తోంది. దీనికి సంబంధించి మిగిలిన వివరాల కోసం ఎదురుచూస్తున్నాం. రహస్యంగా కాకుండా అఖిలపక్ష సమావేశంలో దీనిపై చర్చలు జరిపి ఏకాభిప్రాయం సాధించి ఉంటే బాగుండేది' అని జైరాం రమేశ్ తన అభిప్రాయం వ్యక్తం చేశారు. బిల్లుకు ఆమోదం లభించడంపై కాంగ్రెస్ అగ్ర నేత సోనియా గాంధీ (÷ూనీనితిజీ ఉజీనిటరతి)ని విలేకరులు అడిగిన ప్రశ్నకు 'ఇది మాది' అని సమాధానమిస్తూ.. పార్లమెంట్‌లోకి వెళ్లిపోయారు. చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ల బిల్లు ఇప్పటిది కాదు. ఈ బిల్లును 1996లో హెచ్‌డీ దేవెగౌడ సారథ్యంలోని యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం తొలుత లోక్‌సభలో ప్రవేశపెట్టింది. తర్వాత వాజ్‌పేయి, మన్మోహన్ సింగ్ ప్రభుత్వాల హయాంలోనూ ప్రవేశపెట్టినప్పటికీ ఈ బిల్లు సభ ఆమోదానికి నోచుకోలేదు. చివరకు ఈ బిల్లు 2010లో రాజ్యసభ ఆమోదం పొందినా లోక్‌సభలో మాత్రం పెండింగులోనే ఉండిపోయిన విషయం తెలిసిందే.

# ప్రధాని మోడీకి మల్లికార్జున్‌ఖార్గే ధన్యవాదాలు

న్యూఢిల్లీ,సెప్టెంబర్19 : పాత పార్లమెంట్ భవనం ప్రాశస్త్యాన్ని వివరిస్తూ దివంగత ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ప్రసంగాన్ని ప్రస్తావించినందుకు ప్రధాని నరేంద్ర మోదీకి కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే ధన్యవాదాలు తెలిపారు. నెహ్రూ చారిత్రక ప్రసంగాన్ని గుర్తుచేసినందుకు ప్రధాని మోదీకి ధన్యవాదాలు తెలుపుతున్నానని పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ప్రసంగిస్తూ ఖర్గే పేర్కొన్నారు. ప్రపంచం నిద్రిస్తున్న వేళ భారత్ స్వేచ్ఛా వాయువులు పీల్చుకుందని పండిట్ నెహ్రూ పార్లమెంట్ భవనంలో చేసిన వ్యాఖ్యలను ప్రధాని మోదీ సోమవారం తన ప్రసంగంలో గుర్తుచేశారని ఖర్గే ప్రస్తావించారు. స్వతంత్ర భారత తొలి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్, తొలి డిప్యూటీ పీఎం సర్దార్ వల్లభాయ్ పటేల్, భారత రాజ్యాంగ పితామహుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చరిత్రను కూడా ఖర్గే గుర్తుచేశారు.

# రెండు దేశాల వివాదాస్పదంగా ఖలిస్తానీ నేత హత్యా ఘటన

న్యూఢిల్లీ,సెప్టెంబర్19 : ఖలిస్తానీ నేత హర్దీప్ సింగ్ నిజ్జార్‌ను కెనడాలో హత్య చేశారు. జూన్‌లో ఆ మర్డర్ జరిగింది. అయితే ఆ హత్య పాత్రలో భారత్ హస్తం ఉన్నట్లు కెనడా ప్రధాని ట్రూడో ఆరోపణలు చేశారు. మోస్ట్ వాంటెడ్ ఖలిస్తానీ నేత హత్యా ఘటన ఇప్పుడు రెండు దేశాల మధ్య వివాదాస్పదంగా మారింది. నిజ్జార్ మర్డర్‌లో భారత ప్రభుత్వ ఏజెంట్లు ఉండి ఉంటారని ట్రూడో చేసిన వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. ప్రస్తుతం రెండు దేశాలు తమ దౌత్యవేత్తలను వెలివేశాయి. ఇంతకీ నిజ్జార్ ఎవరో పూర్తిగా తెలుసుకుందాం. ఖలిస్తాన్ టైగర్ ఫోర్స్ చీఫ్ నిజ్జార్‌ను జూన్ 18వ తేదీన హత్య చేశారు. కెనడాలోని ఓ గురుద్వారాలో గుర్తు తెలియని వ్యక్తులు అతన్ని చంపేశారు. 1997లో అతను కెనడాకు వలస వెళ్లాడు. శరణార్థిగా ఉండేందుకు అతను పెట్టుకున్న అభ్యర్థనను తోసిపుచ్చారు. ఇమ్మిగ్రేషన్ కల్పించిన మహిళనే అతను పెళ్లాడాడు. అయినా అతనికి రెఫ్యూజీ ఇచ్చేందుకు నిరాకరించారు. 2020లో నిజ్జార్‌ను గ్లోబల్ టెర్రరిస్టుగా ప్రకటించారు. నిషేధిత కేటీఎఫ్ గ్రూపు కోసం నిజ్జార్ రిక్రూట్మెంట్ చేసేవాడు. శిక్షణ ఇచ్చేవాడు. సిక్స్ ఫర్ జస్టిస్ అనే వేర్పాటువాద గ్రూపును నడిపారు. సెప్టెంబర్ పదో తేదీన ఖలిస్తానీ రెఫరెండం కూడా నిర్వహించారు. నిజ్జార్‌కు ఉగ్రవాద లింకులు ఉన్నట్లు గతంలో పలుమార్లు కెనడాకు భారత్ విజ్ఞాపన చేసింది. 2018లో అప్పటి పంజాబ్ సీఎం అమరీందర్ సింగ్.. వాంటెడ్ లిస్టును ట్రూడోకు అందజేశారు. ఆ జాబితాలో నిజ్జార్ పేరు కూడా ఉంది. పంజాబ్ పోలీసులు 2022లో నిజ్జార్‌ను తమకు అప్పగించాలని కెనడాను కోరారు. రాష్ట్రంలో ఉగ్రవాద వ్యాప్తికి అతను సహకరిస్తున్నట్లు ఆరోపించారు. అనేక కేసుల్లో నిజ్జార్ వాంటెడ్ జాబితాలో ఉన్నాడు. 2007లో లుథియానాలో జరిగిన పేలుళ్ల కేసులో అతను నిందితుడు. ఆ పేలుళ్లలో ఆరుగురు మృతిచెందారు. 42 మంది గాయపడ్డారు. 2010 పాటియాలా బాంబు బ్లాస్ట్ కేసులోనూ నిందితుడు. హిందు నేతల్ని టార్గెట్ చేసిన కేసులో అతను వాంటెడ్. 2015లో ఆ కేసు నమోదు అయ్యింది. 2015లో అతని కోసం లుకౌట్ నోటీసులు, 2016లో రెడ్ కార్నర్ నోటీసు జారీ చేశారు. 2022లో నిజ్జార్‌ను చంపిన వారికి 10 లక్షల రివార్డును ప్రకటించారు.

# కాంగ్రెస్‌ను నమ్మితే నట్టేట ముంచుతారు

మెదక్,సెప్టెంబర్19 : కాంగ్రెస్ పార్టీని నమ్మితే నట్టేట ముంచుతారని, కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన 6 గ్యారెంటీల కార్డ్ సంతకం లేని పోస్ట్‌డేటెడ్ చెక్ లాంటిదని మంత్రి హరీశ్ రావు అన్నారు. ఆ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఏమీ చేయకుండా తెలంగాణలో అమలు కాని హామీలు ఇస్తున్నారని విమర్శించారు. గద్దెనెక్కే వరకు కాంగ్రెస్ వాళ్లు ఏదైనా చెబుతారన్నారు.కాంగ్రెస్ వాళ్లకు కొత్తగా బెంగుళూరు హై కమాండ్ వచ్చిందని ఎద్దేవా చేశారు. బెంగుళూరును తెలంగాణకు రెండో రాజధాని చేస్తరు కావచ్చని చెప్పారు. ఇకపై ఢిల్లీకి బెంగుళూరు మీదుగా వెళ్లాల్సి వస్తుందేమోనని చెప్పారు. కాంగ్రెస్ నాయకులు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని, వారి బోనస్ మాటలు నమ్మి అగం కావద్దని సూచించారు. 6 గ్యారెంటీ హామీలు అని చెబుతున్న కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 6 నెలలకు ఒక సీఎం వస్తాడని ఎద్దేవా చేశారు. హైదరాబాద్?లో ప్రతి 6 నెలలకు ఒకసారి కర్ఫ్యూ వస్తుందన్నారు. 24 గంటల కరెంట్ పోయి రోజుకు ఆరు గంటల కరెంట్ మాత్రమే వస్తుందని, వారానికి రెండు రోజుల పవర్ హాలిడే ఇస్తారని విమర్శించారు. కేసీఆర్ అంటే నమ్మకానికి మారుపేరన్నారు. చెప్పిన ప్రతి మాటను నిలబెట్టుకున్న వ్యక్తి సీఎం కేసీఆర్ అని తెలిపారు. రూపాయి ఖర్చు లేకుండా డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కట్టించి ఇచ్చామని వెల్లడించారు. పనిచేసే ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలన్నారు. బీఆర్ఎస్ మానిఫెస్టో గొప్పగా ఉంటదని, చెప్పిన ప్రతి హామీ నెరవేర్చామని మంత్రి హరీశ్ రావు అన్నారు.కన్నతల్లికి అన్నం పెట్టలేనోడు.. పినతల్లికి బంగారు గాజులు కొనిస్తా అన్నట్టు కాంగ్రెస్ పార్టీ తీరు ఉందని విమర్శించారు. ఎంత సేపు కేసీఆర్?ని తిట్టుడే తప్ప వాళ్లకు మరో పనిలేదన్నారు.

## ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తులు నేటి నుంచి ప్రారంభం

హైదరాబాద్,సెప్టెంబర్19 : ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తు ప్రక్రియ ఈ నెల 20 నుంచి ప్రారంభంకానుంది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ, మున్సిపల్ స్కూళ్లలో ఖాళీగా ఉన్న 5089 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ప్రభుత్వం ఇప్పటికే నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. ఇందులో స్కూల్ అసిస్టెంట్లు , భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయ ఉద్యోగాలు ఉన్నాయి. వీటికి సంబంధించిన ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ బుధవారం షురు అవుతుంది. అక్టోబర్ 21న ముగియనుంది. పరీక్షను నవంబర్ 20 నుంచి 30వ తేదీ వరకు కంప్యూటర్ బేస్డ్ విధానంలో నిర్వహిస్తారు. జిల్లాల వారీగా ఏ సబ్జెక్టుకు ఎన్ని పోస్టులు ఉన్నాయనే వివరాలను పాఠశాల విద్యాశాఖ తాజాగా విడుదల చేసింది.

## ఎన్టీపీసీ పట్టణ పరిధిలో దారుణ హత్య



పెద్దపల్లి,సెప్టెంబర్19 :సెల్‌ఫోన్‌లో మాట్లాడుతుండగా ఓ వ్యక్తిని దుండగులు వేట కొవడల్లతో నరికి చంపారు. ఈ విషాదకర సంఘటన రామగుండం మండలం ఎన్టీపీసీ పట్టణ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. ఎన్టీపీసీ పట్టణం పరిధి 39 డివిజన్ కాజీపల్లికి చెందిన మేకల లింగయ్య అనే వ్యక్తి సోమవారం రాత్రి దారుణ హత్యకు గురయ్యారు. రాత్రి 9 గంటల సమయంలో మేకల లింగయ్య కాజిపల్లి గ్రామ శివారులో సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాకింగ్ చేస్తున్నాడు. ఇదే సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు వెనకాల నుంచి వచ్చి తలపై వేట కొడవళ్లతో దాడి చేసి హతమార్చారు. సమాచారం అందుకున్న గోదావరిఖని ఏసీపీ తూల శ్రీనివాసరావు, రామగుండం సీఐ చంద్రశేఖర్ గౌడ్, ఎన్టీపీసీ ఎస్ఐ జీవన్, ఘటన స్థలానికి చేరుకున్నారు. డాగ్ స్క్వాడ్‌తో దర్యాప్తు చేపట్టారు. భూమి వివాదాలే ఈ హత్యకు దారి తీసినట్టుగా తెలుస్తున్నది. ఈ హత్యపై పోలీసులు ఒకరిద్దరు హంతకులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## త్వరలో కల సాకారం కాబుతోంది : కవిత



హైదరాబాద్,సెప్టెంబర్19 :అధికారంలో సగం కావాలన్న మహిళల కల సాకారం కాబోతున్నదని ఎమ్మెల్సీ కవిత అన్నారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వెనుక బీఆర్ఎస్ కృషి ఉందన్నారు. మహిళా బిల్లకు బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు ఇస్తుందని సామాజిక మాధ్యమం ఎక్స్ (ట్విట్టర్) వేదికగా వెల్లడించారు. మహిళా రిజర్వేషన్‌కు సంబంధించి కేంద్ర కేబినెట్ ఒక మంచి నిర్ణయం తీసుకుందన్నారు. కేంద్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాన్ని సాగతిస్తున్నామని చెప్పారు. అధికారంలో సగం కావాలన్న మహిళ కల సాకారం కాబోతున్నదని, ఇది దేశంలోని ప్రతిఒక్క మహిళ విజయమన్నారు. దేశ పౌరులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. 2014లో బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే అసెంబ్లీలో 33 శాతం మహిళా రిజర్వేషన్, ఓబీసీ రిజర్వేషన్లను ఆమోదించి కేంద్ర ప్రభుత్వానికి పంపిందన్నారు. తొమ్మిదేండ్ల జాప్యం తర్వాత మహిళా రిజర్వేషన్ బిల్లుపై కేంద్రం నిర్ణయం తీసుకుందని చెప్పారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఇప్పటికే ఓబీసీ, మహిళా రిజర్వేషన్లపై ప్రధాని మోదీకి లేఖలు రాశారని గుర్తుచేశారు. లోక్‌సభలో అధికార పార్టీకి పూర్తిస్థాయి మెజారిటీ ఉండటంతో ఎలాంటి అడ్డంకులు లేకుండా ఈ బిల్లును ఆమోదించేలా చూడాలని ఎమ్మెల్సీ కవిత అన్నారు.

## నేడు ఎపి కేబినేట్ భేటీ

### అసెంబ్లీ సమావేశాలపై చర్చించే ఛాన్స్

అమరావతి,సెప్టెంబర్19 : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అధ్యక్షతన ఏపీ కేబినెట్ సమావేశం బుధవారం అమరావతిలో జరగనుంది. వెలగపూడి సచివాలయంలోని ఫస్ట్ ఫ్లోర్ కేబినెట్ హాల్‌లో ఈ సమావేశం జరగనుంది.ఉదయం 11 గంటలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అధ్యక్షతన ఈ కేబినెట్ భేటీ ప్రారంభం కానుంది. ఈ సమావేశంలో కీలక అంశాలపై మంత్రి మండలి నిర్ణయం తీసుకోనుంది. వర్షాకాల అసెంబ్లీ సమావేశాల నిర్వహణపై కేబినెట్ చర్చించనుంది. ఈ నెల 21 నుంచి ఏపీ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. 21 నుంచి ఐదురోజులపాటు ఈ సమావేశాలు జరుగతాయి. ఐదు రోజులుపాటే జరుగుతాయా మరికొన్ని రోజులు పొడిగించాలా అనేదానిపై కూడా కేబినెట్‌లో చర్చిస్తారు. కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ బిల్లుతో పాటు పలు కీలక బిల్లులను అసెంబ్లీలో ప్రవేశ పెట్టే అవకాశం ఉంది. నెల 21 నుంచి ఏపీ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. 21న ఉదయం 9 గంటలకు శాసనసభ, 10 గంటలకు శాసన మండలి సమాశాలు మొదలవ్వనున్నాయి. అయిదు రోజులపాటు శాసనసభ సమావేశాలు కొనసాగనున్నట్లు తెలుస్తోంది. అవసరాన్ని బట్టి మరో రెండు రోజులు పెంచే అవకాశముంది. కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ బిల్లును ఈ సమావేశాల్లో ప్రవేశపెట్టనున్నట్టు సమాచారం. ఇవే కాకుండా కొన్ని ఆర్డినెన్సులకు సంబంధించిన బిల్లులు, మరికొన్ని కొత్త బిల్లులను సమావేశాల్లో ప్రభుత్వం ప్రవేశపెట్టే అవకాశం ఉంది. ఆంధ్రప్రదేశ్ సర్కారు రూపొందించిన ప్రతిపాదనపై ఉద్యోగులు ఇటీవల భేటీలో కొన్ని మార్పులను కోరారు. సీఎం నిర్ణయాన్ని బట్టి మంత్రివర్గ ఉపసంఘం ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో మరోసారి భేటీ అయి వీటిని ఖరారు చేయాల్సి ఉంది. మార్పుల అనంతరం వెంటనే పూర్తి చేస్తే ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో ఈ బిల్లును ప్రవేశపెట్టడం ఖాయంగానే కనిపిస్తోంది. ఇవే కాకుండా కొన్ని ఆర్డినెన్సులకు సంబంధించిన బిల్లులు, మరికొన్ని కొత్త బిల్లులను సమావేశాల్లో ఏపీ సర్కారు ప్రవేశపెట్టనుంది. బిల్లులతో పాటు కీలకాంశాలపై ప్రస్తావన సభలో వచ్చే ఛాన్స్ ఉంది. సీఎం విశాఖకు తరలి వెళ్లే అంశంపై సభలో చర్చకు వచ్చే అవకాశం ఉంది. అసెంబ్లీ సమావేశాల వేదికగా చంద్రబాబుపై కేసులను ప్రస్తావించడానికి వైఎస్సార్సీఎల్పీ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.సీఎం జగన్ ఢిల్లీ వెళ్లనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ప్రధాని మోదీ, కేంద్రమంత్రి అమిత్ షాలతో అపాయింట్ మెంట్ల కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు.ప్రధాని మోదీ, కేంద్రమంత్రి అమిత్ షా పార్లమెంట్ సమావేశాలతో బిజీగా ఉన్నారు. దీంతో ఇంకా అపాయింట్మెంట్లు ఖరారు కాలేదు. అసెంబ్లీ సమావేశాల సమయంలో అపాయింట్ మెంట్లు దొరికితే వెళ్లి వచ్చే అవకాశం ఉందని వైసీపీ వర్గాలు చెబుతున్నాయి.

## ఏపీ, తెలంగాణ విభజన సరిగ్గా జరుగలేదు

### ప్రధాని ప్రసంగంతో తెలంగాణ రాష్టానికి అవమానం

### రాష్ట్ర అస్తిత్వం, ఆత్మగౌరవాన్ని అవమానించడమే

### ఏఐసీసీ అధినేత రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ,సెప్టెంబర్19 : తెలంగాణ అమరవీరులు, వారి త్యాగాలపై పార్లమెంట్‌లో ప్రధాని నరేంద్ర మోదీ చేసిన అగౌరవ వ్యాఖ్యలు రాష్ట్ర అస్తిత్వం, ఆత్మగౌరవాన్ని అవమానించడమే తప్ప మరొకటి కాదని ఏఐసీసీ అధినేత రాహుల్ గాంధీ మంగళవారం అన్నారు. 'తెలంగాణ అమరవీరులు, వారి త్యాగాలపై ప్రధాని మోడీ అగౌరవపరిచే ప్రసంగం తెలంగాణ అస్తిత్వం, ఆత్మగౌరవాన్ని అవమానించడమే' అని తెలుగులో ట్విటర్ వేదికగా పోస్ట్ చేసిన సందేశంలో రాహుల్ గాంధీ అన్నారు. సోమవారం పార్లమెంటులో ప్రసంగిస్తూ, ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణను విభజించడం రెండు రాష్ట్రాల్లో రక్తపాతానికి దారితీసిందని ప్రధాని మోదీ దుయ్యబట్టారు. అయితే, అంతకు ముందుకు పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ఏపీ, తెలంగాణ విభజనపై వ్యాఖ్యనించారు. యూపీఏ హయాంలో ఈ పార్లమెంట్ లోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు జరిగిందని.. అయితే ఉత్తరాఖండ్, ఝూర?ండ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల మాదిరిగా ఏపీ, తెలంగాణ విభజన సరిగ్గా జరుగలేదని ఆయన కోనియాడారు. వాజ్‌పేయీ ప్రధానిగా ఉన్నప్పుడు మూడు రాష్ట్రాల విభజన ఎంతో ప్రణాళికా బద్ధంగా చేశారని మోడీ తెలిపారు. ఆ మూడు రాష్ట్రాల విభజన టైంలో అన్ని చోట్లా సంబరాలు జరిగాయన్నారు. ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ విభజన సరిగ్గా జరగలేదని పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ప్రధాని నరేంద్ర మోడీ సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై ప్రధాన మంత్రి చేసిన వ్యాఖ్యలు తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేశాయని మంత్రి కేటీఆర్ అన్నారు. తెలంగాణ ఏర్పాటుపై ప్రధాని అవమానకర వ్యాఖ్యలు చేయడం ఇదే మొదటి సారి కాదు.. చారిత్రక వాస్తవాల పట్ల ఆయనకున్న నిర్లక్ష్యానికి ఇది ఒక ఉదాహరణ మాత్రమేనంటూ కేటీఆర్ అన్నారు.

# తెలంగాణపై విషం చిమ్ముతున్న మోడీ

### 2003లోనే తెలంగాణ రాష్ట్రాన్ని ఎందుకు ఏర్పాటు చేయలేదు : గుత్తా సుఖేందర్‌రెడ్డి



నల్లగొండ,సెప్టెంబర్19 : ప్రధాని మోదీ పచ్చి అబద్ధాలు మాట్లాడుతూ తెలంగాణపై విషం చిమ్మారని మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి విమర్శించారు. గుజరాత్‌లో రక్తపుటేరులు పారిన సంఘటనలు ఇంకా మోదీ మరచిపోనట్లు లేదని, అవే ఇప్పటికీ మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. 2003లో బీజేపీ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రాన్ని ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు. మిర్యాలగూడ ఎమ్మెల్యే భాస్కర్ రావుతో కలిసి నల్లగొండలోని తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. బీజేపీ చేసిన అన్యాయాలు అక్రమాలు అన్నీ ఇన్నీ కావన్నారు. ప్రజల ఒత్తిడి మేరకు తెలంగాణ ఏర్పాటు అయిందని స్పష్టం చేశారు. మోదీ మనసు నిండా విషం ఉందని, ప్రధాని మాట్లాడే దాంట్లో అర్థం లేదని విమర్శించారు. రాష్ట్రంలో ఏం చేయాలన్నా సీఎం కేసీఆర్ వల్లే సాధ్యమవుతుందని, అది తెలంగాణ ప్రజలకు తెలుసన్నారు. కాంగ్రెస్ చెప్పేవన్నీ బోగస్ అని, ఆ హామీలు ఆచరణలో సాధ్యం కాదని స్పష్టం చేశారు. కాంగ్రెస్‌కు ఓ విజన్ లేదని, వారికి అధికారం దాహమే ఉందని విమర్శించారు. గ్యారంటీ హామీల్లో రూ.2 లక్షల రుణమాఫీని ఎందుకు మర్చిపోయారని నిలదీశారు. కాంగ్రెస్, బీజేపీల కల్లబొల్లి మాటలు ప్రజలు నమ్మొద్దని సూచించారు. తెలంగాణ కోసం రాజీనామా చేయమంటే పారిపోయిన వ్యక్తి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి అని విమర్శించారు. మత విద్వేషాలు రెచ్చగొట్టడమే ఆ పార్టీ పని అన్నారు. పువ్వు గుర్తు పార్టీ పతనం ప్రారంభమైందని చెప్పారు. అందుకే మళ్లీ మహిళ రిజర్వేషన్ బిల్లు అంటూ హడావిడి చేస్తున్నారని చెప్పారు.కాంగ్రెస్ పార్టీ ప్రజలను మభ్యపెట్టేలా హామీలు ఇస్తున్నదని చెప్పారు. గ్యారంటీ హామీలన్నీ ఉత్తివేనని, ఆ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. ఆంధ్ర పాలకుల ఒత్తిళ్లకు లొంగి 1969లో తెలంగాణ ఇవ్వలేదని, ఉద్యమ నాయకుడు కేసీఆర్ అలుపెరుగని పోరాటంతో దిగివచ్చిన కేంద్రం ప్రత్యేక రాష్ట్రం ఇచ్చారని చెప్పారు.

## కాంగ్రెస్, బిజెపి రెండూ దొందు పార్టీలే



### తెలంగాణపై విషం చిమ్ముతున్న మోడీ

### కాంగ్రెస్‌ను నమ్మితే కరెంట్ కష్టాలు తప్పవు

### మంత్రి కెటిఆర్ హెచ్చరిక

హైదరాబాద్,సెప్టెంబర్19 : మోదీ సర్కార్ తెలంగాణకు తీవ్ర అన్యాయం చేసిందని, అభివృద్ధిని అడ్డుకుందని మంత్రి కెటిఆర్ ఆరోపించారు. మరోవైపు బీఆర్ఎస్ 24 గంటలు కరెంట్ ఇస్తుందని చెబితే, పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి మనం 48 గంటలు కరెంట్ ఇస్తామని చెబుతాం అంటున్నారని సెటైర్లు వేశారు. ఖమ్మం జిల్లాకు చెందిన నేతలు హైదరాబాద్ లోని తెలంగాణ భవన్ లో బీఆర్ఎస్ లో చేరారు. వారికి కండువా కప్పి మంత్రి కేటీఆర్ బీఆర్ఎస్ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలపై నిప్పులు చెరిగారు. తెలంగాణ భారత్ లో విలీనం అయిన సందర్భాన్ని పురస్కరించుకుని సెప్టెంబర్ 17న సీఎం కేసీఆర్ అధికారికంగా త్రివర్ణ పతాకం ఎగురవేశారు. కానీ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ మత విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నం చేసిందని ఆరోపించారు. మతం పేరిట చిచ్చుపెట్టి ఆ మంటల్లో చలి కాచుకునే ప్రయత్నం చేస్తుందని మండిపడ్డారు. నరేంద్ర మోదీ, బీజేపీ గత 9 ఏళ్లకు పైగా దేశంతో పాటు తెలంగాణకు ఎంతో అన్యాయం చేసిందని విమర్శించారు. రాష్ట్రం ఏర్పడిన వెంటనే నిరంకుశ ఆలోచన విధానంతోనే భద్రాద్రి కొత్తగూడెంకు చెందిన 7 మండలాలను ఏపీలో కలిపి అన్యాయం చేశారన్నారు. కరెంట్ సమస్యలు ఉంటే, సీలేరును తీసుకెళ్లి పక్క రాష్ట్రాలకు విద్యుత్ ఇచ్చింది మోదీ సర్కార్. విభజన చట్టంలో పేర్కొన్న ఏ హామీని నెరవేర్చలేదని, నీటి వాటాలు తేల్చలేదు. విద్యుత్ సమస్యలు, పరిశ్రమల ఏర్పాటుపై నిర్ణయం తీసుకోలేదన్నారు. ఇల్లెందులో బయ్యారంలో ఉక్కు కర్మాగారం స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా ద్వారా ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీకి నీళ్లొదిలారని గుర్తుచేశారు. మీరు జన్ ధన్ ఖాతాలు తెరవండి.. విదేశాల్లో కుబేరులు దాచుకున్న నల్లధనాన్ని దేశానికి తీసుకొచ్చి.. రూ.15 లక్షలు ఖాతాల్లో వేస్తారంటూ ప్రధాని మోదీ గొప్ప గొప్ప మాటలు, డైలాగ్స్ చెప్పారంటూ ఎద్దేవా చేశారు. కానీ ఎన్నికల హామీల్లో చెప్పకున్నా కేసీఆర్ రైతుల ఖాతాల్లో 73 వేల కోట్లు జమ చేశారు. ఏడాది 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ప్రధాని మోదీ హామీ ఇచ్చారు, అంటే 9 ఏళ్లలో 18 కోట్ల ఉద్యోగులు ఇవ్వడం దేవుడెరుగు, ఉన్న ఉద్యోగాలను పోగొట్టారని విమర్శించారు. కేవలం తన స్నేహితుడికి కంపెనీలు, ప్రాజెక్టులు కట్టబెట్టి ఏకపక్షంగా వ్యవహరించారని చెప్పారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి దమ్ము, ధైర్యం ఉంటే ఇక్కడ ఉపవాస దీక్షలు చేపట్టడం కాదని, ఢిల్లీకి వెళ్లి మోదీతో పోరాటం చేసి తెలంగాణకు నిధులు తీసుకురావాలని సూచించారు. యూపీఏ హయాంలో 400 ఉన్న సిలిండర్ ధరలను రూ.1200 చేసిన ఘనత మోదీకి దక్కిందన్నారు. సిలిండర్ ధర రూ.400 కావడానికి ఆనాడు మన్మోహన్ సింగ్, కాంగ్రెస్ ప్రభుత్వం కారణమని లెక్కలేనని తిట్లు తిట్టారు మోదీ, కానీ నేడు అంతకు మూడింతలు చేసిన మోదీని ప్రజలు ఏమనాలో చెప్పాలన్నారు. డాలర్ కు రూపాయి విలువ క్షీణిస్తుందని ఆనాడు లొల్లి లొల్లి చేసిన మోదీ, బీజేపీలు నేడు అంతకుమించి క్షీణించినా నోరు మెదపకుండా కూర్చున్నారంటూ మండిపడ్డారు. గూడురు నారాయణ రెడ్డి అనే వ్యక్తి ఏదో సినిమా తీసి సమాజానికి ఏం మెసేజ్ ఇస్తున్నారని ప్రశ్నించారు. చేతకానితనం వల్లే అభివృద్ధి చేయలేక మత విద్వేషాలతో పబ్బం గడుపుతున్నారు. బుల్లెట్ రైలన్నారు, ఆర్థిక వ్యవస్థలో మూడో స్థానంలో ఉంటామని చెప్పారు. కానీ ఏదీ సాధ్యం కాలేదన్నారు. కాంగ్రెస్ నేడు ఒక్క ఛాన్స్ అడుతుంది, కానీ గతంలో 11 సార్లు ప్రజలు మీకు ఛాన్సిచ్చారు. అప్పుడు ఎందుకు కరెంట్, సాగు, తాగునీరు ఎందుకు ఇవ్వలేదని సూటిగా ప్రశ్నించారు. ఇప్పుడు మాత్రం ఒక్కసారి ఛాన్స్ ఇస్తే అన్నీ చేసేస్తామని చెబితే నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రంలో 600 పింఛన్ ఉంటే, ఇప్పుడు చాన్స్ ఇస్తే రూ.4000 ఇస్తామని చెబుతున్నారు. గతంలో రూ.200 ఇవ్వలేనోళ్లు ఇప్పుడు కొత్త డ్రామాలకు తెరలేపారంటూ మండిపడ్డారు.పెద్దావిడ కుదుతుంటే సూది పడిపోయింది. అప్పుడు కంటి వెలుగు లేదు కదా, ఆమెకు సూది దొరకలేదు. దాంతో పక్కకు చూస్తే భద్రాద్రి రాముడు కనిపించాడు. దేవుడా నాకు సూది దొరికేలా చేస్తే 5 కిలోల చక్కెర, బెల్లం ఇస్తానని అత్త అన్నది. ఇది విన్న కోడలు ఇంట్లోంచి బయటకు వచ్చి అయ్యో 50 పైసల సూది కోసం ఎంత పనిచేశావు అత్తా అని అడిగింది. ఆ సూది దొరికేదుందా, నేను దేవుడికి చేసేది ఉందా అని అన్నదని కేటీఆర్ అనగానే చప్పట్లతో మార్మోగిపోయింది. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 5 ఏళ్లకు 5 మంది సీఎంలు వస్తారు, పొరపాటున కాంగ్రెస్ కు ఓటేస్తే తెలంగాణ సంకనాకి పోవడం ఖాయమన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన 6 గ్యారంటీల విలువ లెక్కిస్తే రాష్ట్ర బడ్జెట్ కంటే ఎక్కువ ఉందని ప్రజలు చెబుతున్నారని గుర్తుచేశారు. రెండు నెలల కిందట కర్ణాటకలో మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, అక్కడ ఎస్సీ, ఎస్టీల కు ఇవ్వాల్సిన నిధులను పక్కదారి పట్టించిందని ఆరోపించారు. ఇప్పటికే కర్ణాటకలో పవర్ హాలిడే మొదలైందని డిప్యూటీ సీఎం శివకుమార్ చెప్పారని తెలిపారు. వీటికి అదనంగా కరెంట్ ఛార్జీలు పెంచుతున్నారని చెప్పారు. తలసరి ఆదాయంలో దేశంలో అగ్ర స్థానంలో నిలిచింది తెలంగాణ. దేశంలో ఇంటింటికి నల్లా పెట్టిన ప్రభుత్వం తెలంగాణ సర్కార్. పర్యావరణం, పట్టణ అభివృద్ధి, ఐటీ సెక్టార్, బెస్ట్ మునిసిపాలిటిలలో జాతీయ స్థాయిలో అవార్డులు కొల్లగొట్టింది తెలంగాణ అని చెప్పారు. రోడ్డు వేస్తామనో, జిల్లాకో మెడికల్ కాలేజీ ఇస్తామనో అభివృద్ధికి సంబంధించి ఒక్కటంటే ఒక్క హామీ ఇవ్వలేదంటూ కాంగ్రెస్ 6 గ్యారంటీలపై కేటీఆర్ నిప్పులు చెరిగారు. కేసీఆర్ రూ.2000 ఇస్తే, మేం రూ.4000 అని చెబుతున్నారు. కాంగ్రెస్ నేతలు చర్చ పెట్టుకోగా.. బీఆర్ఎస్ 24 గంటలు కరెంట్ ఇస్తుందని చెబితే, పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి లేచి మనం 48 గంటలు కరెంట్ ఇస్తామని చెబుతాం అంటున్నారని సెటైర్లు వేశారు. కరెంట్, నీళ్లు ఇలా ఏ బాధల్లేవని.. ఆ గట్టునుంటారా, ఈ గట్టుకొస్తారా మీరే అర్థం చేసుకోవాలన్నారు. ఓటుకు 2, 3 వేలు ఇస్తే ఖమ్మంలో గెలిచేస్తామని కాంగ్రెస్ నేతలు చెప్పుకుంటున్నారు. అయితే కాంగ్రెస్ డబ్బులు ఇస్తే కచ్చితంగా తీసుకోండి, ఓటు మాత్రం అభివృద్ధి చేసిన వాళ్లకే వేయాలంటూ ప్రజలకు పిలుపునిచ్చారు.

## థర్డ్ ఫ్రంట్‌కు కేసీఆర్ నాయకత్వం వహిస్తే బాగుంటుంది

### తెలంగాణలో బీజేపీ బండి పంక్చర్ అయింది

### బీజేపీ, కాంగ్రెస్‌పై ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఆగ్రహం



హైదరాబాద్,సెప్టెంబర్19 : తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ దూకుడు పెంచారు. బీజేపీ, కాంగ్రెస్‌పై తనదైన శైలిలో విరుచుకుపడుతున్నారు. తెలంగాణలో బీజేపీ బండి పంక్చర్ అయిందని, ఉన్న గాలిని కూడా ప్రజలు తీసేశారని అసదుద్దీన్ పేర్కొన్నారు. దేశంలో థర్డ్ ఫ్రంట్ వచ్చేందుకు బలమైన అవకాశాలు ఉన్నాయని, ఈ ఫ్రంట్‌కు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నాయకత్వం వహిస్తే బాగుంటుందని ఆకాంక్షించారు. కేసీఆర్, మాయవతి ఏ కూటమిలో లేరని, ప్రాంతీయంగా గట్టి పట్టు ఉన్న పార్టీలు రెండు కూటముల్లో లేవని చెప్పారు. ఓబీసీలు, దళితులకు రిజర్వేషన్లను పెంచాలంటున్న కాంగ్రెస్.. మరి ముస్లింల అంశంలో ఏం చెబుతుందని ఓవైసీ సూటిగా ప్రశ్నించారు. అటు మహారాష్ట్రలోనూ ముస్లిం రిజర్వేషన్ల విషయం ఎందుకు మాట్లాడరంటూ నిలదీశారు. తెలంగాణలో ముస్లింలు సేఫ్‌గా ఉన్నారని, కర్నాటకలో బీజేపీ అధికారంలో ఉన్నప్పుడు శాంతి భద్రతలు మరీ దారుణంగా ఉండేవని, ఆర్థిక వ్యవస్థ నిర్వీర్యం అయిందని అసదుద్దీన్ విమర్శించారు. ఇక తెలంగాణలో అలాంటి పరిస్థితి లేదని, ఆర్థిక వ్యవస్థ చాలా బలంగా ఉందంటూ అసదుద్దీన్ ఓవైసీ పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎలాంటి దాడులు జరగవంటూ ఓవైసీ అన్నారు. తెలంగాణలో ఎలాంటి సమస్యలు లేకుండా కేసీఆర్ మంచిపాలన అందిస్తున్నారని చెప్పారు. ఇక తాము దేశవ్యాప్తంగా ఎన్నికల్లో పోటీ చేస్తున్నామని, బీజేపీ నేతలు తమ ప్రాంతంలో పోటీ చేస్తామంటున్నారు.. రండి తాడోపేడో తేల్చుకుందామంటూ ఓవైసీ సవాల్ విసిరారు. అయితే, ఎంఐఎం అధినేత టికెట్లపై కూడా కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ సారి ఎన్నికల్లో ఎంఐఎం సిట్టింగ్‌లకు టికెట్ కేటాయిస్తామో..? లేదో..? చెప్పలేమంటూ బాంబు పేల్చారు. మరోవైపు ప్రజలు బీజేపీ, కాంగ్రెస్‌లను చిత్తుగా ఓడించాలని ఓవైసీ పిలుపునిచ్చారు. జమ్ముకశ్మీర్‌లో భారతీయులపై పాకిస్తాన్ తీవ్రవాదులు దాడులు చేస్తుంటే అహ్మదాబాద్‌లో ఇండియా, పాక్ మ్యాచ్ నిర్వహించడం ఆశ్చర్యం కలిగిస్తోందని ఆయన అన్నారు.తెలంగాణ రాజకీయాల్లో ఎంఐఎం పాత్ర విలక్షణమైనదంటూ అసదుద్దీన్ పేర్కొన్నారు. అయితే, మజ్లీస్ పార్టీ గెలిచే సీట్లతో మాత్రం బలమైన వారిని బరిలో ఉంచి.. మిగతా చోట్ల నామమాత్రంగా అభ్యర్థులను పోటీకి దింపుతోంది. ప్రస్తుతం ఎఐఎంకి ఏడుగురు ఎమ్మెల్యేలున్నారు. గత ఎన్నికల్లో అందరు సిట్టింగ్‌లకు చోటు లభించినా.. ఈ సారి మాత్రం ఎక్కువ మందికి టికెట్లు రావని పార్టీలో జోరుగా చర్చ జరుగుతోంది. అసదుద్దీన్ తాజా వ్యాఖ్యలు కూడా అదే నిజమని చెబుతుంటడంతో సిట్టింగుల్లో గుబులు మొదలైంది.ఎప్పుడూ బిజీగా ఉండే అసదుద్దీన్.. ఇటీవల బైక్ రైడింగ్ చేస్తూ వార్తల్లో నిలుస్తున్నారు. హైదరాబాద్ నగరంలో బైక్ లపై తిరుగుతూ.. ఆకట్టుకుంటున్నారు. తాజాగా.. కుమారుడు సలావుద్దీన్ తో కలిసి బైక్ రైడింగ్ నిర్వహించారు.

## యూపీఏ హయాంలోనే బిల్లుకు రూపకల్పన

- రాజ్యసభలో ఆమోదం పొందేందుకు రెండేళ్లు పట్టింది
- ఎగువసభలో బిల్లు ఆమోదం
- ఆమోదం పొందినప్పటికీ చట్ట రూపం దాల్చలేదు
- మహిళా రిజర్వేషన్ బిల్లుపై కాంగ్రెస్ నేత రాహుల్
- కేబినెట్ నిర్ణయాన్ని స్వాగతించిన కాంగ్రెస్ పార్టీ

న్యూఢిల్లీ,సెప్టెంబర్19 : కేబినెట్ నిర్ణయాన్ని ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ స్వాగతించింది. ఈ విషయమై 6 ఏళ్ల క్రితం కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. కాంగ్రెస్ నేత జైరాం నరేష్ అందుకు సంబంధించిన లెటర్‌ను ట్విటర్‌లో పోస్ట్ చేశారు. యూపీఏ ప్రభుత్వం 2008లో మహిళా రిజర్వేషన్ బిల్లును రూపొందించింది. కానీ రాజ్యసభలో ఆమోదం పొందేందుకు రెండేళ్లు పట్టింది. బీజేపీ మద్దతుతో ఎగువసభలో బిల్లు ఆమోదం పొందింది. ఈ బిల్లు రాజ్యసభ ఆమోదం పొందినప్పటికీ చట్ట రూపం దాల్చలేదు. అయితే ఈ బిల్లు విషయంలో బీజేపీకి కాంగ్రెస్ ఎప్పుడూ మద్దతిస్తూనే వచ్చింది. అయితే దేశంలోని మరికొన్ని కీలక రాజకీయ పార్టీలు ఈ బిల్లును తీవ్రంగా వ్యతిరేకించాయి. మహిళా రిజర్వేషన్లలో వెనుకబడిన తరగతులకు ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించాలనేది ఈ బిల్లు ముఖ్య ఉద్దేశ్యం. ఈ మహిళా రిజర్వేషన్ బిల్లుకు సంబంధించి 2018 జూలై 16న ఎన్డీయే హయాంలో రాహుల్ గాంధీ ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. ఇంతకీ ఆ లెటర్‌లో ఏం ఉందంటే.. రాహుల్ లేఖలో.. 'మహిళా సాధికారతకు తాను అనుకూలంగా ఉన్నానని మన ప్రధాని చెబుతున్నారు. రాజకీయాలకు అతీతంగా మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంటులో ఆమోదించాల్సిన సమయం ఆసన్నమైంది. కాంగ్రెస్ బేషరతుగా మీకు మద్దతు ఇస్తోందని లేఖలో పేర్కొన్నారు. మహిళా సాధికారత కోసం మనం ఐక్యంగా పోరాడదామని ప్రధాని మోదీకి రాహుల్ సందేశం ఇచ్చారు. యూపీఏ హయాంలో మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదం పొందుతుందనే విషయాన్ని కూడా రాహుల్ గాంధీ లేఖలో ప్రస్తావించారు. అప్పటి ప్రతిపక్ష నేత, దివంగత కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీ ఈ బిల్లును చారిత్రకమైన బిల్లుగా పేర్కొన్నారు.

## మహిళా బిల్లుకు బీఆర్ఎస్ మద్దతు

### బిల్లుకు మేం 100 శాతం మద్దతు ఇస్తామన్న కేకే

హైదరాబాద్,సెప్టెంబర్19 : పార్లమెంట్ లో మహిళా రిజర్వేషన్ బిల్లుకు బీఆర్ఎస్ పార్టీ పూర్తి సపోర్ట్ ఇస్తుందని బీఆర్ఎస్ రాజ్యసభ ఫ్లోర్ లీడర్ కే. కేశవరావు అన్నారు. బిల్లుకు మేం 100 శాతం మద్దతు ఇస్తామన్నారు. గతంలో రాజ్యసభలో బిల్లు వచ్చినపుడు నేను మాట్లాడాను.. మహిళా బిల్లులో బీసీ మహిళలకు కూడా ప్రాతినిధ్యం కల్పించాలనే డిమాండ్ ఉంది అని ఆయన పేర్కొన్నారు. 2010లో కూడా ఇదే సమస్య వచ్చింది.. కొన్ని పార్టీలు బీసీలకు వ్యతిరేఖంగా ఉన్నాయి.. బీసీలను అణగదొక్కేందుకు ప్రయత్నం చేస్తున్నారు అని కేవశరావు అన్నారు. ఎక్కడయినా ఏ పార్టీ అయినా.. పెత్తనం ఉన్న చోట బీసీలను అణిచి వేస్తున్నారు అంటూ కామెంట్స్ చేశాడు. బీసీలకు అధిక ప్రాధాన్యత కల్పించడంలో బీఆర్ఎస్ పార్టీ కొంత బెటర్ అని బీఆర్ఎస్ రాజ్యసభ ఫ్లోర్ లీడర్ కే. కేశవరావు అన్నారు. మహిళ బిల్లు కోసం ఎందరో ఉద్యమం చేశారు.

prajamantalau daily pages (20-09)(4 pages)_vijayatha pages (11-01) dummy pages 1,2 pages.qxd 9/20/2023 6:55 AM Page 4



# మహిళా బిల్లుకు డీ లిమిటేషన్ లింక్ సరికాదు!

ఎట్టకేలకు మహిళా బిల్లుకు మోక్షం కలగబోతోంది. ఈ క్రమంలో అధికార విపక్షాలు ముక్తకంఠంతో ముందుగా దీనిని గట్టెక్కించి.. మహిళల పట్ల తమ చిత్తశుద్దిని చాటుకోవాలి. పార్లమెంటులో ఎలాంటి శషభిషలకు పోకుండా ముందుకు సాగాలి. మహిళలకు మద్దతుగా అందరూ ఏకగ్రీవంగా బిల్లును ఆమోదించి మన హిళలకు గౌరవం దక్కేలా చేయాలి. అంతేగాకుండా డి లిమిటేషన్‌తో సంబంధం లేకుండా వెంటనే అమల్లోకి వచ్చేలా చేయాలి. రానున్న ఎన్నికల నుంచే రిజర్వేషన్లు అమలయ్యేలా చట్టంలో మార్పులు చేయాలి. దీనికి డీ లిమిటేషన్ లింకు తొలగించేలా విపక్షాలు పోరాడాలి. రానున్న అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల నుంచే మహిళా రిజర్వేషన్లు అమలు అయ్యేలా మార్పులతో చట్టాన్ని ఆమోదించి మోడీ ప్రభుత్వం చిత్తశుద్ది చాటాలి. విపక్షాలు కూడా దీనిపై పోరాడాలి. చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపిన తరవాత ..మహిళా రిజర్వేషన్ బిల్లు మంగళవారం లోక్‌సభ ముందుకొచ్చింది. ఈ రాజ్యాంగ సవరణ బిల్లును కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ నేడు దిగువ సభలో ప్రవేశపెట్టారు. నారీ శక్తి వందన్ అభియాన్ పేరుతో ఈ బిల్లును కేంద్రం తీసుకొచ్చింది. ఇది ఎంతో పవిత్ర కార్యక్రమంగా భావించాలి. బుధవారం నుంచి లోక్‌సభలో దీనిపై చర్చ జరగనుంది. ఆ తర్వాత ఓటింగ్ నిర్వహించి బిల్లుకు ఆమోదం తెలపనున్నారు. ఈ నేపథ్యంలో దాదాపు 27 ఏళ్ల తర్వాత మోదీ సర్కార్.. మహిళా రిజర్వేషన్లపై కొత్త బిల్లును తీసుకురావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇక, రాజ్యసభలో ఈ బిల్లును సెప్టెంబరు 21వ తేదీన ప్రవేశపెట్టనున్నారు. కాగా.. కొత్త పార్లమెంట్ భవనంలో ప్రవేశపెట్టిన తొలి బిల్లు ఇదే కావడం విశేషం. తాజా బిల్లు 2010లో రాజ్యసభలో ఆమోదం పొందిన బిల్లు వేర్వేరు కావడం వల్ల గతంలోకి పోకుండా తాజాగా దీనిపై చర్చకు సహకరించాలి. కొత్తదానికి పాతది ఒకటే కాదని కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. మహిళా రిజర్వేషన్ల అంశంపై కేంద్రం కొత్తగా మరో రాజ్యాంగ సవరణ బిల్లును తీసుకొస్తున్నట్లు తెలిపాయి. అందువల్ల తాజా బిల్లు ఉభయ సభల్లో ఆమోదం పొందాల్సి ఉంటుందని పేర్కొన్నాయి. వాస్తవానికి మహిళా రిజర్వేషన్ బిల్లును 1996లో హెచ్‌డీ దేవెగౌడ సారథ్యంలోని యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం తొలుత లోక్‌సభలో ప్రవేశ పెట్టింది. తర్వాత వాజ్‌పేయీ, మన్మోహన్ సింగ్ ప్రభుత్వాల హయాం లోనూ ప్రవేశపెట్టినప్పటికీ ఈ బిల్లు సభ ఆమోదానికి నోచుకోలేదు. చివరకు ఈ బిల్లు 2010లో రాజ్యసభ ఆమోదం పొందినా లోక్‌సభలో మాత్రం పెండింగులోనే ఉండిపోయింది. 2014లో ఆ లోక్‌సభ రద్దు కావడంతో అక్కడ బిల్లు మురిగిపోయింది. ఈ బిల్లు చట్టంగా మారితే.. లోక్‌సభ, రాష్ట్రాల శాసన సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలవుతాయి. అయితే, ఈ బిల్లు ఉభయ సభల్లో ఆమోదం పొందినప్పటికీ.. 2027 తర్వాత రిజర్వేషన్లు అమల్లోకి వస్తాయని కేంద్రం చెబుతోంది. నియోజకవర్గాల పునర్విభజన తర్వాత రొటేషన్ పద్రియలో రిజర్వు సీట్ల కేటాయింపు ఉంటుందని పేర్కొంది. దీని స్వరూపం ఎలా ఉన్నా లోక్ సభ, రాష్ట్రాల శాసనసభల్లో 33 శాతం సీట్లను మహిళలకు కేటాయించేందుకు ఉద్దేశించిన మహిళా రిజర్వేషన్ బిల్లు గట్టెక్కడం ముఖ్యం. దాదాపు మూడు దశాబ్దాలుగా ఎదురుచూ స్తోన్న బిల్లుకు.. విపక్షపార్టీలు కూడా మద్దతు ప్రకటిస్తుండటంతో చట్టరూ పం దాల్చడం ఖాయంగా కనిపిస్తోంది. అయితే, ప్రస్తుతం ఉభయసభల ఆమోదం పొందినప్పటికీ.. 2027 తర్వాతే ఇవి అమల్లోకి వస్తాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో లోక్‌సభతోపాటు అన్ని రాష్ట్రాల అసెంబ్లీల్లో మూడోవంతు సీట్లు మహిళలకు కేటాయించనున్నా రు. దిల్లీ అసెంబ్లీకీ కూడా ఇది వర్తిస్తుంది. విధాన నిర్ణయాల్లో మహిళా భాగస్వామ్యం పెంచడమే లక్ష్యంగా తీసుకువచ్చిన ఈ బిల్లు చట్టరూపం దాల్చితే.. చట్టసభల్లో 15 ఏళ్లపాటు మహిళకు రిజర్వేషన్లు అమల్లో ఉంటాయి. నియోజకవర్గాల పునర్విభజన తర్వాత రొటేషన్ పద్రియలో రిజర్వు సీట్ల కేటాయింపు ఉంటుంది. మహిళా రిజర్వేషన్ల కోసం రాజ్యాంగ సవరణ బిల్లును కేంద్రం ప్రవేశపెట్టనున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. మహిళలకు ఈ 33శాతం రిజర్వేషన్లు అమల్లోకి వచ్చిన తర్వాత 15ఏళ్ల పాటు అమల్లో ఉండనున్నాయి. తదుపరి వీటిని పెంచుకునే అవకాశం ఉంది. ఈ కోటాలోనే ఎస్సీ, ఎస్టీ మహిళలకు మూడోవంతు సీట్లను కేటాయిస్తారు. ఓబీసీ రిజర్వేషన్ల అంశాన్ని ఈ బిల్లులో పొందుపరచలేదు. కాగా.. ఈ మహిళా రిజర్వేషన్లు రాజ్యసభ, శాసన మండళ్లకు వర్తించవు. ఈ బిల్లు చట్టరూపం దాల్చిన అనంతరం చేపట్టే నియోజక వర్గాల పునర్విభజన పద్రియ పూర్తయిన తర్వాతే ఇది అమల్లోకి వస్తుంది. డీలిమిటేషన్ పద్రియ చేపట్టాలంటే జనగణన జరగాలి. 2021లోనే జనగణన జరగాల్సి ఉన్నప్పటికీ కొవిడ్ కారణంగా ఆ పద్రియ వాయిదా పడింది. ఈ నేపథ్యంలో 2027 డీలిమిటేషన్ పద్రియ తర్వాతే ఈ రిజర్వేషన్లు అమల్లోకి రానున్నాయి.

ఈ క్రమంలో దీనితో ముడిపడివున్న అనేక అడ్డంకులను తొలగించుకుంటే మంచిది. ఇక్కడా ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలి. జనగణనతో పాటు డి లిమిటేషన్ ప్రక్రియతో సంబంధం లేకుండా వచ్చే లోక్‌సభ ఎన్నికల నుంచి దీనిని అమలు చేస్తే మంచింది. 'ఈ బిల్లు ఎంపీలకు అగ్నిపరీక్షే' అని మోదీ అభివర్ణించినట్లు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ పలు జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఇదిలా ఉండగా.. జనగణన, నియోజకవర్గాల పునర్విభజన పద్రియలు పూర్తయిన తర్వాత 2027 నాటికి చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లను పూర్తి స్థాయిలో అమల్లోకి తీసుకురావాలని కేంద్రం భావిస్తున్నట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి.

# తెలుగు చిత్ర సీమను ఏలిన నట సామ్రాట్, నట సార్వభౌముడు



(రామ కిష్టయ్య సంగన భట్ల)
94405 95494

తెలుగు చిత్రసీమను దశాబ్దాల పాటు నిరాటంకంగా ఏలిన రాజులు ఇద్దరు. ఒకరు విశ్వవిఖ్యాత నట సార్వభౌముడు నందమూరి తారక రాముడు, మరొకరు నట సామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు. చిత్ర సీమలో నటులుగా పోటీ పడినా, జీవితంలో సోదర భావంతో మెలిగిన ఇరువురూ తెలుగు ప్రజా హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించారు. డాక్టర్ నందమూరి తారక రామారావు, డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు... ఇద్దరూ ఇద్దరే. తెలుగు చిత్రరంగానికి రెండు కళ్లు. తెలుగు చిత్ర పరిశ్రమలో హీరోలకు కొరతగా ఉన్న రోజుల్లో ప్రవేశించి, తమ ప్రతిభతో అత్యున్నత స్థాయికి చేరుకుని తెలుగు జాతి గర్వించదగ్గ చిత్రాలను ఇద్దరూ అందించారు. దశాబ్దాల తరబడి తెలుగు చిత్ర పరిశ్రమకు వీరిద్దరూ రథచక్రాలుగా నిలిచారు. తెలుగు చిత్రరథాన్ని తెలుగు గడ్డకు తరలించడానికి ఎంతో కృషి చేశారు. అంతేకాదు వీళ్లిద్దరూ తెలుగు చిత్ర పరిశ్రమకు క్రమశిక్షణ నేర్పారు. ఆరోగ్య విషయాలతో సహ అన్నింటా క్రమశిక్షణతో మెలిగారు. తెలుగు చిత్ర పరిశ్రమకు గుర్తింపు, గౌరవం, హోదా, డబ్బు తెచ్చిపెట్టిన ఘనత వీరిద్దరిదే. 'స్టార్‌డమ్' అనే మాట ఈ మహానటుల కాలంలోనే తెలుగునాట ప్రవేశించింది. అయితే ఆ అగ్ర శ్రేణి కథా నాయకుల మధ్య కొన్ని పోలికలున్నాయి. ఇద్దరిలో కొన్ని సారూప్యాలు, మరికొన్ని వైరుధ్యాలు కూడా ఉన్నాయి. ఇద్దరూ హీరోలు కాకముందు స్టేజీ మీద స్త్రీ పాత్రలు పోషించారు. అక్కినేని 'హరిశ్చంద్ర'లో చంద్రమతి వేషం వేస్తే... 1940లో కాలేజీలో ఇంటర్ చదివే రోజుల్లో 'రాచమల్లు దౌత్యం' నాటకంలో నందమూరి నాగమ్మ వేషం వేశారు. 1932లో మాట నేర్చి, టాకీ చిత్రానికి శ్రీకారం చుట్టిన తెలుగు సినిమా తొమ్మిదేళ్లు పూర్తి చేసుకున్న సమయంలో నాగేశ్వరరావు చిత్రరంగం లోకి ప్రవేశించారు. ఆయన వచ్చిన ఏడేళ్ల అనంతరం రామారావు సినీ రంగ ప్రవేశం చేశారు. అక్కినేని నాగేశ్వరరావు మొదటి చిత్రం 'ధర్మపత్ని'. ఎన్టీఆర్ తొలి సినిమా 'మనదేశం'. వీరు మొదటి చిత్రాల్లో గుర్తింపు పొందని పాత్రల్లో నటించారు. అంతేకాదు ఆ తర్వాత కొన్నేళ్లకు ఆరు నెలల తేడాతో హైదరాబాద్‌లో స్టూడియోలు నిర్మించి ఇతరులకు ఆదర్శంగా నిలిచారు. అక్కినేని అన్నపూర్ణ స్టూడియోస్ ఏర్పాటు చేస్తే.. ఎన్టీఆర్ రామకృష్ణ హార్టికల్చరల్ సినీ స్టూడియోస్ స్థాపించారు.తెలుగు వెండి తెర స్వర్ణ యుగం తొలి దశాబ్ద కాలంలో విడుదల్కెన చిత్రాల సంఖ్యలో సగభాగం ఈ మహానటులు నటించిన చిత్రాలే ఉండటం గమనార్హం. మకుటం లేని మహారాజుల్లా అగ్ర నటులుగా కొనసాగిన వీరిద్దరూ ఎలాంటి భేషజాలకు పోకుండా పౌరాణిక, జానపద, చారిత్రక, సాంఘిక చిత్రాలు 14 సినిమాల్లో కలిసి నటించారు. ప్రపంచ సినీ చరిత్రలో ఏ ఇద్దరు అగ్రనటులు ఇన్ని సినిమాల్లో ఇన్ని బానర్స్‌లో కలిసి నటించలేదు. ఇది ఒక రికార్డు. 1950లా 'పల్లెటూరి పిల్ల'తో ప్రారంభించి, ఆ తరువాత సంసారం (1950), పరివర్తన (1954), మిస్సమ్మ (1955), తెనాలి రామకృష్ణ (1956), చరణదాసి (1956), మాయాబజార్ (1957), భూక్కైలాస్ (1958), రేచుక్క (అక్కినేని గెస్ట్.. 1954), గుండమ్మ కథ (1962), శ్రీకృష్ణార్జున యుద్ధం (1963), చాణక్య-చంద్రగుప్త (1977), రామకృష్ణులు (1978), చివరగా సత్యం-శివం (1981) చిత్రాల్లో వీళ్లిద్దరు కలిసి నటించారు. శ్రీకృష్ణార్జున యుద్ధం చిత్రం తరువాత దాదాపు 14 ఏళ్లపాటు ఈ అగ్రనటులిద్దరి మధ్య మాటలే లేక పోవడం గమనార్హం.మళ్లీ 1977లో విడుదల్కెన 'చాణక్య - చంద్రగుప్త' చిత్రంతో ఈ ఇద్దరు అగ్రనటులు కలిసి నటించారు. ఈ చిత్రాన్ని రామారావు ఆయన సొంత నిర్మాణ సంస్థ రామకృష్ణ సినీ స్టూడియోస్ బ్యానర్‌లో స్వయంగా నిర్మించి దర్శకత్వం వహించారు. ఈ చిత్రంలో ఎన్టీఆర్ చంద్రగుప్తుడుగా నటిస్తే.. అక్కినేని చాణక్యుడిగా నటించారు. తమిళ అగ్ర నటుడు శివాజీ గణేషన్ ఈ చిత్రంలో అలెగ్జాండర్ పాత్రలో నటించారు.చాణక్య చంద్రగుప్త తరువాత తన రెగ్యులర్ ప్రొడ్యూసర్ వి.బి.రాజేంద్ర ప్రసాద్‌తో కలిసి నాగేశ్వరరావు నిర్మించిన రామకృష్ణులు చిత్రంలో కలిసి నటించారు. ఎన్టీఆర్ పెద్ద అల్లుడు దగ్గుబాటి వెంకటేశ్వర రావు నిర్మాణంలో కే.రాఘవేంద్ర రావు దర్శకత్వంలో వచ్చిన సత్యం - శివం వీరిద్దరి కలయికలో వచ్చిన చివరి చిత్రం. తెలుగు చిత్ర పరిశ్రమను విస్తృతం చేయాలనే లక్ష్యంతో, ధ్యేయంతో కృషి చేసిన అక్కినేని, నందమూరి సేవలను ప్రేక్షకులే కాదు కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. 1968 జనవరి 26న ఇద్దరినీ ఒకేసారి పద్మశ్రీ బిరుదుతో సత్కరించి, గౌరవించడం విశేషం.1964లో ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన నంది అవార్డులు ఈ ఇద్దరు అగ్ర నటులు నటించిన చిత్రాలకు దక్కడం విశేషం. ఈ అగ్ర నటులు ఇద్దరూ హిందీ సినిమాల్లో నటించారు. అక్కినేని 'సువర్ణ సుందరి' హిందీ రీమేక్‌లో నటిస్తే...ఎన్టీఆర్ 'చండీరాణి', 'నయా ఆద్మీ' సినిమాల్లో నటించారు. వీళ్లిద్దరు తమిళంలో కూడా తమ సత్తా చాటారు.ఏఎన్నార్, ఎన్టీఆర్ ఇద్దరూ కృష్ణా జిల్లా నుంచి వచ్చినవారే. అక్కినేనిది గుడివాడ తాలూకా వెంకట రాఘవపురం, రామారావుది నిమ్మకూరు. వీరిద్దరూ సినీ పరిశ్రమకు నట వారసులను అందించారు. ఈ రెండు కుటుంబాలకు చెందిన మూడో తరం నట వారసులు కూడా సినిమాల్లో తమదైన ప్రత్యేకతతో రాణిస్తుండటం విశేషం.ఎన్టీఆర్ తన అర్ధాంగి జ్ఞాపకార్థం బసవ తారకం క్యాన్సర్ ఆస్పత్రిని నిర్మించారు. అక్కినేని తన జీవిత భాగస్వామి పేరిట అన్నపూర్ణ స్టూడియో కట్టించారు. ఈ అగ్ర నటుల భార్యలు వీరిద్దరి కంటే ముందు కన్ను మూసారు. అక్కినేని కంటే ఏడాదిన్నర పెద్ద అయిన ఎన్టీఆర్ సినిమాల్లో రావడానికి పెద్దగా కష్టపడలేదు. వెయ్యి నూట పదహార్ల అడ్వాన్సుతో బి.ఏ.సుబ్బారావు సినిమాలో రామారావు హీరోగా బుక్ అయ్యారు. పాత్రల ఎంపికలో అక్కినేని ఆచితూచి అడుగులు వేస్తే..ఎన్టీఆర్ మాత్రం హీరోయిజం వున్న సినిమాలతో పాటు ప్రతి నాయక పాత్రలు తాగుబోతు, దివ్యాంగుల పాత్రలు వేయడానికి వెనకడుగు వేయలేదు. తన తన నట జీవితంలో ఏఎన్నార్ ఎపుడు కృష్ణుడి పాత్రని వేయలేదు. కానీ సిపాయి చిన్నయ్య చిత్రంలో ఓ పాటలో కృష్ణుడిగా కాసేపు అలా కనిపించారు. రాజకీయాల్లోకి ప్రవేశించి పార్టీ పెట్టాలనుకు న్నప్పుడు అక్కినేనితో సంప్రదించి, ఆయనని కూడా రాజకీయాల్లోకి ఆహ్వానించారు రామారావు. తన ఆరోగ్య కారణాల వల్ల రాలేనని చెప్పి, తన అభినందనలు తెలియ జేసారు నాగేశ్వరరావు. ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన ఎన్టీఆర్ పదవులు ఆఫర్ చేసినా...మన స్నేహం ముఖ్య మ్కొంది. ఈ పదవులు ఎందుకు బ్రదర్ అని చెప్పి సున్నితంగా తిరస్కరించారు అక్కినేని. ఇంతటి అనుబంధం కలిగిన వీరిద్దరి మధ్య అన్నపూర్ణ స్టూడియోస్‌కి సంబంధించిన ఏడెకరాల స్థలం విషయంలో మళ్లీ మనస్ప ర్థలు ఏర్పడి దాదాపు ఏడేళ్లు దూరమయ్యారు. అలా దూరం కావడానికీ, తిరిగి తామిద్దరం దగ్గర కావడానికీ కూడా రామారావే కారణ మని అక్కినేని చెప్పేవారు. తెలుగు సినిమాకి స్టార్‌డమ్ నేర్పిన ఈ మహానటు లిద్దరూ తమ మధ్య అభిప్రాయ భేదాలు ఉన్నప్పటికీ ఏనాడూ బహిరంగంగా ఒకరినొకరు నిందించు కోలేదు. చివరగా వీరిద్దరు ఒకే నెల (జనవరి)లో కన్నుమూసారు.







## సాహితీ ప్రేమికులకు ప్రత్యేకం

**' ప్రజా మంటలు" తెలంగాణ జాతీయ దినపత్రికలో రేపటి నుండి ప్రతి రోజు, " నేటి కథ" శీర్షికన ఒక కథను ప్రచురించనున్నామని తెలుపుట కు సంతోషిస్తున్నాం. రచయితలు తమ కథలను mantalukathalu@gmail.com కు పంపవచ్చు...**

**-ఎడిటర్**

# ఎవరు ఎలా ఉండాలి?






సిరిపురంలో ఉండే రైతు రామయ్య , అతనికి కొంత వ్యవసాయ భూమి ఉంది. మంచి నీటి వసతి ఉండటంతో మూడు పంటలు పండించే వాడు. భూమి దున్నడానికి అతని దగ్గర మంచి ఎద్దుల జత ఉండేది. అవి కూడా చిన్నతనం నుంచి ఆయన దగ్గరే పెరగడంతో యజమానికి ఎంతో విశ్వాసంతో ఉంటూ ఆయన చెప్పిన ప్రతి పనిని చక్కగా చేసిపెట్టేవి.రామయ్య కూడా వాటిని ఎంతో అపురూపంగా చూసుకొనే వాడు. ఉన్నట్టుండి ఒక రోజు ఎద్దుల జతలో ఒక దానికి మూపురంపై ఒక కురుపు ఇబ్బంది పెట్టడం మొదలైంది. అసలే పంటల సాగు కాలం, పనికి బాగా అలవాటు పడ్డ ఎద్దు, ఆ రోజు రామయ్యను ఏమాత్రం ఇబ్బంది పెట్టకుండా దున్నడం పూర్తి చేసింది.ఇలా రోజులు గడుస్తున్న కొద్దీ ఎద్దుకు దాని వల్ల ఇబ్బంది ఎక్కువైంది, కురుపు కంటికి కనపడేంత పెద్దది కాకపోవడంతో రామయ్య దానిని పసిగట్టలేక పనిలో మునిగి పోయాడు. రోజూ లాగే మడక కట్టి భూమిలోకి దిగాడు రామయ్య. నొప్పి వల్ల అప్పటికే అసహనంతో ఉన్న ఎద్దు రామయ్య తన బాధను అర్థం చేసుకోవడం లేదని పనిలో కాస్త మొరాయించింది.పని ఒత్తిడి ఎక్కువగా ఉండటంతో అప్పుడే ఎద్దు మాట వినకపోవడం కోపం వచ్చిన రామయ్య దానిని రెండు దెబ్బలు వేశాడు. ఇన్నాళ్లు విశ్వాసంతో పని చేసినందుకు తనకు తగిన శాస్తే జరిగిందని ఆ రోజు రాత్రి అందరూ నిద్రలో ఉండగా కట్టేసిన గాటి నుండి తప్పించుకు వెళ్ళిపోయింది. ఉదయాన్నే గమనించిన రామయ్య ఒంటెద్దుతో పని చేయలేక ఇంకో ఎద్దును తెస్తే అది ఉన్న దాంతో ఎలా ఇముడుతుందో తెలియక ఇంకో కొత్త కోడెల జతను తెచ్చుకున్నాడు. వాటితో మరుసటి రోజు నుండి పని ప్రారంభించాడు. అవి అసలే పనికి కొత్త కావడం , మొదటి నుంచి దున్నే పని చేయకపోవడంతో రామయ్యను నానా ఇబ్బందులు పెట్టసాగాయి. అవి కొత్త కావున ఎక్కడ కొడితే మాట వినవో అన్న భయంతో వాటిని కొట్టడం మానేశాడు. ఎప్పుడూ లేనిది మొదటి సారి యంత్రాలతో పొలం చదును చేసి దున్నాడు. ఒకవైపు పని చేస్తున్నా మనసు మనసులో లేదు.పంట పెరిగి చేతికొచ్చే స్థితిలో ఉంది. కలుపు తీయడానికి , ఎరువులు మోయడానికి , కూలీలను తరలించడానికి ఉన్న కాడెద్దులు పూర్తిగా సహకరించడం లేదు. ఉన్నవాటిని పోగొట్టుకోవడం చాలా బాదనిపించింది రామయ్యకు, అది రోజూ బాగా పనిచేసి ఆ ఒక్క రోజు మొరాయించడానికి ఏదో కారణం ఉండి ఉండవచ్చు, మూగజీవి కదా చెప్పుకోలేక పోయింది అనుకోని చాలా బాధ పడ్డాడు.మరోవైపు తప్పించుకు పోయిన ఎద్దుకు ఎక్కడా సరైన మేత దొరకలేదు. రోజూ బాగా చూసుకొనే యజమాని ఒక సారి అదిలిస్తే తప్పేముందని ఆలోచించకుండా ఇలా వదలి రావడం తప్పని తెలుసుకుంది ఎద్దు.ఉన్న ఫలంగా పరుగులు తీస్తూ పొలం గట్టు పై కూర్చొని ఉన్న యజమాని రామయ్య ఎదకు తల ఆనించింది. దాన్ని చూసి సంతోషంతో రామయ్య కూడా గంగడోలు నిమురుతూ సాదరంగా ఇంటికి తీసుకువచ్చాడు.కాసేపటికి గాటికి కట్టేసిన రెండో ఎద్దు అడిగింది ఈ సంఘటన నుండి నువ్వేం నేర్చుకున్నావు అని "ఎప్పుడూ నేనే ఎక్కువ పని చేస్తున్నాను అని విర్రవీగకూడదు. అంతే కాదు యజమాని తండ్రి లాంటి వాడు మనపై కోప్పడే హక్కు ఆయనకు మాత్రమే ఉంటుంది".ఇదే ప్రశ్న మరో వైపు రామయ్య భార్య ఆయన్ను అడిగింది,అందుకు "పనిచేసే వాన్ని బానిసగా చూడకూడదు, పిల్లలు తప్పు చేయడం సహజం వాళ్ళను మందలించే విధానం కఠినంగా ఉండకూడదు"అన్నాడు రామయ్య.

**సింగంపల్లి శేష సాయి కుమార్,**
**రాజంపేట,అన్నమయ్య జిల్లా,**
**8639635907**

# భిక్షకుడు



గంగాపురు గ్రామంలో ఒక పేద కుటుంబం ఉండేది. ఆ కుటుంబంలో గోపాల్,రమణి దంపతులు ఉండేవారు. వారు ఎంతో సంతోషంగా ఉండేవారు. కుటుంబంలో చిన్న పాప ఉంది. ఆ పాప పేరు సృజన.ఆమె చాలా తెలివైనది.ఒకరోజు వారి ఇంట్లో సరుకులన్ని అయిపోయాయి .కొనడానికి డబ్బులు కూడా లేవు. అందువల్ల ఆమె తల్లిదండ్రులు చాలా బాధపడుతూ కూర్చున్నారు. అప్పుడే బడి నుండి ఇంటికి వచ్చిన కూతురు సృజన అమ్మ నాన్నలతో "మీకు ఏమైంది మీరు ఎందుకు అలా నిరాశగా కూర్చున్నారు " అడిగింది."ఏమిలేదు " అన్నారు."అమ్మ నాకు ఆకలేస్తుంది .అన్నం పెట్టవా ". అని సుజన అడిగింది . రమణి పక్కింటి వారి ఇంటికి వెళ్ళి తీసుకొచ్చి సృజనకు పెట్టింది."అమ్మ మీరు తినరా " అంది సృజన."మేము తరువాత తింటాం .నువ్వు వెళ్ళి పడుకో " అంది రమణి. సరే అని సృజన గదిలోకి వెళ్ళింది. ఉదయాన్నే వారు లేచి ఏమి చేయాలని ఆలోచించగా అప్పుడు ఒక భిక్షకుడు వచ్చి"అమ్మ కొన్ని మంచినీళ్ళు ధర్మం చేయండి" అని అడిగాడ . సరే అని లోపలికి వెళ్ళి మంచినీళ్ళు తెచ్చి ఇచ్చింది రమణి. అప్పుడు భిక్షకుడు "అలా బాధగా ఉన్నారు, ఏమైంది అమ్మ" అని అడిగాడు. "ఇంట్లో సరుకులు లేవు " అంది." సరే,మీరు ఇంట్లోకి వెళ్లి చూడండి " అన్నాడు .రమణి ఇంట్లోకి వెళ్ళి చూడగానే అన్ని సరుకులు ఉన్నాయి .వెంటనే బయటకు వచ్చి చూడగానే ఆ భిక్షకుడు కనిపించలేదు.ఆ దేవుడే ఇచ్చిన ఇలా వచ్చి వరం ఇచ్చాడని రమణి,గోపాల్ అనుకున్నారు. వారు ఎంతో సంతోషించారు.

**నీతి:** ఎవరైనాఇంటికి వచ్చి సహాయం అడిగినా తప్ప కుండా ఆ సహాయం చేయాలి.

**- మల్లు గారి వర్ష, 6వ తరగతి**
**జక్కాపూర్, సిద్దిపేట 9959007914**

# ఆటంకాలకు ముగింపు పలుకుదాం

## కొత్త చరిత్రకు శ్రీకారం చుడదాం: ధన్‌ఖడ్

న్యూఢిల్లీ,సెప్టెంబర్19 : పార్లమెంటు కార్యకలాపాలకు విఘాతం కలిగేలా ఆటంకాలను ఆయుధాలుగా మలచుకునే వ్యూహానికి ముగింపు పలికేందుకు ఇదే సరైన సమయమని ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ పేర్కొన్నారు. కలసి నడవడం..కలసి చర్చించడం ద్వారా చరిత్ర సృష్టిద్దామని అన్నారు. ఇందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. కొత్త పార్లమెంటు భవనం వేదికగా మంగళవారం సభాకార్యకలాపాలు మొదలయ్యాయి. ప్రధాని నరేంద్ర మోదీ, ఇతర ఎంపీలు కొత్త భవనానికి ర్యాలీగా తరలి వెళ్లారు. అంతకుముందు పాత భవనంలోని చారిత్రక సెంట్రల్ హాల్లో పార్లమెంటు గొప్ప వారసత్వాన్ని స్మరించుకునే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప రాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ ప్రసంగించారు. పార్లమెంటు కార్యకలాపాలకు విఘాతం కలిగేలా ఆటంకాలను ఆయుధాలుగా మలచుకునే వ్యూహానికి ముగింపు పలికేందుకు ఇదే సరైన సమయమని పేర్కొన్నారు. అటువంటి చర్యలు.. ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు.'ప్రజాస్వామ్య దేవాలయాల్లో నిబంధనల అతిక్రమణల ను వదులుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. కొత్త పార్లమెంటు భవనంలోకి అడుగుపెడుతోన్న వేళ.. పరస్పర సహకారాన్ని, ఏకాభిప్రాయ విధానాన్ని సభ్యులు పెంపొందించుకోవాలి.

prajamantalau daily pages (20-09)(4 pages)_vijayatha pages (11-01) dummy pages 1,2 pages.qxd 9/20/2023 6:55 AM Page 5



## ఉచిత మట్టి వినాయక విగ్రహాల పంపిణీ



**జనగామ సెప్టెంబర్ 19 (ప్రజామంటలు):** ఉచిత మట్టి వినాయక విగ్రహాల పంపిణీ ఎమ్మార్వో కార్యాలయం వద్ద తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి, లక్ష్మీ గణపతి అమావాస్య అన్న ప్రసాద వితరణ సేవా సమితి, అవోపా జనగామ జిల్లా వనిత క్లబ్ గ్రేటర్ జనగామ ఆధ్వర్యంలో ఉచిత మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమం అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ పోకల జమున లింగయ్య హాజరై మాట్లాడుతూ.... గత ఐదు సంవత్సరాలుగా స్థానిక ఎమ్మార్వో కార్యాలయం వద్ద రసాయన కెమికల్ రహిత మట్టి విగ్రహాల పంపిణీ కార్యక్రమం ప్రారంభం చేశారని, ఇక్కడ ప్రతి సంవత్సరము వినాయక చవితిని పురస్కరించుకుని 1221 మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ ఏవో సుభాష్, పజ్జూరి జయాహరి పజ్జూరి గోపయ్య, మరియాల అశోక్, గంగిశెట్టి ప్రమోద్ కుమార్, మా శెట్టి రవీందర్, మీనుకోరి రవీందర్ రెడ్డి, వనిత క్లబ్ గ్రేటర్ అధ్యక్షులు డాక్టర్ మాధంశెట్టి వరూధిని, కార్యదర్శి గంగిశెట్టి అనూజ, గట్టు వెంకటేశ్వర్లు, పడకంటి రవీందర్, కాసం విజయ్ కుమార్, మర్రి రామాంజనేయులు గంగిశెట్టి మనోజ్ కుమార్ శరివిరాల ఉపేందర్ పాల్గొన్నారు.

## ఆరు హామీలను ప్రతి గడపకు చేరవేస్తాం

### కాంగ్రెస్ మేనిఫెస్టో మెంబర్ మర్రి ఆదిత్య రెడ్డి



**సనత్ నగర్ సెప్టెంబర్ 19 (ప్రజామంటలు):** కాంగ్రెస్ పార్టీ తీసుకొచ్చిన ఆరు గ్యారెంటీ హామీలను సనత్ నగర్ నియోజకవర్గంలోని ప్రతి గడపకు చేరవేస్తామని ఎంసీఆర్ఎఫ్ ఛైర్మన్, టీపీసీసీ సభ్యులు, మేనిఫెస్టో కమిటీ మెంబర్ మర్రి ఆదిత్య రెడ్డి అన్నారు. గడప గడపకు గ్యారెంటీ కార్డుల కార్యక్రమాన్ని నియోజకవర్గ పరిధిలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ, కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు మీనాక్షి నటరాజన్, డీసీసీ ప్రెసిడెంట్ అనిల్ కుమార్ యాదవ్‌లతో కలిసి ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు హామీలను వివరించారు. అధికారంలోకి వచ్చాక ప్రతీ హామీని అమలు చేస్తామని, సామాజిక తెలంగాణ సాకారానికి బాటలు వేస్తామని పేర్కొన్నారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని గెలిపించి సోనియమ్మ రుణం తీర్చుకోవాలని సూచించారు. వచ్చే ఎన్నికల్లో మోసకారి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఓడిస్తామని, సనత్ నగర్ గడ్డపై కాంగ్రెస్ జెండాను ఎగురవేస్తామని ఆదిత్యరెడ్డి అన్నారు. తాత మర్రి చెన్నారెడ్డి ఇదే గడ్డపై గెలిచి ముఖ్యమంత్రిగా ఎదిగారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎన్. విఠల్, డాక్టర్ శివకుమార్ లాల్, శైలేష్ గౌడ్, కృష్ణ యాదవ్, సత్యనారాయణ, వేద ప్రకాశ్ యాదవ్, కృష్ణ ముదిరాజ్, త్రికాల మనోజ్ కుమార్, చక్రం ప్రభాస్, రమేష్, సురేష్, రాజేందర్ పాల్గొన్నారు.

## దశాబ్దకాలంగా ఎం.ఎన్.కే. లో గణేశుడి నవరాత్రోత్సవాలు

### కన్నుల పండువగా వేడుకలు



**సికింద్రాబాద్ సెప్టెంబర్ 19 (ప్రజామంటలు) :** సికింద్రాబాద్ న్యూబోయిగూడ లోని ఎం.ఎన్. కే విఠల్ సెంట్రల్ కోర్టు అపార్ట్ మెంట్ లో వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. నవరాత్రోత్సవాలల్లో భాగంగా సోమవారం వినాయక చవిత పండుగ రోజున ఆపార్ట్ మెంట్ ఆవరణలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో ప్రతిష్టించిన గణనాధుడి సన్నిదానాన్ని చక్కగా అలంకరించారు. ఈసందర్భంగా గణనాధుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గత పది సంవత్సరాలుగా తమ అపార్ట్ మెంట్ లో ప్రతి ఏడాది నిర్విరామంగా వినాయక నవరాత్రోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆపార్ట్ మెంట్ అసోసియేషన్ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ జి. హనుమాన్లు, సెక్రటరీ వి. ఉమాశంకర్, వైస్ ప్రెసిడెంట్ కె. మోహన్ దాస్, జాయింట్ సెక్రటరీ కాళిదాసు, ట్రెజరర్ సేతు మాదవరావు, కమిటీ మెంబర్ వి. సుధీర్ బాబు, అపార్ట్ మెంట్ వాసులు పాల్గొన్నారు. ఈసందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి.

## ఎన్.ఎస్.యు.ఐ. జిల్లా ప్రధాన కార్యదర్శిగా మాడుగుల చింటు నియామకం



**భీమదేవరపల్లి సెప్టెంబర్ 19 (ప్రజామంటలు):** కాంగ్రెస్ పార్టీ అనుబంధ విద్యార్థి విభాగము ఎన్.ఎస్.యు.ఐ. హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ముల్కనూర్ గ్రామానికి చెందిన మాడుగుల చింటు నియామకం అయ్యారు. ఈ మేరకు ఎన్.ఎస్.యు.ఐ. రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ నియామక పత్రాన్ని పంపించారు. గత కొన్ని సంవత్సరాలుగా భీమదేవరపల్లి మండలంలో ఎంతో చురుకుగా విద్యార్థి, ప్రజా సమస్యలపై చేస్తున్న పోరాటాలను గుర్తించి జిల్లా నాయకత్వానికి అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా చింటు తన నియామకానికి సహకరించిన హుస్నాబాద్ మాజీ శాసన సభ్యులు అలిగి రెడ్డి ప్రవీణ్ రెడ్డి, ఎన్.ఎస్.యూ.ఐ. రాష్ట్ర అధ్యక్షులు బల్మూర్ వెంకట్, హనుమకొండ జిల్లా అధ్యక్షులు పల్లకొండ సతీష్ లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



జనగామ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ పూలే అధ్యయన వేదికలో ఈ విద్యా సంవత్సరం ఎంబిబిఎస్ సీట్లు సాధించిన ఉపాధ్యాయులు చింత యాదగిరి అధ్యక్షతన విద్యార్థులు బ్యూలా, మానస లకు సన్మాన కార్యక్రమం. ముఖ్య అతిథులుగా డాక్టర్ వంశీ, డాక్టర్ మనస్విని లు పాల్గొని భవిష్యత్తులో సమాజం కోసం పని చేస్తూ ప్రజా వైద్యులుగా పేరు పొందాలని సూచించారు.
(ప్రజామంటలు):

# మహిళా బిల్లును స్వాగతిస్తున్నాం

**కానీ మోడీ ప్రభుత్వానికి మహిళా బిల్లుపై చిత్తశుద్ధి లేదు**

**కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ తీరు వల్ల వచ్చే పదేళ్ల వరకు మహిళా బిల్లు అమలులోకి వచ్చే పరిస్థితి లేదు**

**రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్ కుమార్ డిమాండ్**



**హైదరాబాద సెప్టెంబర్ 19 (ప్రజా మంటలు) :** కేంద్ర ప్రభుత్వం చట్ట సభల్లో ప్రతిపాదిస్తున్న మహిళా బిల్లును స్వాగతిస్తున్నామని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. కానీ మోడీ ప్రభుత్వానికి మహిళా బిల్లుపై చిత్తశుద్ధి లేదని, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ తీరు వల్ల వచ్చే పదేళ్ల వరకు మహిళా బిల్లు అమలులోకి వచ్చే పరిస్థితి లేదని, వచ్చే అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలలోనే మహిళా బిల్లు అమలులోకి వచ్చే విధంగా, మోడీ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశ పెట్టిన మహిళా బిల్లు తీరును గమనిస్తే.. వచ్చే ఎన్నికలలో మహిళా బిల్లు రిజర్వేషన్లు వర్తించవు అని స్పష్టం అవుతోందని, 2002 లో చేసిన 82 వ రాజ్యాంగ సవరణ ప్రకారం 2026 తరువాతనే డీ-లిమిటేషన్ జరుగుతుందని, 2031 లో జనాభా గణన ఉంటుందని, వివిధ రకాల ప్రాసెస్ పూర్తి అయిన తర్వాతనే మహిళా బిల్లు అమల్లోకి వచ్చే అవకాశాలు ఉన్నాయని వినోద్ కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇది మోడీ ప్రభుత్వానికి ఎంత మాత్రం మంచిది కాదని, మహిళా బిల్లుపై మహిళలకు ఆశలు కల్పించి ... ఆచరణలో మాత్రం మోడీ ప్రభుత్వం మొండి చెయ్యి చూపుతోందని, 2031లో జన గణన పూర్తయిన తర్వాత అంటే.. మరో పదేళ్ల పాటు మహిళా బిల్లు అంశం కొనసాగుతుందని స్పష్టం అవుతోందని, తరువాత పార్లమెంటులో మళ్ళీ చట్టం చేస్తేనే మహిళా బిల్లు సాధ్యం అవుతుంది అని వినోద్ కుమార్ తెలిపారు.

## 11వ రోజుకు చేరిన ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి నిరసన దీక్షలు..



**జనగామ సెప్టెంబర్ 19 (ప్రజామంటలు):** ఈ ప్రత్యేక పార్లమెంటు సమావేశాలలోనే ఏబిసిడి వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. ఎమ్మెస్పీ జనగామ జిల్లా ఇన్చార్జి మేడిపల్లి శ్యామ్ మాదిగ, ఎంఎస్పి జనగామ జిల్లా నాయకులు నిర్మల భాస్కర్ మాదిగ 11వ రోజు దీక్షలను ప్రారంభించి మాట్లాడారు. ఈనెల 18వ తారీఖు నుండి 22వ తారీకు వరకు జరుగుతున్న ప్రత్యేక పార్లమెంటు సమావేశాలలోనే ఎస్సీల ఏబిసిడి వర్గీకరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. ఈ ప్రత్యేక పార్లమెంటు సమావేశాల్లో మహిళా బిల్లును ప్రవేశపెట్టినారని దాన్ని స్వాగతిస్తున్నామన్నారు. ఈ దీక్ష శిబిరంలో ఎమ్మార్పీఎస్ జనగామ జిల్లా అధ్యక్షులు పైసా రాజశేఖర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ జనగామ జిల్లా ప్రధాన కార్యదర్శి బోట్ల మహేష్ మాదిగ, విద్యపాక ఎల్లయ్య మాదిగ, తుర్కపల్లి శ్రీనివాస్ మాదిగ, యాఖరి బాలనరసయ్య మాదిగ పాల్గొన్నారు.

## పీవోపీ గణపతులు వద్దు... మట్టి గణపతులే ముద్దు..

### సీనియర్ కాంగ్రెస్ నేత నాగులూరి సాయిబాబా



**సికింద్రాబాద్ సెప్టెంబర్ 19 (ప్రజామంటలు):** పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతులనే వాడాలని సికింద్రాబాద్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు నాగులూరి సాయిబాబా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వినాయక చవితి పండుగను పురస్కరించుకొని చిలకలగూడ శ్రీసాయిబాబా సమేత బాల ఆంజనేయస్వామి ఆలయంలో మట్టి గణేశ్ ప్రతిమలను భక్తులకు ఆయన అందచేశారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ తో పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని, ఈ విషయాన్ని అంతా గమనించాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, బస్తీ వాసులు పాల్గొన్నారు.

## ఈ-పాస్ మిషన్ ద్వారా మాత్రమే ఎరువులు విక్రయించాలి

### జిల్లా కలెక్టర్ సిహెచ్. శివలింగయ్య



**జనగామ సెప్టెంబర్ 19 (ప్రజామంటలు):** జిల్లా కలెక్టర్ సిహెచ్. శివలింగయ్య జనగామ పట్టణంలోని మహాలక్ష్మి ఫెర్టిలైజర్స్, ఆగ్రోస్ ఇండస్ట్రీస్ సర్వీస్ ఫర్టిలైజర్స్ షాపులను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... జిల్లాలో ప్రతి ఎరువుల బస్తాలను పిఓఎస్ (పాయింట్ ఆఫ్ సేల్) ఈ- పాస్ మిషన్ ద్వారా మాత్రమే ఎరువులను విక్రయించాలన్నారు, ఈ మిషన్ లో ఉన్న బ్యాలెన్స్ ఎరువుల వివరాల ప్రకారం షాపులో ఉండాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎరువులను విక్రయించాలని లేనిపక్షంలో సంబంధిత డీలర్స్ షాపు యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. జిల్లాలోని వ్యవసాయ శాఖ అధికారులు నిరంతరం ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేయాలని ఆదేశించారు. జిల్లాలో రైతులకు సరిపడా యూరియా ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ తనిఖీల్లో ఆయన వెంట జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వినోద్ కుమార్, ఏడిఏ భినా తదితరులు ఉన్నారు.

## గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్లక్ష్యం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం




**ఎల్కతుర్తి సెప్టెంబర్ 19 (ప్రజామంటలు):** ఎల్కతుర్తి మండలంలోని బికేఎంయు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జిల్లా కార్యదర్శి కర్రె లక్ష్మణ్ అన్నారు కేంద్ర బడ్జెట్లో ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గించడమే దీనికి నిదర్శనం అని ఉపాధి హామీ పథకం గ్రామీణ ప్రాంతంలో ఎంతోమంది వ్యవసాయ కార్మికులకు ఉపాధి కల్పిస్తుందని అలాంటి పథకానికి నిధులు కేటాయించక పోవడం బాధాకరమని కథ రెండు నెలల నుండి పనులు చేస్తున్నప్పటికీ ఇప్పటివరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బిల్లులు గ్రామీణ ప్రాంతంలో నిరుపేదలకు ఇది వరం లాంటిదని ఇలాంటి పథకాన్ని నిరుదీయం చేయడం సరేంది కాదని ఇదే విధానాన్ని కొనసాగితే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు గ్రామీణ ఉపాధి కూలీలు ఈ ప్రభుత్వాలకు గుణపాఠం చెప్తారని రాబోయే కాలంలో వ్యవసాయ కార్మిక సంఘం బికేఎంయు ఆధ్వర్యంలో మరిన్ని ఉద్యమాలు చేస్తామని రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నాం అని, కూలీలకు వెంటనే బిల్లులు చెల్లించాలని అన్నారు.

## తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన ట్రైనీ ఐఏఎస్



**భీమదేవరపల్లి సెప్టెంబర్ 19 (ప్రజామంటలు):** మండలంలో ట్రైనీ ఐఏఎస్ శ్రద్ధాశుక్లా మంగళవారం పర్యటించారు. ఐఏఎస్ ట్రైనింగ్ పూర్తికావడంతో మండలంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వెంకట భాస్కర్ ను భూ రికార్డులు, రిజిస్ట్రేషన్ ప్రక్రియ, కార్యాలయ పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు. రెవెన్యూ రికార్డులు పరిశీలించారు. అనంతరం ఎంపీడీవో లంకపల్లి భాస్కర్ మండలంలో చేపట్టిన పల్లె ప్రకృతి వనాలు, నర్సరీ, క్రిమిటోరియం ఇతర అభివృద్ధి పనులను వివరించారు. తాను క్షేత్రస్థాయిలో అన్ని శాఖలపై అవగాహన కల్పించుకునేందుకు తాను ఫీల్డ్ వర్క్ చేస్తున్నానని ట్రైనీ కలెక్టర్ తెలిపారు.

## మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు ఘన స్వాగతం పలికిన గొల్లపెల్లి పద్మశాలి సేవా సంఘం



**గొల్లపెల్లి సెప్టెంబర్ 19 (ప్రజామంటలు):** మండల కేంద్రంలోని పద్మశాలి సంఘ భవనాన్ని మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రారంభించారు అనంతరం మాట్లాడుతూ.... పద్మశాలీలకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఈ సందర్భం గా అన్నారు ఈ సందర్భంగా మంత్రి కొప్పుల ఈశ్వర్ కు సంఘ కార్యవర్గమ్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు చౌటపల్లి తిరుపతి ప్రధాన కార్యదర్శి ,అందె లక్ష్మణ్, కోశాధికారి అంకం లింబాద్రి , ఉపాధ్యక్షులు ఎలగందుల శంకర్, సహాయ కార్యదర్శి అంకం లక్ష్మీనారాయణ, గౌరవ అధ్యక్షులు అంకం భూమయ్య గాజెంగి సత్తయ్య, ఎనగందుల సుదర్శన్ యూత్ అధ్యక్షులు అంకం రవి కార్యదర్శి అంకం సతీశ్, కోశాధికారి రఘునందన్, సాయి, గూడూరు రాజేష్, గూడూరు రమేష్, అరుణ్, సభ్యులు గూడూరు రాజన్న, ధర్మపురి మల్లేశం, వీరస్వామి, అనుమల్ల వెంకటస్వామి, జడల సమ్మయ్య, గుండేటి సత్యనారాయణ, అనుమాండ్ల లక్ష్మీనారాయణ, మహిళలు మరియు సభ్యులు పాల్గొన్నారు.



# మూడు గంటలా.. మూడు పంటలా..?

## తేల్చుకోండి మంత్రి కొప్పుల ఈశ్వర్

### మంగళహారతి ఇస్తున్న మహిళలు

### ప్రజా ఆశీర్వాద యాత్రలో మంత్రి కొప్పుల ఈశ్వర్

**గొల్లపల్లి సెప్టెంబర్ 19 (ప్రజా మంటలు) ::**కాంగ్రెస్ కు ఓటేస్తే మూడు గంటల విద్యుత్ ఇస్తారు. బిఆర్ఎస్ కు ఓటేస్తే నిరంతరం 24 గంటల సరఫరాతో ప్రతి ఏటా మూడు పంటలు పండించుకోవచ్చునాని, బిజెపి కి ఓటు వేస్తే మతం పేరిట మత విద్వేషాలు చెలరేపుతారని, మూడు గంటల విద్యుత్ కావాలో ..మూడు పంటలు కావాలో తేల్చుకోవాల్సింది ప్రజలేనని కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు.గొల్లపల్లి మండల కేంద్రం లో మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రజా ఆశీర్వాద యాత్రను నిర్వహించారు .ఈ సందర్భంగా మంత్రికి బిఆర్ఎస్ శ్రేణులు డప్పు చప్పుల్లు, ఒగ్గుడోలు కళాబృందం, డమరుకనాధాలు ,మహిళలు బతుకమ్మలతో ఘన స్వాగతం పలికారు .స్థానిక అంబేద్కర్ విగ్రహానికి బాబు జగ్జీవన్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు .అనంతరం వాడవాడల పాదయాత్ర నిర్వహిస్తూ గడపగడపకు తిరుగుతూ వృద్ధుల క్షేమసమాచారాలు తెలుసుకుంటూ ,వయోజన యోగక్షేమాలు తెలుసు కుంటూ, యువత కెరీర్ గురించి అడుగుతూ చిన్నారులతో ఎత్తుకొని ముద్దుఆడుతూ ముందుకు సాగారు. వాడ వాడలా మంత్రికి పెద్ద ఎత్తున మహిళలు యువత భారీగా తరలివచ్చి జననీరాజనాలు పలికారు .ఆద్యతం ఆశీర్వాద యాత్ర పండుగ వాతావరణంలో కొనసాగింది. ఈ సందర్భంగా బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఏడోసారి బరిలో నిలవబోతున్నానని ఈసారి తనకు మద్దతు తెలిపి కారు గుర్తుకు ఓటు వేసి ఆశీర్వదించాలని ప్రజలను ఓటు అభ్యర్థించారు .అన్ని వర్గాల ప్రజా సంక్షేమం ,సంపూర్ణ అభివృద్ధికి పాటుపడుతున్న బీఆర్ఎస్ పార్టీని మరోసారి బలపరచాలని కోరారు .అనంతరం పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేసి శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత యాభై 50 ఏళ్ల పాలన కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వాల పేరిట స్కామ్ లు చేశాయని, ప్రజా సంక్షేమాన్ని అభివృద్ధినీ తీవ్ర నిర్లక్ష్యం చేశాయని బీజేపీ ప్రభుత్వం కార్పోరేట్ సంస్థలకు కొమ్ముకాస్తూ ఆదాని అంబానీలకు దేశ సంపదను దోచిపెడుతున్నాయని ఆరోపించారు. పలు కుల సంఘాల నాయకులు మంత్రిని గజమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఫ్యాక్స్ జిల్లా ఫోరం చైర్మన్ డాక్టర్ రాజసుమన్ రావు, ఎంపీపీ శంకరయ్య, వైస్ ఎంపీపీ సత్తయ్య , ఏఎంసీ చైర్మన్ హనుమండ్లు, వైస్ చైర్మన్ లింగారెడ్డి ,పార్టీ మండల శాఖ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శిలు రమేష్ బాబు ,మండల కోఆర్డినేటర్ గంగాధర్ ,యూత్ మండల శాఖ అధ్యక్షుడు రవీందర్ , కార్మిక మండల శాఖ అధ్యక్షుడు వీరస్వామి, నాయకులు అలిశెట్టి రవీందర్ , కొక్కుల భూమయ్య, కచు కొమురయ్య



ఆయా గ్రామాల సర్పంచులు ,ఎంపిటిసిలు,వివిధగ్రామ సర్పంచులు,ఎంపిటిసి లు నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## న్యాయస్థానంలో హత్యలకు సంబంధించిన 10 కేసుల్లో 16 మందికి జీవిత ఖైదు



**జగిత్యాల సెప్టెంబర్ 19 (ప్రజామంటలు):** రాష్ట్రంలో క్రైమ్, ఫంక్షనల్ వర్టికల్స్, సైబర్ క్రైమ్ లపై పోలీస్ కమీషనర్లు, ఎస్.పి. లతో డిజిపి అంజనీ కుమార్ ఐపీఎస్., నేడు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సంవత్సరం న్యాయస్థానంలో హత్యలకు సంబంధించిన 10 కేసుల్లో 16 మందికి జీవిత ఖైదు పడేలా ప్రత్యేక చర్యలు తీసుకున్న జిల్లా ఎస్పీ ని, అధికారులను అభినందించిన డిజిపి. ఈ సందర్భంగా డిజిపి మాట్లాడుతూ.... పెండింగ్ కేసులు, క్రైమ్ ఎగినెస్ట్ ఉమెన్, ఎస్సీ ఎస్టీ , గ్రేవ్ కేసులపై పోలీస్ అధికారులు తీసుకొన్న ప్రత్యేక చొరవతో పెండింగ్ కేసుల్లో పురోగతి సాధించారని అన్నారు. సమాజంలో నేరం చేసిన వారు ఎవరూ శిక్షల నుండి తప్పించుకోలేరనే భావన నేరస్తులు కలిగించాలని సూచించారు. ఈ సంవత్సరం రాష్ట్రంలోని వివిధ న్యాయస్థానలో 135 కేసుల్లో జీవిత ఖైదులు విధించడం జరిగిందని తెలిపారు. గడిచిన 2022 సంవత్సరంలో జగిత్యాల జిల్లాలో హత్యలకు సంబంధించి ఒకే జీవిత ఖైదు విధించగా 2023 సంవత్సరం జిల్లా పోలీసులు తీసుకున్న ప్రత్యేక చర్యల వల్ల హత్యలకు సంబంధించి 10 కేసుల్లో 16 మందికి జీవిత ఖైదీపడేలా కృషి చేసిన జిల్లా ఎస్పీని అదేవిధంగా అధికారులను, సిబ్బందిని డిజిపి అభినందించడంతో పాటు ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో పని చేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా ఎస్పీ ఎగ్గడి భాస్కర్, అదనపు ఎస్పీ ప్రభాకర్ రావు, డీఎస్పీ లు వెంకటస్వామి, రవీంద్ర కుమార్, రవీంద్ర రెడ్డి, సిసిఎస్ డిసిఆర్ బి ఐటీ కోర్ ఇన్స్పెక్టర్ లు వెంకటేశ్వర్లు, రాజారెడ్డి, రఫీక్ ఖాన్, సీఐ రమణమూర్తి, డి సి ఆర్ బి సిబ్బంది పాల్గొన్నారు.

## కేంద్ర క్యాబినెట్ లో మహిళా బిల్లు ఆమోదం

### మోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేసిన భారత్ సురక్ష సమితి నాయకుల



**జగిత్యాల సెప్టెంబర్ 19 (ప్రజామంటలు):** దేశంలోనే మొదటి పౌరురాలు మహిళకి ఇచ్చి గొప్ప మహిళా స్ఫూర్తిని నిలుపుకున్న నాయకుడు మోడీ అని అన్నారు. భారత్ సురక్ష సమితి ఆధ్వర్యంలో జగిత్యాల పట్టణంలోని తహసిల్ చౌరస్తా వద్ద ప్రధాని నరేంద్ర మోడీ కి పాలాభిషేకం చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి అక్కినపల్లి కాశీనాథం, బిజెపి మాజీ కౌన్సిలర్ అరువ లక్ష్మీ మాట్లాడుతూ.... దేశంలోనే మొదటి పౌరురాలు మహిళకి ఇచ్చి గొప్ప మహిళా స్ఫూర్తిని నిలుపుకున్ననాయకుడు ప్రధాని నరేంద్ర మోడీ అని అన్నారు. చట్ట సభల్లో మహిళ రిజర్వేషన్ బిల్లుకు క్యాబినెట్ లో ఆమోదం పొందడంతో మహిళలకి తగిన గుర్తింపు వచ్చిందని హర్షం వ్యక్తం చేస్తూ ప్రధాని మంత్రి నరేంద్ర మోడీ భారత్ సురక్ష సమితి తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు బిజెపి సీనియర్ నాయకులు ఏసితఎస్ రాజు, జిల్లా ఉపాధ్యక్షులు వేముల పోచమల్లు, సింగం గంగాధర్, నరేందుల శ్రీనివాస్, శీల గంగారాం, వనమాల సత్యనారాయణ, మహేష్, సంపత్ రావు, కోలుగూరి ప్రసాద్ రావు, గాదాసు భూమయ్య, కొత్తకొండ బాలయ్య, వేముల దేవరాజం, బండారి మల్లికార్జున్, భోగ దేవయ్య, మాడిశెట్టి సూర్యప్రకాష్, జిట్టవేణి అరుణ్, గణపతి, నరేందర్ రాజ్, మామిడాల రాములు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

### ధరూర్ ప్రభుత్వ హైస్కూల్ లో షీ టీం, ఏహెచ్ టియూ టీమ్ ఆధ్వర్యంలో

## విద్యార్థినిలకు అవగాహన కార్యక్రమం




**జగిత్యాల సెప్టెంబర్ 19 (ప్రజామంటలు):** జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మంగళవారం ధరూర్ ప్రభుత్వ హై స్కూల్ లో షీ టీం,ఏ హెచ్ టి యూ టీమ్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా... జిల్లాలో మహిళలు హక్కులు, రక్షణకు షీ టీం ప్రత్యేకంగా పనిచేస్తుందన్నారు. అదే విధంగా షీ టీం పని విధానం, పలు అంశాలపై అవగాహన కల్పించారు. మహిళలు, యువతులు, విద్యార్థినిలు ఎలాంటి సమస్య ఉన్న నిర్భయంగా షీ టీం నెంబర్ కి 8712670783 సంప్రదించాలన్నారు. సామాజిక మధ్యమాలైన ఫేస్ బుక్, వాట్స్ అప్, ఇన్ స్టాగ్రామ్ ల వినియోగంలో చాలా జాగ్రత్తగా ఉండాలని, ఫోటోలు, వీడియోలను పోస్ట్ చేసే సమయంలో, వ్యక్తిగత భద్రతకు సంబంధించిన అన్ని రకాల చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో షీ టీమ్ ఎస్.ఐ. వెంకటేశ్వర్లు, ఏఎస్ఐ వాలీబెగ్, మహిళా కానిస్టేబుల్స్ మరియు ఉపాధ్యాయులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణ దీక్షలకు జనసేన మద్దతు

**జగిత్యాల సెప్టెంబర్ 19 (ప్రజామంటలు)** ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఎస్సి వర్గీకరణపై చేపట్టిన నిరసన దీక్షలు 9 వ రోజుకు చేరగా మంగళవారం జనసేన పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ బెక్కం జనార్దన్ ఆధ్వర్యంలో జనసేనికులు మద్దతు తెలిపారు. స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట గత తొమ్మిది రోజులుగా ఎస్సి వర్గీకరణ సాధనే లక్ష్యంగా నిరసన దీక్షలు కొనసాగుతున్నాయి. ఈ దీక్షలకు మద్దతు తెలిపిన తదుపరి బెక్కం జనార్దన్ మాట్లాడుతూ 77 ఏండ్ల స్వతంత్ర భారత దేశంలో ఎస్సి ఉమ్మడి రిజర్వేషన్లతో దశాబ్దాల తరబడి ఏకపక్ష దోపిడీకి గురవుతున్నారన్నారు. జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ల కోటాలో ఎవరి వాటా వారికి న్యాయబద్ధంగా అందాలంటే ఎస్సి వర్గీకరణ జరగాలని బిజెపి వెంటనే నిర్ణయం తీసుకోవాలని జనార్దన్ కోరారు. 9వ రోజు వర్గీకరణ సాధన దీక్షలను జిల్లా ఎస్సి ఎస్టీ అట్రాసిటీ మానిటరింగ్ కమిటీ సభ్యులు దూమాల రాజుకుమార్ ప్రారంభించగా ఈ కార్యక్రమంలో ఎం.ఎస్పి కో కన్వీనర్ సతీష్ మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ సురుగు శ్రీనివాస్, మాదిగ జగిత్యాల నియోజికవర్గ ఇంఛార్జి బొనాగిరి కిషన్, కో ఇంఛార్జి మిసాల సాయిలు, పట్టణ ఇంఛార్జి బోల్లారపు దివాకర్, అర్బన్ మండల ఇంఛార్జి బిరుదులు గంగారాం, జనసెన పార్టీ రూరల్ మండల అధ్యక్షులు బొల్లి రాము, పట్టణ అధ్యక్షులు చింత సుధీర్, మెస్రి లక్ష్మణ్, బుగ్గారం మండల ఇంచార్జ్ చిర్ర లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



## శ్రీసాయి విజ్ఞాన్ కాలేజీలో చంద్రయాన్-3 వినాయకుడు

### గణేషుడి ప్రతిమలను తయారు చేసిన విద్యార్థినులు



**సికింద్రాబాద్ సెప్టెంబర్ 19 (ప్రజామంటలు):** పద్మారావునగర్ శ్రీసాయి విజ్ఞాన్ భారతీ మహిళా జూనియర్ కాలేజీ లో శ్రీ వినాయక నవరాత్రోత్సవాలను కన్నుల పండువగా నిర్వహిస్తున్నారు. కాలేజీ ఆవరణలో ఏర్పాట చేసిన ప్రత్యేక వేధికపై ప్రతిష్టించిన చంద్రయాన్-3 వినాయకుడు అందరిని ఆకట్టుకుంటున్నాడు. ఈసందర్భంగా కాలేజీ విద్యార్థినులు సొంతంగా సృజనాత్మకంగా పలు రకాల పిండిలు, ఇతర వస్తువులతో తయారు చేసిన గణేశుడి ప్రతిమలను విశేషంగా అందరిని ఆకర్శిస్తున్నాయి. విద్యార్థినులను ప్రోత్సహించేందుకు గాను వారికి సర్టిఫికెట్లను, బహుమతులను అందచేయనున్నట్లు కాలేజీ కరస్పాండెంట్ సాయిబాబా తెలిపారు. కాగా ఈ ఏడాది వినాయకుడిని కాలేజీ ఆవరణలోని మందిరంలో పెట్టి పూజలు చేస్తామని, వచ్చే ఏడాది నిమజ్జనం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ వై. విజయలక్ష్మీ, ప్రిన్సిపాల్ పి. రమాదేవి, బోధన సిబ్బంది పాల్గొన్నారు.

## ఉచిత మట్టి వినాయకుల పంపిణీ




**కోరుట్ల సెప్టెంబర్ 19 (ప్రజామంటలు):** వినాయకచవితి సందర్భంగా కోరుట్ల పట్టణంలోని సిద్దార్థ స్కూల్ యాజమాన్యం, విద్యార్థుల సహకారంతో కోరుట్ల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేశారు. కోరుట్ల లయన్స్ క్లబ్ అధ్యక్షులు వనపర్తి చంద్ర మోహన్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత మట్టి గణపతుకు పంపిణి చేశారు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు వీలైనంత వరకు మట్టి వినాయకులను ప్రతిష్టించుకోని పూజించాలని కోరారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ కుందారపు మహేందర్, ట్రేసరర్ కొండబత్తిని అనంత కృష్ణప్రసాద్, పీఆర్సీ ఆడేపు మధు, పడాల నారాయణ గౌడ్, నల్ల గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## పేదల ఆకలి తీర్చడానికే ఐదు రూపాయల భోజనం

### ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు



**కోరుట్ల సెప్టెంబర్ 19 (ప్రజామంటలు):** ప్రజా మంటలు నిరుపేదల ఆకలి తీర్చడానికే ఐదు రూపాయలకు భోజన సదుపాయం ఏర్పాటు చేసినట్లు కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు తెలిపారు. కోరుట్ల పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయంలో కోరుట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, బీఆర్ఎస్ యువ నాయకుడు డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'అన్నపూర్ణ క్యాంటీన్' ను ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు మంగళవారం డా.సంజయ్ తో కలిసి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ%%. పేద ప్రజల ఆకలి తీర్చేందుకు అన్నపూర్ణ క్యాంటీన్ ద్వారా కేవలం 5, రూపాయలకే భోజన సదుపాయం ఏర్పాటు చేశామని తెలిపారు. పట్టణ, పరిసర గ్రామాలు, ఇతర ప్రాంతాల నుంచి కోరుట్ల పట్టణానికి వచ్చిన ప్రజలు ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని పేర్కొన్నారు. ఈ పథకం ఎన్నికల అవసరాల కోసం ప్రారంభించింది కాదని ఇది నిరంతర ప్రక్రియ అని తెలియజేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ మాట్లాడుతూ, అన్నపూర్ణ క్యాంటీన్ భోజన పథకాన్ని సామాన్య ప్రజలు, కోరుట్లకు వచ్చిన ఇతర ప్రాంతాల వారికి, సామాన్య ప్రజలకు కూడా అందుబాటులో ఉండే విధంగా ప్రారంభించామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అన్నం లావణ్య అనిల్, వైస్ చైర్మన్ గడ్డమీది పవన్, కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పిటిసిలు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సమ్మెను విరమించిన మత్స్య శాఖ కాంట్రాక్ట్ ఉద్యోగులు

### రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్ కుమార్ సూచన మేరకు సమ్మె విరమణ



**హైదారాబాద్ సెప్టెంబర్ 19 (ప్రజామంటలు):** తమ ఉద్యోగ సర్వీస్ ను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ గత 48 రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేస్తున్న రాష్ట్ర మత్స్య శాఖ కాంట్రాక్టు ఉద్యోగులు మంగళవారం సమ్మెను విరమించారు. మంగళవారం మంత్రుల నివాసంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్ కుమార్ తో రాష్ట్ర మత్స్య సహకార సమాఖ్య చైర్మన్ పిట్టల రవీందర్ , రాష్ట్ర టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్ ఆధ్వర్యంలో రాష్ట్ర మత్స్య శాఖ కాంట్రాక్ట్ ఉద్యోగులు సమావేశమయ్యారు. సమ్మె చేస్తున్న కారణాలను, డిమాండ్లను మత్స్య శాఖ కాంట్రాక్ట్ ఉద్యోగులు వినోద్ కుమార్ కు వివరించారు. వెంటనే స్పందించిన వినోద్ కుమార్ మత్స్య శాఖ కమిషనర్ లచ్చిరాం నాయక్ తో మాట్లాడి కాంట్రాక్ట్ ఉద్యోగుల డిమాండ్ అంశాల గురించి తెలుసుకున్నారు. మత్స్య శాఖ మంత్రి టీ. శ్రీనివాస్ యాదవ్, ఆర్థిక శాఖ మంత్రి టీ. హరీష్ రావు, సహా సంబంధిత అధికారులతో చర్చించి డిమాండ్ల పరిష్కారం కోసం కృషి చేస్తామని వినోద్ కుమార్ సమ్మె చేస్తున్న మత్స్య శాఖ కాంట్రాక్ట్ ఉద్యోగులకు తెలిపారు. తమ సమస్యలను పరిష్కరించేందుకు బోయినపల్లి వినోద్ కుమార్ సానుకూలంగా స్పందించిన నేపథ్యంలో 48 రోజులుగా చేస్తున్న సమ్మెను విరమిస్తున్నట్లు మత్స్య శాఖ కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పీ. రమేష్, ప్రధాన కార్యదర్శి బీ. ఏసుదాస్, ఉపాధ్యక్షుడు ఎన్. కిరణ్ కుమార్, రాష్ట్ర నాయకులు ఏ. శ్రీకన్య, గౌతమి, శ్రీకాంత్, రాజ్ కుమార్, సతీష్, తదితరులు ప్రకటించారు.

## మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించిన జేఎస్ఆర్

**ఎల్కతుర్తి సెప్టెంబర్ 19 (ప్రజామంటలు):** హుస్నాబాద్ నియోజకవర్గం ఎల్కతుర్తి మండలం దండేపల్లి గ్రామంలో ఇటీవల మరణించిన జన్ను మొగిలి గారి కుటుంబ సభ్యులను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జన్నపురెడ్డి సురేందర్ రెడ్డి (జేఎస్ఆర్ ) పరామర్శించి, వారి మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. వారి ఆత్మకి శాంతి చేకూరాలని భగవంతుడు వారి కుటుంబానికి మనో ధైర్యాన్ని ప్రసాదించాలని అన్నారు. వీరి వెంట బీజేపీ మండల కార్యకర్తలు మాచర్ల శంకర్, రెడ్ల శంకర్, మాచర్ల తిరుపతి, మాచర్ల సంతోష్, మాచర్ల ప్రదీప్, కృష్ణమూర్తి, మాచర్ల అజయ్, వినోద్ తదితరులు వున్నారు.




జగిత్యాల రూరల్ మండలం గుల్లపేట గ్రామానికి చెందిన 15 మంది విశ్వ బ్రాహ్మణ సంఘం సభ్యులు భీమన్న, లక్ష్మీనారాయణ, చంద్ర మౌళి మరియు సభ్యులు బిఆర్ఎస్ పార్టీ అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఎమ్మెల్యే క్వార్టర్స్ లో పార్టీలో చేరగా బిఆర్ఎస్ పార్టీలోకి కండువా కప్పి ఆహ్వానించిన జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్. పాల్గొన్న ఎంపీపీ రాజేంద్రప్రసాద్, సర్పంచ్ జక్కుల తిరుపతి, ఎంపీటీసీ సురేందర్ రెడ్డి, సీనియర్ నాయకులు దమ్మా రాజీ రెడ్డి, తిప్పర్తి నరేష్, నాయకులు తదితరులు **(ప్రజామంటలు):**



జగిత్యాల నాయీబ్రాహ్మణ సేవా సంఘం అభివృద్ధి పనుల నిమిత్తం ఎమ్మెల్యే నిదులు నుండి 10 లక్షల రూపాయలు మంజూరు చేయగా జగిత్యాల ఎమ్మెల్యే క్వార్టర్స్ లో వారిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపిన జగిత్యాల పట్టణ నాయి బ్రాహ్మణ సంఘం కార్యవర్గ సభ్యులు. పాల్గొన్న సంఘ అధ్యక్షులు రాచర్ల విజయ్, ప్రధాన కార్యదర్శి గంగిపెల్లి వేణుమాధవ్, ఉపాధ్యక్షులు పెండెం గంగారాం, సహాయ కార్యదర్శి ముడపెల్లి మధుసూదన్, కోశాధికారి రాచమల్ల శ్రీనివాస్, తదితరులు **(ప్రజామంటలు):**

prajamantalau daily pages (20-09)(4 pages)_vijayatha pages (11-01) dummy pages 1,2 pages.qxd 9/20/2023 6:55 AM Page 7





*((ప్రజామంటలు):*

సికింద్రాబాద్ బన్సీలాల్ పేట డివిజన్ పద్మారావునగర్ లోని శ్రీ సరస్వతీ రెసిడెన్సీలో అపార్ట్ మెంట్ వాసులు శ్రీ వినాయక నవరాత్రోత్సవాలను అపార్ట్ మెంట్ ఆవరణలో సుందరంగా అలంకరించిన మండపంలో ప్రతిష్టించి తొమ్మిది రోజులు పూజలు చేయనున్నట్లు తెలిపారు.



*((ప్రజామంటలు):*

జగిత్యాల లోని వైశ్య భవన్ గణేశ మంటపం వద్ద మాతలచే సామూహికంగా దుర్వార్చన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని కొనసాగించారు. సర్వాంగ సుందరంగా అలంకరించిన మంటపంలో వైదిక క్రతువులను సిరిసిల్ల భాస్కర్ శర్మ నిర్వహించారు. గణేషుని నామస్మరణతో మంటపమంత మారుమోగింది.



*((ప్రజామంటలు):*

బీర్ పూర్ మండల ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులు జగిత్యాల ఎమ్మెల్యే క్వార్టర్స్ లో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్చం అందజేయగా నూతన కార్యవర్గాన్ని అభినందించి,శుభా కాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్. పాల్గొన్న అధ్యక్షులు రవీందర్, గౌరవాధ్యక్షులు వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి రాజేష్, ఉపాధ్యక్షులు రవికుమార్, కోశాధికారి గుమ్మడి రమేష్, ప్రచార కార్యదర్శి హుస్సేన్, తదితరులు



*((ప్రజామంటలు):*


ముషీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం రామ్ నగర్ లో చైతన్య యువజన సంఘం ఆధ్వర్యంలో తొలి వినాయక పూజ కార్యక్రమానికి హాజరైన టిపిసిసి ప్రధాన కార్యదర్శి నగేష్ ముదిరాజ్

## జనవరి 24నుంచి జేఈఈ మెయిన్

**న్యూఢిల్లీ,సెప్టెంబర్19 :** 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి పలు ప్రవేశ పరీక్షల వార్షిక క్యాలెండర్?ను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ-ఎన్?టీఏ ప్రకటించింది. నీట్, జేఈఈ సీయూఈటీ, నెట్ వంటి పరీక్షల తేదీలను వెల్లడించింది. పరీక్షల తేదీలు, ఇతర వివరాలు ఇలా ఉన్నాయి.. 2024 జనవరి 24 నుంచి ఫిబ్రవరి 1 మధ్య జేఈఈ మెయిన్ మొదటి విడత పరీక్షలు జరగనున్నాయి. ఈ మొదటి విడత పరీక్షలు కంప్యూటర్ ఆధారిత విధానంలో జరుగుతాయి. ఏప్రిల్ 1 నుంచి 15 మధ్య జేఈఈ మెయిన్ రెండో విడత పరీక్షలు జరగనున్నాయి. 2024 మే 5న దేశవ్యాప్తంగా నీట్ యూజీ పరీక్ష జరగనుంది. ఇది పెన్? పేపర్/ఓఎంఆర్ విధానంలో జరుగుతుంది. 2024 మే 15 నుంచి 31 మధ్య యూనివర్సిటీల యూజీ ఉమ్మడి ప్రవేశ పరీక్ష జరగనుంది. ఇది పరీక్ష కూడా కంప్యూటర్ ఆధారిత విధానంలో నిర్వహిస్తారు. 2024 మార్చి 11 నుంచి 28 మధ్య యూనివర్సిటీల పీజీ ఉమ్మడి ప్రవేశ పరీక్ష జరగనుంది. 2024 జూన్ 10 నుంచి 21 మధ్య మొదటి విడత యూజీసీ నెట్ పరీక్ష జరగనుంది. ఇది కూడా కంప్యూటర్ ఆధారిత పరీక్షే. పరీక్షలకు సంబంధించిన మరింత సమాచారాన్ని రిజిస్ట్రేషన్లు ప్రారంభించిన సమయంలో అభ్యర్థులకు వెల్లడిస్తామని ఎన్‌టీఏ తెలిపింది. పరీక్షలు జరిగిన మూడు వారాల్లోపే.. కంప్యూటర్ ఆధారంగా జరిగే పరీక్షల ఫలితాలను ప్రకటిస్తామని పేర్కొంది. నీట్ యూజీ 2024 పరీక్ష ఫలితాలను అదే ఏడాది జూన్ రెండో వారంలో ప్రకటించనున్నట్లు పేర్కొంది. భారత ప్రభుత్వం, కేంద్ర విద్యాశాఖ అధ్వర్యంలో నేషనన్? టెస్టింగ్? ఏజెన్సీ పనిచేస్తుంది. ఏటా నీట్, జేఈఈ , సీయూఈటీ, నెట్ వంటి తదితర పరీక్షలను ఇది నిర్వహిస్తుంది. సొసైటీస్ రిజిస్ట్రేషన్ యాక్ట్-1860 కింద స్వతంత్ర, స్వయంప్రతిపత్తి, స్వయం-నిరంతర ప్రీమియర్ టెస్టింగ్ ఆర్గనైజేషన్‌గా ఎన్‌టీఏ పనిచేస్తుంది.

## ధార్మిక క్షేత్రంలో ఘనంగా వినాయక నవరాత్రులు ప్రారంభం

**ధర్మపురి సెప్టెంబర్ 19 (ప్రజా మంటలు) :** సనాతన సాంప్రదాయాలకు, ప్రాచీన సభ్యతా, సంస్కృతులకు అనాదిగా నిలయమైన సుప్రసిద్ధ ప్రాచీన పుణ్య క్షేత్రమైన ధర్మపురి పట్టణంలో గణేశ నవరాత్రి ఉత్సవ ప్రారంభ సందర్భంగా, వినాయక చవితి పర్వ దినాన గణనాథుల విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమాలను వైభ వోపేతంగా భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. క్షేత్రంలో పౌరాణిక, చారిత్రిక, ఐతిహాసిక ప్రాధాన్యతను కలిగియున్న శ్రీరామచంద్ర స్థాపిత రామలింగేశ్వరాలయంలో



సనా తన సాంప్రదాయ పరంపరానుగత ఆచారం ప్రకారం గణనాయక విగ్రహ ప్రతిష్ఠ గావించి నవరాత్రి ఉత్సవ వేడుకలను ప్రారంభించారు. పట్టణంలోని శ్రీరామానందేశ్వర, నర్మదేశ్వర, చంద్ర శేఖర, చంద్రమౌళీశ్వర, రాజరాజేశ్వర, ఓంకారేశ్వర మందిరాలు, శివ పంచా యతనాలతోపాటు కాశెట్టివాడ, బోయ వాడ, తెనుగువాడ, సారగమ్మవాడ, హన్మాన్వాడ, పాలెపువాడ, మహేంద్ర యూత్, భగత్ నగర్, యంగ్ యూత్, దంమారో దం యూత్, స్వర్ణ కారుల సంఘం, అంబేద్కర్ యూత్ తదితర స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో వీధివీధినా, వాడవాడలా గణేశ విగ్రహాలను ప్రతిష్ఠించారు.

# లోక్‌సభ ముందుకు మహిళా బిల్లు..

**పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వం**

**ఈనెల 22లోగా ఈ బిల్లు ఆమోదం పొందే అవకాశం**

**బిల్లుకు 'నారీ శక్తి వందన్ అధినియం' గా నామకరణం**

**బిల్లును చట్టంగా మార్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది**

**ఏకగ్రీవంగా ఆమోదించండి : ప్రధాని మోదీ**



**న్యూఢిల్లీ,సెప్టెంబర్19** విపక్షాల ఆందోళనల మధ్య మంగళవారం మహిళా రిజర్వేషన్ బిల్లు లోక్?సభ ముందుకు వచ్చింది. పార్లమెంటు కొత్త భవనంలో సమావేశాల తొలి రోజునే న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్?వాల్ ఈ బిల్లును దిగువసభ ముందుకు తీసుకొచ్చారు. పార్టీల మధ్య ఏకాభిప్రాయం కుదరక 27 ఏళ్లుగా పెండింగ్‌లో ఉందీ బిల్లును. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం దీనిని పార్లమెంట్ ముందుకు తీసుకురావడం ద్వారా మహిళలు రెండున్నర దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న కల సాకారమైంది. ఈ మహిళా రిజర్వేషన్ బిల్లు కొత్త పార్లమెంట్? భవనంలో ప్రవేశపెట్టిన మొదటి బిల్లు అని.. జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో విధాన రూపకల్పలనలో మహిళల భాగస్వామ్యం పెరిగేందుకు వీలు కల్పిస్తుందని ప్రభుత్వం తెలిపింది. 2047 నాటికి భారత్?ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చే లక్ష్యాన్ని సాధించడానికి సహాయపడుతుందని పేర్కొంది. చట్ట సభల్లో జరిగే చర్చల్లో మహిళలు విభిన్న దృక్కోణలాను తీసుకువస్తారని.. సరైన నిర్ణయం తీసుకోవడంలో నాణ్యతన మెరుగుపరుస్తారని చెప్పింది. బిల్లుకు 'నారీ శక్తి వందన్ అధినియం' అని పేరు పెట్టింది. అయితే తాజా బిల్లు 2010లో రాజ్యసభలో ఆమోదం పొందిన బిల్లు కాదని కేంద్రం స్పష్టత ఇచ్చింది. మహిళా రిజర్వేషన్ల అంశంపై కేంద్రం కొత్తగా మరో రాజ్యాంగ సవరణ బిల్లును తీసుకొస్తున్నట్లు పేర్కొంది. ఈ రాజ్యాంగ (128వ సవరణ) బిల్లు చాలా ముఖ్యమైన బిల్లు అని అర్జున్ రామ్?మేఘ్?వాల్ చెప్పారు. దీని ద్వారా 239ఏఏ అధికరణాన్ని పొందుపరుస్తున్నామని తెలిపారు. దీంతో జాతీయ రాజధాని ప్రాంతం (ఎన్?సీఆర్)లోని మహిళలకు 33 శాతం రిజర్వేషన్ లభిస్తుందన్నారు. ఆర్టికల్ 330ఏ సవరణ ద్వారా ఎస్సీ, ఎస్టీ రిజర్వ్‌సీట్లలో ఆ వర్గాల మహిళలకు 33 శాతం సీట్లు.. ఆర్టికల్ 332ఏ ద్వారా శాసనసభలో మహిళలకు 33 శాతం స్థానాలు రిజర్వ్ అవుతాయని తెలిపారు. ఈ బిల్లు అమలులోకి వచ్చిన తర్వాత పార్లమెంట్?లో మహిళా ఎంపీల సంఖ్య 82 నంచి 181కి పెరుగుతుందని వెల్లడించారు. ఈ బిల్లు గురువారం రాజ్యసభ ముందుకు వెళ్తుందని మంత్రి తెలిపారు. ఈ మహిళా రిజర్వేషన్? బిల్లును చట్టంగా మార్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. దీన్ని ఉభయ సభల సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించాలని విజ్ఞప్తి చేశారు. అంతకుముందు కొత్త పార్లమెంట్ భవనంలో ప్రసంగించిన మోదీ.. ఈ బిల్లుకు కేబినెట్? భేటీలో ఆమోదం లభించిందని.. ఇది ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తుందని చెప్పారు. దేశాభివృద్ధిలో ఎక్కువ మంది మహిళలు భాగస్వామ్యం కావాలని తమ ప్రభుత్వం కోరుకుంటోందని అన్నారు. మహిళా నేతృత్వంలోని అభివృద్ధి ప్రక్రియను ప్రపంచం గుర్తించిందని.. క్రీడల నుంచి స్టార్టప్?ల వరకు మహిళలు అందించిన సహకారాన్ని చూస్తోందని తెలిపారు. ఈ బిల్లుపై చాలా ఏళ్లుగా వాదనలు జరిగాయని.. 1966లో మొదటి సారి ప్రవేశపెట్టారని గుర్తుచేశారు. ఆ తర్వాత? వాజ్?పేయీ హయాంలోనూ ఈ బిల్లు ప్రస్తావన వచ్చినా.. అప్పుడు ఆ కల నెరవేరలేదని తెలిపారు. మహిళా రిజర్వేషన్ బిల్లు అమలైతే లోక్?సభ, అసెంబ్లీల్లో మూడో వంతు సీట్లు మహిళలకు కేటాయిస్తారు. విధాన నిర్ణయాల్లో మహిళా భాగస్వామ్యం పెంచడమే లక్ష్యంగా ఈ బిల్లును తీసుకువచ్చారు. అయితే డీలిమిటేషన్ (నియోజకవర్గాల పునర్విభజన) తర్వాతే ఈ చట్టం అమల్లోకి రానుంది. ఆ తర్వాత రొటేషన్ ప్రక్రియలో రిజర్వు సీట్ల కేటాయింపులు చేస్తారు. ఆర్టికల్ 334ఏలో కొత్తగా చేర్చిన నిబంధన ద్వారా? ఈ మహిళా రిజర్వేషన్లు పదిహేనేళ్ల పాటు అమల్లో ఉండనున్నాయి. ఒకవేళ ఇది పెంచాలంటే ఆ అధికారం పార్లమెంట్‌కు ఉంటుంది. పార్లమెంటు 75 ఏళ్ల చరిత్రపై చర్చించడమే ప్రధాన అజెండాగా సోమవారం ప్రారంభమైన ఐదు రోజుల ప్రత్యేక సమావేశాలు శుక్రవారం ముగియనున్నాయి. ఈలోగానే మహిళా రిజర్వేషన్ బిల్లు ఉభయసభల ఆమోదం పొందే అవకాశముంది. మహిళా రిజర్వేషన్ బిల్?పై కాంగ్రెస్? పార్లమెంటరీ పార్టీ ఛైర్?పర్సన్? సోనియా గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. మహిళా రిజర్వేషన్? బిల్లు? తమదేనన్నారు. సమావేశాల్లో పాల్గొనేందుకు మంగళవారం పార్లమెంట్?కు వెళుతున్న సోనియా గాంధీని.. బిల్లు?పై తన అభిప్రాయం చెప్పాలని మీడియా వర్గాలు అడగ్గా ఈ మేరకు బదులిచ్చారు.

## మహిళా బిల్లును కొట్లాడి సాధించిన ఎమ్మెల్సీ కవితక్కకు కృతజ్ఞతలు

**చొప్పదండి,ఎంపీపీ చిలుక రవీందర్**




**చొప్పదండి సెప్టెంబర్ 19 (ప్రజా మంటలు) :** పార్లమెంట్ లో మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టడం ఎమ్మెల్సీ కవిత పోరాట పలితమేనని, ఆమెకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని చొప్పదండి ఎంపీపీ చిలుక రవీందర్ అన్నారు. పత్రిక సమావేశంలో మాట్లాడుతూ....కొట్లాడి సాధించడం ఆ కుటుంబానికి కొత్తేమి కాదని, నాడు తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలను కూడా పనంగా పెట్టి కొట్లాడి తెలంగాణను సాధించింధీ తండ్రి కేసీఆర్ అయితే, 47 పార్టీలను ఏకం చేసి కేంద్రం మెడలు వంచి మహిళ బిల్లును సాధించింది మన కవితక్క గారు.మహిళా రిజర్వేషన్ కోసం అహర్నిశలు పోరాటం చేసి,47 పార్టీలను ఏకం చేసి,కేంద్రం మెడలు వంచి,మహిళా బిల్లు కోసం పోరాడి,కృషి చేసిన భారత జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితక్కకు మా చొప్పదండి మండల ప్రజా పరిషత్ పరిధిలోని ప్రతి మహిళా తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని అన్నారు.

## అంగరంగ వైభవంగా బ్రహ్మోత్సవాలు

**తిరుమల,సెప్టెంబర్19 :** తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు అంగరంగవైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామి వారు చినశేష వాహనంపై తిరుమాడ వీధుల్లో ఊరేగారు. వాహన సేవను తిలకించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. చిన్న శేష వాహనం పైనుంచి స్వామి వారు భక్తులకు అభయ ప్రదానం చేశారు. ఐదు తలల చినశేష వాహనంపై ఊరేగుతున్న మలయప్ప స్వామివారిని చూసి భక్తులు తరించిపోయారు. ఉత్సవాల్లో భాగంగా నేటి రాత్రి శ్రీమలయప్ప స్వామివారు వీణాపాణియై హంస వాహనంపై సరస్వతీమూర్తి అవతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. బ్రహ్మ వాహనమైన హంస పరమహంసకు ప్రతీకగా చెబుతారు. హంస పాలను, నీళ్లను వేరుచేయగల ప్రత్యేకత ఉన్నది. అంటే మంచిని, చెడును గ్రహించగలిగిన అపురూపమైన శక్తిగలది అంటారు.

## యర్రగొండపాలెం సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం ..

**అమరావతి,సెప్టెంబర్19:** ఏపీలోని ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం సమిపంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఆర్టీసీ బస్సు అదుపుతప్పి పడిపోవడంతో ఎనిమిదిమంది ప్రయాణికులు గాయపడ్డారు. వివరాల్లోకి వెళ్తే..ఆర్టీసీ ఇంద్ర బస్సు హైదరాబాద్ నుంచి మార్కాపురం వస్తుండగా యర్రగొండపాలెం సమీపంలోని ఎలక చెట్టు వద్దకు రాగానే ప్రమాదవాశాత్తు బస్సు అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎనిమిది మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను హుటాహుటిన108లో యర్రగొండపాలెం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కాగా, ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో తొమ్మిది మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## హీరో విజయ్ ఆంటోని కూతురు ఆత్మహత్య

**చెన్నై,సెప్టెంబర్19:** బిచ్చగాడు సినిమాతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన ప్రముఖ దక్షిణాది నటుడు, సంగీత దర్శకుడు విజయ్ ఆంటోని కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. ఆయన కుమార్తె మీరా ఆంటోని ఆత్మహత్య చేసుకుంది. మంగళవారం తెల్లవారుజామున 3 గంటలకు చెన్నైలోని డీడీకే రోడ్‌లోని తమ నివాసంలో ఆమె బలవన్మరణానికి పాల్పడింది. పదహారేళ్ల మీరా ఓ ప్రైవేటు పాఠశాలలో సీనియర్ ఇంటర్ చదువుతోంది. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. చదువుల ఒత్తిడితోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. కాగా, మీరా ఆత్మహత్య నేపథ్యంలో పలువురు సినీ ప్రముఖులు, అభిమానులు సంతాపం తెలియజేస్తున్నారు.
ఇక, విజయ్ ఆంటోని గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. బిచ్చగాడు సినిమాతో తెలుగులో ఆయన బాగాఈ పాపులర్ అయ్యారు. ఆ సినిమాకు సీక్వెల్ బిచ్చగాడు 2 తమిళంలో కంటే తెలుగులోనే భారీగా వసూళ్లు రాబట్టిన విషయం తెలిసిందే.

## ఒక్క రోజు వ్యవధిలో రంగంలోకి వందకు పైగా యుద్ధవిమానాలు

**తైపీసెప్టెంబర్19 :** తైవాన ను ఆక్రమించేందుకు చైనా ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు వార్తలు వస్తున్నాయి. తాజాగా 24 గంటల వ్యవధిలో చైనా సైన్యం 103 యుద్ధవిమానాలను తైవాన్ దిశగా పంపడం గమనార్హం. వాటిలో 40 యుద్ధవిమానాలు తైవాన్ జలసంధి 'మధ్య రేఖ'ను దాటినట్లు తైవాన్ రక్షణశాఖ ఆరోపించింది.

## హీరో నవదీప్ ఇంట్లో నార్కోటిక్స్ అధికారుల సోదాలు..

**టాలీవుడ్ డ్రగ్స్ కేసులో మరింత వేగంగా దర్యాప్తు**

**హైదరాబాద్,సెప్టెంబర్19 :** టాలీవుడ్ ఇండస్ట్రీలో డ్రగ్స్ కేసు మరోసారి తెరపైకి వచ్చింది. ఈ కేసులో ఇప్పటికే నిందితుడిగా ఉన్న నవదీప్ ఇంట్లో నార్కోటిక్ అధికారులు సోదాలు నిర్వహించారు. పోలీసులు సోదాలు నిర్వహిస్తున్న సమయంలో నవదీప్ ఇంట్లో లేరని తెలుస్తోంది. ఇటీవల మాదాపూర్ పోలీసులు నిర్వహించిన ఆపరేషన్?లో మొత్తం ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు. అలాగే ఈ కేసులో హీరో నవదీప్?ను డ్రగ్స్ కన్స్యూమర్?గా పేర్కొన్నారు. పోలీస్ రెయిడ్స్ లో పట్టుబడిన రాంచందర్ అనే వ్యక్తి ఇచ్చిన వాంగ్మూలంతో నవదీప్ తనతో కలిసి డ్రగ్స్ తీసుకున్నట్లు రాంచందర్ తెలిపారు. దీంతో నార్కోటిక్ అధికారులు నవదీప్ ను ఈ కేసులో నిందితుడిగా చేర్చారు. చివరిసారిగా వీరిద్దరు కలిసి గత శనివారం డ్రగ్స్ తీసుకున్నట్లు బయటపెట్టాడని పోలీసులు తెలిపారు. ఈ కేసులో డ్రగ్స్ కన్స్యూమర్ గా ఉన్న నవదీప్ ను త్వరలోనే అరెస్ట్ చేస్తామని పోలీసులు పేర్కొన్నారు. అయితే డ్రగ్స్ కేసులో తనను అరెస్ట్ చేయవద్దని హైకోర్టును ఆశ్రయించాడు నవదీప్. దీనిపై విచారణ జరిపిన కోర్టు అతడిని అరెస్ట్ చేయవద్దని ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణలోగా కౌంటర్ దాఖలు చేయాలని స్పష్టం చేసింది. మాదాపూర్ డ్రగ్స్ కేసులో నవదీప్ ను సెప్టెంబర్ 19 వరకు అరెస్ట్ చేయవద్దని టీఎస్ హైకోర్టు పోలీసులను ఆదేశించింది. అయితే మంగళవారం నవదీప్ ఇంట్లో నార్కోటిక్ బ్యూరో సోదాలు నిర్వహించింది. అయితే సోదాలు నిర్వహించే సమయంలో నవదీప్ ఇంట్లో లేరని తెలుస్తోంది. ఇటీవల మాదాపూర్ పోలీసులు నిర్వహించిన ఆపరేషనా లో మాజీ ఎంపీ కుమారుడు, సినీ నిర్మాత సహా మరో ఎనిమిది మందిని తెలంగాణ నార్కోటిక్స్ అధికారులు అరెస్ట్ చేశారు. వారి నుంచి 50 గ్రాముల ఎండీఎంఏ, 24 ఎక్టసీ టాబ్లెట్స్, ఎనిమిది గ్రాముల కొకైన్ స్వాధీనం చేసుకున్నారు పోలీసులు. ఇక ఈ కేసులోనే టాలీవుడ్ హీరో నవదీప్ పేరును ప్రస్తావించారు.

## ఆరు గ్యారెంటీల పేరుతో మోసం చేస్తున్న కాంగ్రెస్

**కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు కాదు.. ముందుగా ఆ మూడు హామీలు ఇవ్వాలి**

**బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ**

**హైదరాబాద్,సెప్టెంబర్19:** ప్రపంచ దేశాల్లో భారత్?ను అగ్రస్థానంలో నిలిపేందుకు ప్రధాని నరేంద్ర మోదీ కృషి చేస్తుంటే.. కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు, మత విద్వేషాలు రెచ్చగొడుతున్నాయని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ మండిపడ్డారు. ఆరు గ్యారెంటీల పేరుతో తెలంగాణ ప్రజలను కాంగ్రెస్ మోసం చేయాలని చూస్తోందని.. కాంగ్రెస్ పార్టీ ముందుగా మూడు హామీలు ఇవ్వాలని హితవు పలికారు. కాంగ్రెస్ తుక్కుగూడ విజయభేరి సభలో ఆచరణ సాధ్యం కాని హామీలను ప్రకటించిందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ ముందుగా ప్రజలకు మూడు గ్యారెంటీలు ఇవ్వాలని హితవు పలికారు. కాంగ్రెస్ పార్టీలో గెలిచిన ఎమ్మెల్యేలు పార్టీ మారారని గ్యారెంటీ ఇవ్వాలన్నారు, స్కాంలు, కుంభకోణాలు చేయమని, తెలంగాణ చరిత్రను తప్పుదారి పట్టించమని గ్యారంటీ ఇవ్వాలని డీకే అరుణ డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ విశ్వాసం కోల్పోయిందని.. మత విద్వేషాల పేరుతో ప్రజలను రెచ్చగొట్టి బీజేపీపై విషం చిమ్మి లబ్ధి పొందాలని చూస్తోందని ఆరోపించారు. ఆరు గ్యారెంటీల పేరుతో తెలంగాణ ప్రజలను కాంగ్రెస్ మోసం చేయాలని చూస్తోందని మండిపడ్డారు. కర్ణాటకలో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నారా?, 4 వేల ఫించన్ ఇస్తున్నారా? అని ప్రశ్నించారు. అధికార ఆకాంక్ష తప్పితే దేశ అభివృద్ధి మీద ధ్యాస లేదన్నారు. విచ్చలవిడిగా ఉచితాలతో కర్ణాటకలో ఆర్టీసీ పరిస్థితి అధ్వాన్నంగా తయారైందని.. ప్రైవేట్ పరం చేయాలని చూస్తున్నారన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా బీజేపీ ఎన్నికల మేనిఫెస్టో ఉంటుందని స్పష్టం చేశారు. కవిత, కేసీఆర్ లేఖ రాస్తే.. మోదీ మహిళా బిల్లు పెడుతున్నట్లు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. మహిళలను గౌరవించే అలవాటు కేసీఆర్?కు లేదని విమర్శించారు. కేసీఆర్ ప్రకటించిన అసెంబ్లీ స్థానాల్లో మహిళలకు కనీసం 15 శాతం కూడా ఇవ్వలేదని దుయ్యబట్టారు. బీఆర్?ఎస్? కమిటీల్లో మహిళలకు కీలక బాధ్యత ఎక్కడైనా ఉందా ? అని ప్రశ్నించారు.

## రాయ్‌గఢ్‌లో దొంగల బీభత్సం..

**బ్యాంకులో కత్తి చూపించి బంగారం, డబ్బుతో పరారు**

**రాయ్‌గఢ్,సెప్టెంబర్19:** ఛత్తీస్‌గఢ్ లోని రాయ్‌గఢ్‌లో దొంగలు బీభత్సం సృష్టించారు. ఓ బ్యాంకులో మంగళవారం తెల్లవారుజామున భారీ దోపిడీ జరిగింది. ఉదయం బ్యాంకు తెరిచిన తర్వాత కొందరు దుండగులు హఠాత్తుగా బ్యాంకులోకి ప్రవేశించారు. తొలుత బ్యాంకు మేనేజర్‌ను కత్తితో పొడిచిన దుండగులు.. మిగిలిన బ్యాంకు ఉద్యోగులను బందీలుగా చేసుకుని నగదు, బంగారం, వెండితో పరారయ్యారు. బ్యాంకులో ఎంత మొత్తం దోచుకున్నారు అనే దానిపై ఇంకా స్పష్టత లేదు. అయితే దొంగలు ఎంత దోచుకెళ్లారోనని బ్యాంకు ఉద్యోగులు లెక్కలు వేస్తున్నారు. అయితే కోట్లాది రూపాయల దోపిడీ జరిగినట్లు భావిస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. జిల్లాలోని ధీమ్రాపూర్ చౌక్‌లోని యాక్సిస్ బ్యాంక్‌లో ఈరోజు ఉదయం చోరీ జరిగింది. ఉదయం బ్యాంకు తెరుస్తుండగా ముసుగులు ధరించిన వ్యక్తులు ఆయుధాలతో బ్యాంకులోకి ప్రవేశించి ఉద్యోగులందరినీ బందీలుగా పట్టుకున్నారు. అంతేకాకుండా బ్యాంకు మేనేజర్‌పై అగంతకులు కత్తితో దాడి చేశారు. ఘటన అనంతరం దుండగులు డబ్బుతో పరారయ్యారు. ఈ ఘటనపై బ్యాంకు ఉద్యోగులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. అనంతరం పోలీసు ఉన్నతాధికారులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. బ్యాంకులో పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. సుమారు 10 గంటల సమయంలో బ్యాంకు అధికారులు డయల్ 112కు సమాచారం అందించారని రాయ్‌గఢ్ ఎస్పీ సదానంద్ కుమార్ మీడియాకు తెలిపారు. కొందరు గుర్తు తెలియని దుండగులు దోపిడీకి పాల్పడ్డారని తెలిపారు. దీంతో రాయ్‌గఢ్ పోలీసుల బృందం అంతా వెంటనే బ్యాంకుకు చేరుకున్నారు. బ్యాంకు మేనేజర్ తొడపై కత్తితో పొడిచి మిగతా సిబ్బందిని బందీలుగా పట్టుకుని దోచుకున్నారని ఎస్పీ పేర్కొన్నారు. అనంతరం దుండగులు పరారీ అయ్యారని.. వారి కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయని తెలిపారు. మరోవైపు దుండగులు ఎంత దోచుకున్నారని బ్యాంకు అధికారులు ధృవీకరించలేదు. బ్యాంకులోని సీసీటీవీని దుండగులు ధ్వంసం చేయగా. దానిని బ్యాకప్ చేస్తున్నారు. అంతేకాకుండా.. రాయ్‌గఢ్ పొరుగు జిల్లాలు, పొరుగు రాష్ట్రాల్లో పోలీసులు చెక్ పోస్టులు ఏర్పాటు చేస్తున్నారు. రాయగఢ్ జిల్లా ఒడిశా రాష్ట్రానికి అనుసంధానం కావడం గమనార్హం. ఈ ఘటనపై రాయ్‌ఘర్ పోలీసులు.. ఒడిశా పోలీసుల ను సంప్రదిస్తున్నారు. నిందితులను అరెస్టు చేయడానికి జిల్లా సరిహద్దులో భారీ భద్రతను ఏర్పాటు చేస్తున్నారు.

prajamantalau daily pages (20-09)(4 pages)_vijayatha pages (11-01) dummy pages 1,2 pages.qxd 9/20/2023 6:56 AM Page 8



# మళ్లీ నాగచైతన్యతో నటించనున్న సాయి పల్లవి

నాగ చైతన్య, దర్శకుడు చందు మొండేటి నిజ సంఘటనల ఆధారంగా ఒక సినిమాను తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాకి గీత ఆర్ట్స్ , బన్నీ వాసు నిర్మాత. ఈ సినిమా గురించి కొన్ని రోజుల క్రితం బన్నీ వాసు, నాగ చైతన్య, చందు అందరూ శ్రీకాకుళం దగ్గరలో వున్న సముద్ర తీరానికి వెళ్లి అక్కడ నివసిస్తున్న వారిని స్వయంగా పరిశీలించారు. అలాగే సముద్రం మీదకి కూడా బోట్స్ లో వెళ్లారు.ఈ సినిమా మీద చాలా రీసెర్చ్ చేసినట్టుగా తెలుస్తోంది. సముద్రం మీద చేపలు పట్టి బతికేవారి జీవనశైలి ఆధారంగా ఈ సినిమా నేపథ్యం ఉండొచ్చు అని అంటున్నారు. ఆలా సముద్రం మీద చేపలు పట్టడానికి వెళ్లి, ఒక్కోసారి దాని తెలియక, వేరే దేశాలకు వెళ్లిపోయిన వారు కూడా వున్నారు. ఆలా కొన్ని వందలమంది వేరే దేశాల్లో ఇప్పటికీ వుంటున్నట్టుగా తెలిసింది. ఈ నేపథ్యంలో ఒక ప్రేమ కథని దర్శకుడు చందు రాసాడని, ఇలా కొన్ని యదార్ధ సంఘటనలు ఇందులో ఉండొచ్చు అని అంటున్నారు. అయితే ఇందులో కథానాయిక ఎవరు అనేది మాత్రం ఈ చిత్ర నిర్వాహకులు ఇంతవరకు చెప్పలేదు. ఈరోజు ఎన్.సి 23 లో చేరబోయే అమ్మాయి ఈమె అని ఒక వీడియో విడుదల చేశారు కానీ అందులో ఆమె ముఖం మాత్రం చూపించలేదు. కానీ ఆ వీడియోలో చందు బోర్డు మీద మాత్రం కాజల్, అన్నపూర్ణ అని పేర్లు మాత్రం రాసాడు, అది వీడియోలో వుంది. కానీ ఆ అమ్మాయి ముఖం మాత్రం చూపించలేదు. అయితే తాజా సమాచారం ప్రకారం ఆ అమ్మాయి ఎవరో కాదు, సాయి పల్లవి అని అంటున్నారు. సాయి పల్లవి ఇంతకు ముందు నాగ చైతన్యతో 'లవ్ స్టోరీ' చఒనీలమాబినీతీఎ సినిమా చేసింది, అది చాలా పెద్ద హిట్ అయింది. అదే పెయిర్ ని ఇందులో కూడా అనుకున్నారని, అదీ కాకుండా ఇందులో కథానాయికకు కూడా చాలా ప్రాముఖ్యం ఉందని, అందుకని సాయి పల్లవి అయితేనే సరిపోతుందని చిత్ర నిర్వాహకులు అనుకున్నారని తెలిసింది. ఇంతకీ ఆ అమ్మాయి ముఖం ఎప్పుడు చూపిస్తారో చూడాలి !



# కళ్యాణ్ రామ్ ను 'మాయ' చేసిన సంయుక్త!




నందమూరి కళ్యాణ్ రామ్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'డెవిల్', 'బ్రిటీష్ సీక్రెట్ ఏజెంట్' ట్యాగ్ లైన్. ఇక ఈమధ్యన రిలీజైన ఈ మూవీ టీజర్‌కి అమేజింగ్ రెస్పాన్స్ రావడంతో పాటు సినిమాపై ఉన్న అంచనాలు మరింత పెరిగాయి. ఈ సినిమా కోసం అభిమానులు, ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇక 'డెవిల్' మూవీ నవంబర్ 24న ప్రపంచ వ్యాప్తంగా భారీ ఎత్తున్న రిలీజ్ అవుతున్న నేపథ్యంలో డెవిల్ సినిమా నుంచి 'మాయే చేశావే..' అనే పాటను మొదటి సాంగ్‌గా మేకర్స్ రిలీజ్ చేశారు. 'మాయే చేశావే..' పాటను గమనిస్తే ఇదొక అద్భుతమైన మెలోడీ సాంగ్ లా ఉంది. పాట వింటున్నప్పుడు ప్రేక్షకులు అందమైన ఫీల్ కి లోనవుతారు. స్వాతంత్ర్యం రాక ముందు ఉన్న బ్యాక్ డ్రాప్‌తో డెవిల్ సినిమాను తెరకెక్కించగా సన్నివేశాలు, పాటలను కూడా అలాగే షూట్ చేశారు. కాస్ట్యూమ్స్, బ్యాగ్రౌండ్ ఇలా ప్రతీ విషయంలో మేకర్స్ పలు జాగ్రత్తలను తీసుకున్న మేకర్స్ పాటలు, డైలాగ్స్ విషయంలో కూడా అదే కేర్ తీసుకున్నారు. ఇక ఈ సాంగ్ ను స్టార్ సింగర్ సిద్ శ్రీరామ్ పాడటం ఇంకా హైలైట్‌గా నిలవగా కచ్చితంగా ఆడియెన్స్ ప్లే లిస్ట్ లో రిపీటెడ్ సాంగ్ అవుతుందని అంటున్నారు. ఈ పాటకు బృంద మాస్టర్ కొరియోగ్రఫీ చేయగా హర్షవర్ధన్ రామేశ్వర్ సూపర్బ్ రెట్రో ట్రాక్‌ను అందించారు. కళ్యాణ్ రామ్, సంయుక్త మధ్య అద్భుతమైన కెమిస్ట్రీ కలిపి మాయే చేశావే.. సాంగ్‌తో మేకర్స్ ఓ ఎగ్జయిటింగ్ మ్యూజికల్ జర్నీని స్టార్ట్ చేసి ప్రేక్షకుల హృదయాలను ఆకట్టుకున్నారు. అభిషేక్ పిక్చర్స్ నిర్మాణ సంస్థ ఈ సినిమాను అన్‌కాంప్రమైజ్డ్‌గా నిర్మించింది. ప్రొడక్షన్ డిజైనర్ గాంధీ నడికుడికర్ వేసిన ఎక్స్‌ట్రార్డినరీ సెట్స్ విజువల్ రిచ్‌నెస్‌ను తీసుకు రాగా సౌందర్ రాజ్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా తమ్మిరాజు ఎడిటర్ బాధ్యతలను నిర్వహిస్తున్నారు.

# భారీ ఎత్తున 'లియో' ఈవెంట్!




కార్తితో కలిసి ఖైదీ సినిమాతో సాలిడ్ హిట్ కొట్టాడు లోకేష్ కనగరాజ్. ఇదే జోష్‌లో విజయ్‌తో 'మాస్టర్' సినిమా చేశాడు కానీ ఈ మూవీ విజయ్ ఫ్యాన్స్‌ను డిసప్పాయింట్ చేసింది. ఆశించిన స్థాయిలో మాస్టర్ మెప్పించలేకపోయింది. అందుకే.. ఆ లోటును తీర్చడానికి ఇప్పుడు 'లియో' సినిమాతో రాబోతున్నాడు లోకేష్ కనగరాజ్. కమల్ హాసన్‌తో 'విక్రమ్' వంటి సాలిడ్ హిట్ కొట్టిన లోకేష్.. విజయ్‌తో అంతకుమించి హిట్ కొట్టాలని చూస్తున్నాడు. ఈ పాన్ ఇండియా మూవీ అక్టోబర్ 19న రిలీజ్ కానుంది. ఇప్పటికే రిలీజ్ అయిన లియో ఫస్ట్ సాంగ్, అనౌన్స్ మెంట్ గ్లింప్స్ అంచనాలను భారీగా పెంచేసింది. రీసెంట్‌గా బ్యాక్ టు బ్యాక్ లియో పోస్టర్స్ రిలీజ్ చేస్తున్నారు మేకర్స్. ప్రస్తుతం లియో పోస్టర్స్ సోషల్ మీడియాను షేక్ చేస్తున్నాయి. ఇక రిలీజ్ టైం దగ్గర పడుతుండడంతో లియో ప్రమోషన్స్ స్పీడప్ చేశారు. త్వరలోనే సెకండ్ సాంగ్ రిలీజ్‌కి ప్లాన్ చేస్తున్నారు. ఈ క్రమంలో ఆడియో లాంచ్ ఈవెంట్‌ని గ్రాండ్‌గా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు కోలీవుడ్ వర్గాల సమాచారం. సెప్టెంబర్ 30న చెన్నైలోని నెహ్రూ ఇండోర్ స్టేడియంలో భారీ ఎత్తున ఈవెంట్ నిర్వహించేందుకు ప్లాన్ చేస్తున్నాట్టు తెలుస్తోంది. రేపో మాపో ఈ ఈవెంట్ పై అఫీషియల్ అనౌన్స్మెంట్ రానుందని అంటున్నారు. ఈ ఈవెంట్‌కు విజయ్ ఫ్యాన్స్ భారీ ఎత్తున తరలి రానున్నారు. ఇక త్రిష హీరోయిన్‌గా నటిస్తున్న ఈ మూవీలో యాక్షన్ కింగ్ అర్జున్, సంజయ్ దత్ కీలక పాత్రలు చేస్తుండగా.. అనిరుధ్ మ్యూజిక్ అందిస్తున్నాడు.

# జైలర్ సినిమా విజయానికి కారణామిదే..?



సూపర్ స్టార్ రజినీకాంత్ నటించిన 'జైలర్' సూపర్ హిట్ అయిన సంగతి తెలిసిందే. ఈ సినిమా సుమారు రూ.600 కోట్లకి పైగా బాక్స్ ఆఫీస్ దగ్గర వసూలు చేసింది. నెల్సన్ దీనికి దర్శకుడు కాగా అనిరుధ్ రవిచందర్ దీనికి సంగీత దర్శకుడు. ఈ సినిమాని కళానిధి మారన్ నిర్మించారు. ఈ సినిమా ఘన విజయం సాధించటంతో ఈ సినిమా విజయోత్సవాలు చెన్నైలో నిర్వహించారు. ఈ సినిమా విజయం తెలిసిన వెంటనే నిర్మాత కళానిధి, ఇందులో నటించిన రజినీకాంత్ కి, దర్శకుడికి, సంగీత దర్శకుడికి ఖరీదైన కార్లను బహూకరించారు. ఈ సినిమా విజయోత్సవాల ఉత్సవంలో రజినీకాంత్ తనదైన రీతిలో మాట్లాడారు. నిర్మాత కళ సర్ నాకు కారు గిఫ్ట్ గా ఇచ్చారు, ఆ కారులోనే ఇప్పుడు వచ్చాను. అలాగే ఈ సినిమా కోసం పని చేసిన వారందరికీ గోల్డ్ కాయిన్స్ ఇచ్చారు నిర్మాత, ఇది చాలా మంచి పద్ధతి, ఒక్క తమిళ నాటే కాదు, భారతదేశ చిత్ర పరిశ్రమకే అతని చేసిన పరి గర్వకారణము అవుతుంది అని రజినీ అన్నారు. ఇక ఈ 'జైలర్' సినిమా ఎబోవ్ యావరేజ్ అవుతుందని నేను అనుకున్నాను. కానీ ఈ సినిమాకి అనిరుధ్ రవిచందర్ నేపథ్య సంగీతం చాలా బాగా ఇవ్వటంతో, ఈ సినిమా చాలా పెద్ద హిట్ అయింది. అతను తన సంగీతంతో ఈ సినిమాని ఎక్కడికో తీసుకెళ్లాడు, తన స్నేహితుడు, దర్శకుడు నెల్సన్ కి హిట్ ఇవ్వాలని నేపథ్య సంగీతం బాగా అందించాడు, సినిమా హిట్ అయింది అని చెప్పారు రజిని. అలాగే ఈ సినిమాలో మోహన్ లాల్, శివరాజ్ కుమార్‌లను దర్శకుడు చూపించిన తీరు చాలా బాగుంది అని కూడా ప్రశంసించారు రజినీకాంత్. ఈ సినిమా విడుదల తరువాత చాలా ఆనందంగా వున్నాను అని, కానీ ఇప్పుడు మళ్ళీ టెన్షన్ వచ్చిందని తనదైన శైలిలో చెప్పారు. ఎందుకంటే ఈ సినిమా ఇంత పెద్ద హిట్ అయ్యాక, తన తరువాతి సినిమా ఇంతకన్నా పెద్దగా ఎలా ఇవ్వాలని టెన్షన్ మొదలైందని చెప్పారు. ఈ సినిమా ఇప్పుడు అమెజాన్ ప్రైమ్‌లో స్ట్రీమింగ్ అవుతోంది, అక్కడ కూడా రికార్డు స్థాయిలో చూస్తున్నారు.

# చంద్రబాబు అరెస్టుపై సురేష్ స్పందన



ప్రముఖ నిర్మాత దగ్గుబాటి సురేష్ బాబు చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టు మీద స్పందించారు. అయితే అది చాలా సున్నితమైన సమస్య అని, చిత్ర పరిశ్రమ ఎప్పుడూ రాజకీయంగా, మతపరంగా ఎటువంటి ప్రటకనలు ఇవ్వదని, అందుకని దీని మీద కూడా ఎటువంటి ప్రకటన ఇవ్వలేరని చెప్పారు. "పరిశ్రమ ఎప్పుడూ రాజకీయంగా ప్రకటనలు ఇవ్వటం మంచిది కాదు. ఎందుకంటే మేము రాజకీయనాయకులం కాదు, మేము మీడియా వాళ్ళం కాదు, మేము సినిమాలు నిర్మించడానికి వచ్చాం, సినిమాలు తీస్తాం. నన్ను అడిగితే కనక, చిత్ర పరిశ్రమ రాజకీయాల ప్రకటనలు ఇవ్వటం మంచిది కాదు అని అనుకుంటు న్నాను", అని చెప్పారు సురేష్ బాబు. చంద్రబాబు నాయుడు చిత్ర పరిశ్రమకి చాలా చేశారు, అందుకని అతని అరెస్టు గురించి చిత్ర పరిశ్రమలో ఎక్కువమంది స్పందించటం లేదు అని అడిగినప్పుడు, సురేష్ బాబు స్పందిస్తూ పరిశ్రమకి చాలామంది చాలా చేశారు అని చెప్పారు. "మా నాన్నగారు (రామానాయుడు) తెలుగు దేశం మెంబెర్, నేను పార్టీ కి పని చేసాను. అది మా వ్యక్తిగతం. కానీ పరిశ్రమకి వచ్చినప్పుడు నేను ఫిలిం ఛాంబర్ ప్రెసిడెంట్ గా నేను పరిశ్రమకి చెందిన వాళ్ళం, అందుకని నేను దానిగురించి మాట్లాడలేను," అని చెప్పారు సురేష్ బాబు. చాలామంది ముఖ్యమంత్రులు పరిశ్రమకి చాలా చేశారు అని ఎన్టీఆర్ గారు చాలా చేశారు. చెన్నారెడ్డి గారు అయితే చాలా హెల్ప్ చేశారు, తరువాత ఎన్టీఆర్ గారు చేశారు. చంద్రబాబు గారు కూడా చిత్ర పరిశ్రమకి చాలానే చేశారు. కానీ చిత్ర పరిశ్రమ స్పందించటం లేదు అన్నది కరెక్టు కాదు. ఎందుకంటే చంద్రబాబు నాయిడు అరెస్టు అనేది చాలా సున్నితమైన ఇష్యూ. ఆంధ్రా, తెలంగాణ గొడవలప్పుడు కూడా పరిశ్రమ నుండి ఎటువంటి స్పందన రాలేదు, ఎందుకంటే పరిశ్రమ ఎప్పుడూ రాజకీయ ప్రకటనలకు దూరంగా వుంది. వ్యక్తిగతంగా ఎవరైనా కావాలంటే ఇచ్చుకోవచ్చు, కానీ పరిశ్రమ తరపున నాకు తెలిసి రాజకీయంగా స్పందించటం సరికాదు అని అనుకుంటున్నాను అని సురేష్ బాబు చెప్పారు.

## మెట్ పల్లి కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో "క్లీన్, గ్రీన్ "




**మెటుపల్లి సెప్టెంబర్ 19 (ప్రజా మంటలు) :** స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా జగిత్యాల జిల్లా మెట్ పల్లి పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం రోజున స్థానిక కళాశాల జాతీయ సేవా పథకం (ఎన్ ఎస్ ఎస్) విభాగం ఆధ్వర్యంలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బూర్ల చంద్రశేఖర్, ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం అధికారి కే. వేంకయ్య,బోధన,బోధనేతర సిబ్బంది మరియు విద్యార్థినీ విద్యార్థులు తదితరులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా గడ్డపారలు,పారల సహాయంతో కళాశాల ప్రాంగణంలో గల చెత్త,చెదారాన్ని తొలగించారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని గ్రామాల్లో పరిశుభ్రత ఉంటే ప్రజలు అన్ని రంగాల్లో రాణిస్తారన్న లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టాలని ఉన్నతాధికారులు అదేశాలివ్వడంతో కళాశాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బూర్ల చంద్రశేఖర్ మాట్లాడుతూ, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో గల ప్రజలు పరిశుభ్రతను పాటించినప్పుడే ఆరోగ్యంగా ఉంటారని ,అందువల్ల ఈ కార్యక్రమాన్ని అన్ని గ్రామాల్లో నిర్వహించాలని సూచించారు. ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం అధికారి కే. వేంకయ్య మాట్లాడుతూ, గత కొన్ని నెలల నుంచి కళాశాల ప్రాంగణం పిచ్చి మొక్కలతో పాటు చెత్త, చెదారంతో నిండి పోయిందని,శాతవాహన యూనివర్సిటీ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ శ్రీవాణి ఆదేశాల మేరకు కళాశాల ప్రాంగణంలో ఎన్ ఎస్ ఎస్ ఆధ్వర్యంలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని చేపట్టడంతో కళాశాల ప్రాంగణమంతా పరిశుభ్రతకు నిలయంగా తయారయ్యిందని ఆయన హర్షం వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులకు రిఫ్రెష్మెంట్ ను ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో కళాశాల ఇంగ్లీష్ సహాయ ఆచార్యులు బిల్ల రాజేందర్, లెక్చరర్లు మనోజ్ కుమార్, మధు బాబు, గట్టయ్య, అంజయ్య,దోస గణేష్,బోధనేతర సిబ్బంది అన్వేష్,లక్ష్మీనారాయణ, బాబు, మునీర్, లింగం, భూ లక్ష్మీ, విద్యార్థినీ,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తరప్రదేశ్‌లో గర్భిణీ స్త్రీలకు కానుక

**ఉత్తరప్రదేశ్,సెప్టెంబర్19 :** ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ గర్భిణీ స్త్రీలకు కానుక అందించారు. వారికి పోషకాహార కిట్ ను పంపిణీ చేశారు. దాంతో పాటు బేబీ షవర్ కిట్ ను ఇచ్చారు. సోమవారం లోక్‌భవన్‌లో ఏర్పాటు చేసిన జాతీయ పౌష్టికాహార మాస కార్యక్రమంలో ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ఒకప్పుడు యూపీలో మద్యం మాఫియా పౌష్టికాహారం సరఫరా చేసేదని.. తమ ప్రభుత్వం వచ్చాక కొత్త యంత్రాంగాన్ని రూపొందించిందని తెలిపారు. అంతేకాకుండా.. రాష్ట్రంలో ఎన్సెఫాలిటిస్ తో ప్రతి సంవత్సరం 1200-1500 మరణాలు సంభవించేవని.. తూర్పు ఉత్తరప్రదేశ్ ఈ వ్యాధితో గణనీయంగా ప్రభావితమైందని సీఎం యోగి అన్నారు.

# తొలి రెండు మ్యాచ్‌ల్లో విరాట్ కోహ్లీకి విశ్రాంతి

### ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌కు టీమిండియా జట్టు ప్రకటన





ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌కు టీమిండియాను ప్రకటించారు. తొలి రెండు మ్యాచ్‌లకు కేఎల్ రాహుల్ కెప్టెన్సీ వహించగా, మూడో మ్యాచ్‌లో కెప్టెన్ రోహిత్ శర్మ పునరాగమనం చేయనున్నాడు. తొలి రెండు మ్యాచ్‌ల్లో విరాట్ కోహ్లితో పాటు ఇతర సీనియర్ ఆటగాళ్లకు కూడా విశ్రాంతి కల్పించారు. రవిచంద్రన్ అశ్విన్ వన్డే జట్టులోకి తిరిగి రావడం, ఇప్పుడు ప్రపంచకప్ జట్టులో కూడా కనిపించడం పెద్ద విషయం.

తొలి 2 వన్డేలకు టీం ఇండియా: కేఎల్ రాహుల్ (కెప్టెన్), శుభ్‌మన్ గిల్, రుతురాజ్ గైక్వాడ్, శ్రేయాస్ అయ్యర్, ఇషాన్ కిషన్, సూర్యకుమార్ యాదవ్, రవీంద్ర జడేజా, శార్దూల్ ఠాకూర్, జస్‌ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్, మహ్మద్ షమీ, తిలక్ వర్మ, ప్రసీద్ రవిచంద్రన్ అశ్విన్, వాషింగ్టన్ సుందర్. మూడో వన్డేకి టీమిండియా: రోహిత్ శర్మ (కెప్టెన్), హార్దిక్ పాండ్యా (వైస్ కెప్టెన్), శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లీ, శ్రేయాస్ అయ్యర్, సూర్యకుమార్ యాదవ్, కేఎల్ రాహుల్ (కీపర్), ఇషాన్ కిషన్ (కీపర్), రవీంద్ర జడేజా, శార్దూల్ ఠాకూర్ ., అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్, రవిచంద్రన్ అశ్విన్, జస్ప్రీత్ బుమ్రా, మహ్మద్ షమీ, మహ్మద్ సిరాజ్. తొలి రెండు మ్యాచ్‌ల్లో టీమిండియా సీనియర్ ఆటగాళ్లకు విశ్రాంతినిచ్చామని సెలక్టర్లు ప్రకటించారు. ఇందులో విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, హార్దిక్ పాండ్యా, కుల్దీప్ యాదవ్‌లు ఉన్నారు. సీనియర్ ఆటగాళ్లందరూ నిరంతరం ఆడుతున్నారని, అందుకే వారికి తొలి రెండు మ్యాచ్‌ల్లో విశ్రాంతినిచ్చామని, ఆసియాకప్‌లో అవకాశం రాని ఆటగాళ్లను ఇక్కడ పరీక్షించామని చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ తెలిపారు. మా ఆటగాళ్లందరూ సిద్ధంగా ఉన్నారని, చివరి మ్యాచ్‌లో సీనియర్ ఆటగాళ్లు పునరాగమనం చేస్తారని, ఆ తర్వాత రెండు ప్రాక్టీస్ మ్యాచ్‌ల్లో కూడా లయలోకి వచ్చేందుకు ఇబ్బంది ఉండదని కెప్టెన్ రోహిత్ శర్మ అన్నాడు. ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌కు టీమిండియాను ప్రకటించారు. అయితే, ఈ సిరీస్‌లో తొలి రెండు మ్యాచ్‌ల్లో విరాట్ కోహ్లీ కనిపించడు. మొహాలీ, ఇండోర్‌లలో జరగనున్న 2 మ్యాచ్‌ల నుంచి విరాట్ కోహ్లీకి విశ్రాంతినిచ్చారు. అయితే ఈ ప్రకటన తర్వాత కోహ్లీ అభిమానులు బీసీసీఐ చర్యపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎందుకంటే, కింగ్ కోహ్లీ ఇప్పుడు మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ వన్డే సెంచరీ రికార్డును బద్దలు కొట్టే దశలో ఉన్నాడు. దీంతో విరాట్ కోహ్లీకి నిరంతరం విశ్రాంతి ఇస్తున్నారంటూ సోషల్ మీడియాలో ఫ్యాన్స్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంతకుముందు వెస్టిండీస్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో అతనికి విశ్రాంతి లభించింది. ఆ తర్వాత బంగ్లాదేశ్‌తో సిరీస్‌కు కూడా దూరమయ్యాడు. ఇప్పుడు ఆస్ట్రేలియాతో జరిగిన తొలి రెండు మ్యాచ్‌లకు అతనికి విశ్రాంతి లభించింది.

విరాట్ కోహ్లీ అత్యుత్తమ ఫామ్‌లో ఉన్నప్పుడు అతనికి ఎందుకు నిరంతరం విశ్రాంతి ఇస్తున్నారనే ప్రశ్నలను అభిమానులు లేవనెత్తుతున్నారు. ఎందుకంటే ఈ ఏడాది వన్డే క్రికెట్‌లో కోహ్లీ 5 సెంచరీలు సాధించాడు. అన్ని మ్యాచ్‌లు ఆడి ఉంటే ఇప్పటికే సచిన్ టెండూల్కర్ ప్రపంచ రికార్డును బ్రేక్ చేసి ఉండేవాడు. ఈ రికార్డును కాపాడుకునేందుకే కోహ్లీకి విశ్రాంతి ఇస్తున్నారని అభిమానులు వాదిస్తున్నారు. మరికొందరు ఇంకో అడుగు ముందుకేసి ముంబై లాబీయింగ్ అంటూ ఆరోపిస్తున్నారు. సచిన్ రికార్డులను కాపాడేందుకు ముంబైకి చెందిన టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ, సెలక్షన్ కమిటీ చీఫ్ అజిత్ అగార్కర్ ఇలాంటి నిర్ణయం తీసుకున్నారంటూ కొందరు సోషల్ మీడియాలో రాసుకొస్తున్నారు. అద్భుత ఫామ్‌లో ఉన్న విరాట్ కోహ్లీ ఇటీవల ముగిసిన ఆసియాకప్‌లో పాకిస్థాన్‌పై అద్భుత సెంచరీ చేశాడు. ఈ సెంచరీతో వన్డే క్రికెట్‌లో 47వ సెంచరీని నమోదు చేశాడు. ఇప్పుడు వన్డే క్రికెట్‌లో అత్యధిక సెంచరీ రికార్డును నమోదు చేసేందుకు విరాట్ కోహ్లీకి కేవలం 3 సెంచరీలు మాత్రమే కావాలి. సచిన్ టెండూల్కర్ 49 సెంచరీలతో అగ్రస్థానంలో ఉన్నాడు. ఈ వన్డే ప్రపంచకప్ ద్వారా కింగ్ కోహ్లీ ఈ రికార్డును బద్దలు కొట్టడం ఖాయమన్నాడు. ఎందుకంటే ప్రపంచకప్‌లో టీమిండియా తొలి రౌండ్‌లో మొత్తం 9 మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. విరాట్ కోహ్లీ బ్యాట్‌తో 3 సెంచరీలు సాధిస్తే వన్డే క్రికెట్ చరిత్రలో 50 సెంచరీలు చేసిన తొలి బ్యాట్స్‌మెన్‌గా రికార్డులకెక్కనున్నాడు.

**ఆస్ట్రేలియాతో మ్యాచ్‌లకు ఎంపికైన టీమిండియా:**

ఆస్ట్రేలియాతో తొలి రెండు వన్డేలకు భారత జట్టు: కేఎల్ రాహుల్ (కెప్టెన్), శుభ్‌మన్ గిల్, రుతురాజ్ గైక్వాడ్, శ్రేయాస్ అయ్యర్, ఇషాన్ కిషన్, సూర్యకుమార్ యాదవ్, రవీంద్ర జడేజా, శార్దూల్ ఠాకూర్, జస్‌ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్, మహ్మద్ షమీ, పర్ధిష్ కృష్ణ వర్మ, , రవిచంద్రన్ అశ్విన్, వాషింగ్టన్ సుందర్.

**ఆస్ట్రేలియాతో మూడో వన్డేకు భారత జట్టు:** రోహిత్ శర్మ (కెప్టెన్), హార్దిక్ పాండ్యా (వైస్ కెప్టెన్), శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లీ, శ్రేయాస్ అయ్యర్, సూర్యకుమార్ యాదవ్, కెఎల్ రాహుల్ (వికెట్ కీపర్), ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), రవీంద్ర జడేజా , శార్దూల్ ఠాకూర్, కుల్దీప్ యాదవ్, జస్ప్రీత్ బుమ్రా, మహ్మద్ షమీ, మహ్మద్ సిరాజ్, వాషింగ్టన్ సుందర్, ఆర్ అశ్విన్, అక్షర్ పటేల్ (ఫిట్ అయితే)...

### 20 రోజుల్లో 14 మ్యాచ్‌లు ఆడనున్న టీమిండియా

ఓ వైపు వన్డే ప్రపంచకప్‌నకు కౌంట్‌డౌన్ మొదలైంది. మరోవైపు భారత్-ఆస్ట్రేలియా మధ్య వన్డే సిరీస్‌కు కౌంట్‌డౌన్ మొదలైంది. అంటే సెప్టెంబర్ 22 నుంచి టీమ్ ఇండియా వరుస మ్యాచ్‌లు ఆడనుంది. ఎందుకంటే ఆస్ట్రేలియాతో సిరీస్ ముగిసిన వెంటనే వన్డే ప్రపంచకప్ సన్నాహాలు మొదలవుతాయి. దీంతో వచ్చే 20 రోజుల్లో టీమిండియా 14 మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. ఆస్ట్రేలియాతో భారత్ ఇక్కడ మూడు వన్డేల సిరీస్ ఆడనుంది. దీని తర్వాత వన్డే ప్రపంచకప్ కోసం భారత జట్టు 2 వార్మప్ మ్యాచ్‌లు ఆడనుంది. దీని తర్వాత వన్డే ప్రపంచకప్ కూడా ప్రారంభం కానుంది. కాబట్టి, మరో మూడు వారాల్లో భారత క్రికెట్ ప్రేమికులకు వినోదం ఫుల్‌గా దక్కనుంది.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL 2021/81092
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com